

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI


శుక్రవారం | 17-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 289 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: చవితి తె. 5.30 తదుపరి పంచమి; నక్షత్రం: మఖ మ. 12.45 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా.9.27-11.11; దుర్ముహూర్తం: ఉ.9.05-9.49, మ.12.47-1.31; అమృతఘడియలు: ఉ.10.12-11.54; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.58 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

'హిండెన్‌బర్గ్ రిసెర్చ్' 2

మూసివేత

వ్యవస్థాపకుడు నాథన్ అండర్సన్ ప్రకటన
ఎవరి ఒత్తిళ్లు, బెదిరింపులూ లేవని వెల్లడి
సంస్థను నడపడం సాహసం అని వ్యాఖ్య
జీవితంలో ఒక అధ్యాయంగా అభివర్ణన



సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

ముంబైలోని ఇంట్లోకి చొరబడి దుండగుడి దాడి 2
మొత్తం 6 చోట్ల కత్తిపోట్లు.. పనిమనిషికీ గాయాలు
కారు సిద్ధంగా లేక.. ఆటోలో ఆస్పత్రికి నటుడి తరలింపు
వెన్నెముక నుంచి 2.5 అంగుళాల కత్తి అంచు తొలగింపు
లీలావతి ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. నిలకడగా ఆరోగ్యం

12 మంది మావోయిస్టుల కాల్చివేత



3

రెండు కిలోమీటర్ల మేర వెంటాడిన భద్రతా దళాలు
తెలంగాణ సరిహద్దు మారేడుబాక అడవుల్లో ఘటన
వెయ్యిమందితో ఆపరేషన్.. భారీగా ఆయుధాల స్వాధీనం
మావోయిస్టుల సాంకేతిక టీమ్ కమాండర్ లొంగుబాటు

దోపిడీ దొంగల బీభత్సం

బీదర్‌లో సెక్యూరిటీ వాహనంపై దాడి.. గార్డు మృతి; మరొకరికి తీవ్రగాయాలు
ఏటీఎంలో నింపాల్సిన రూ.93 లక్షలతో పరార్.. హైదరాబాద్‌కు చేరిక
13 రాయ్‌పూర్ వెళ్లేందుకు యత్నం.. అఫ్జల్‌గంజ్ ట్రావెల్స్‌లో ఇద్దరికి బస్ టికెట్ కొనుగోలు
బ్యాగ్ తనిఖీతో ట్రావెల్స్ ఉద్యోగిపై కాల్పులు.. నిందితుల కోసం గాలింపు

ఇస్రో స్పేస్ డాకింగ్ విజయవంతం

ఇక అంతరిక్ష కేంద్రం

2035 నాటికి నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత్
ఐదు మాడ్యూళ్లను డాక్ చేయడం ద్వారా నిర్మాణం!
అందులో భాగంగానే స్పేస్ డాకింగ్ ప్రయోగ నిర్వహణ
2028 డిసెంబరు నాటికి తొలి మాడ్యూల్ లాంచింగ్
తర్వాత దశలవారీగా మిగతా 4 మాడ్యూళ్లు రోదసిలోకి
భూమికి 400 కిలోమీటర్ల ఎత్తున పరిభ్రమిస్తూ సేవలు



ఉపగ్రహాల డాకింగ్ ప్రతీకాత్మక చిత్రం

9

రోదసిలో కరచాలనం

స్పేడెక్స్ ఉపగ్రహాల అనుసంధానం సక్సెస్
గురువారం ఉదయం 9 గంటల సమయంలో
చేజర్, టార్గెట్ డాకింగ్ ప్రక్రియ పూర్తి
ఆ ఘనత సాధించిన 3 దేశాల సరసన భారత్
ఇస్రో శాస్త్రజ్ఞులకు ముర్ము, మోదీ ప్రశంసలు

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన ప్రతిష్ఠాత్మక స్పేస్ డాకింగ్ ప్రక్రియ విజయవంతమైంది! కొంత సమయం తేడాతో.. ఒకే లాంచింగ్ వాహనం ద్వారా నిర్దీత కక్ష్యలోకి ప్రవేశపెట్టిన 2 ఉపగ్రహాలూ సక్సెస్‌ఫుల్‌గా అనుసంధానమయ్యాయి! దీంతో భారతదేశం భవిష్యత్తులో ఒక దాని తర్వాత మరొకటిగా మాడ్యూళ్లను పంపి భారీ నిర్మాణాలను చేపట్టడానికి మార్గం సుగమమైంది. ప్రస్తుతం రోదసిలో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం తరహాలోనే.. 2035 నాటికి సొంతంగా అంతరిక్ష కేంద్రం (భారతీయ అంతరిక్ష స్టేషన్-బీఏఎస్) నిర్మించాలన్న ఇస్రో లక్ష్యానికి ఈ విజయం ఎంతగానో కీలకం. గురువారం 2 ఉపగ్రహాలను డాక్ చేసినట్టుగానే.. భవిష్యత్తులో ఐదు మాడ్యూళ్లను డాక్ చేయడం ద్వారా బీఏఎస్‌ను నిర్మించాలన్నది ఇస్రో లక్ష్యం. 2019లో.. అప్పటి ఇస్రో చీఫ్ కె.శివన్ బీఏఎస్ నిర్మాణానికి సంబంధించిన వివరాలను ప్రపంచానికి తొలిసారి వెల్లడించారు. 2030 నాటికి బీఏఎస్‌ను 20 టన్నుల బరువుతో నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కానీ.. కొవిడ్ కారణంగా ఆలస్యం జరిగింది. ఇప్పుడు.. మొత్తం ఐదు మాడ్యూళ్లతో బీఏఎస్‌ను నిర్మించాలన్నది ఇస్రో ప్రణాళిక. దాని బరువు దాదాపు 52 టన్నుల దాకా ఉంటుందని అంచనా. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలాగానే.. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో

మిగతా 9వ పేజీలో...



రేవంత్.. లై డిటెక్టర్‌కు సిద్ధమా?

ఎన్నిసార్లు విచారణకు పిలిచినా వస్తాను 12
పైసా అవినీతి జరగనప్పుడు ఇంకా కేసేమిటి?
తిప్పితిప్పి అవే ప్రశ్నలు అడుగుతున్నారు: కేటీఆర్
ఈడీ కార్యాలయం వద్ద కార్యకర్తల హడావుడి

ఫిరాయింపు ఎమ్మెల్యేలపై సుప్రీంకు బీఆర్ఎస్

పార్టీ మారిన పదిమందిపై 4 వారాల్లో నిర్ణయం
తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్లు

విదేశీ కరెన్సీలో ఎందుకు చెల్లించారు?

రిజర్వ్ బ్యాంక్ అనుమతి తీసుకున్నారా?
మంత్రిగా నిబంధనలు ఎలా ఉల్లంఘించారు?
మీ ఆదేశాలనే పాటించామని హెచ్ఎండీఏ
మాజీ చీఫ్ ఇంజనీర్ చెప్పారు కదా?
ఫార్ములా-ఈ కేసులో కేటీఆర్‌పై ఈడీ ప్రశ్నలు
అడిగిన వాటికే జవాబివ్వాలని స్పష్టీకరణ
అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి వాంగ్మూలం
ఆధారంగా ప్రశ్నలు.. స్టేట్‌మెంట్ రికార్డు
అంతా అధికారులే చూసుకున్నారన్న కేటీఆర్
7.30 గంటల విచారణ.. ఈడీకి 2 డాక్యుమెంట్లు

హైదరాబాద్, హిమాయత్‌నగర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'విదేశీ సంస్థ అయిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో)కు రూ.45.71 కోట్లకు సమానమైన మొత్తాన్ని విదేశీ కరెన్సీలో ఎందుకు చెల్లించారు? రిజర్వ్‌బ్యాంకు అనుమతి తీసుకున్నారా? విదేశీ కరెన్సీ నిధుల చెల్లింపులో పాటించాల్సిన నిబంధనలను మీరు ఎందుకు అనుసరించలేదు?' అంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. 'నాడు పురపాలకశాఖ మంత్రి హోదాలో మీరు

మిగతా 12వ పేజీలో...

ఏస్ నెక్స్ట్‌జెన్‌కు నోటీసులు 12

ఫార్ములా ఈ కేసులో రేపు విచారణకు ఏసీబీ పిలుపు



96 గంటల సుదీర్ఘ చర్చలు

దానివల్లే ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందానికి అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వం
హమాస్ వెనక్కి తగ్గేవరకూ ఆమోదించం: నెతన్యాహు
ఇజ్రాయెల్ వైదొలగితేనే బందీల విడుదల: హమాస్
ఒప్పందం ఘనత మాదే..
బైడెన్, ట్రంప్ ప్రకటనలు 2



కేటాయింపులపై విచారణ రాష్ట్రాల వారీగా

తొలుత సెక్షన్-3 కింద వాదన
ఆ తర్వాతే విభజన చట్టం సెక్షన్-89 కింద విచారణ
కృష్ణా ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు 13
ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్‌పై విచారణ
ఫిబ్రవరి 19 నుంచి వాదనలు
తెలంగాణ వాదనలవైపే మొగ్గు
అనుకూల పరిణామం: ఉత్తమ్

లిక్కర్ స్కాంలో భాగస్వాములను

ఓడించాం

ప్రధాన పాత్రధారి కేజ్రీవాల్‌ను ఇంటికి పంపిస్తాం
ఢిల్లీకి మోదీ, కేజ్రీ చేసిందేమీ లేదు: సీఎం రేవంత్
ఎన్నికల గ్యారెంటీలను ప్రకటించిన ముఖ్యమంత్రి
హామీల అమలు బాధ్యత తనదేనని భరోసా

తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

వివిధ ప్రాజెక్టులకు అటవీశాఖ అనుమతులివ్వండి
కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం వినతి
హైదరాబాద్ బస్సుల్ని ఈ-మోడల్లోకి మారుస్తాం
దీనికి సహకరించండి.. కుమారస్వామికి విజ్ఞప్తి

సింగపూర్, దావోస్‌కు రేవంత్

ఆరు రోజుల విదేశీ పర్యటనకు సీఎం బృందం



న్యూఢిల్లీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో భాగస్వామిగా ఉన్న వాళ్లను తెలంగాణలో ఓడించామని, ఇక ప్రధాన భాగస్వామి అర్వింద్ కేజ్రీవాల్‌ను ఓడించడానికి ఇప్పుడు ఢిల్లీకి వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మోదీ మూడుసార్లు ప్రధాని అయినా, కేజ్రీవాల్

మిగతా 13వ పేజీలో...

మొక్కు కోసం వెళ్లి

మృత్యు ఒడికి

షిర్డీ-ఔరంగాబాద్ రోడ్డులో ట్రక్కర్‌ను ఢీకొన్న వాహనం.. నలుగురి మృతి
మొక్కుకు తీసుకెళ్లిన శిశువు కూడా..
మరో నలుగురి పరిస్థితి విషమం
బాధితులది ఒకటే కుటుంబం 3
యాదాద్రి జిల్లా కొండగడప వాసులు



విజయవాడ హైవేపై

ట్రాఫిక్ జామ్

4.కి.మీ మేర నిలిచిపోయిన వాహనాలు
చిట్యాల రైల్వే బ్రిడ్జి వద్ద ఇరికిన కంటైనర్
ఏపీ నుంచి హైదరాబాద్‌కు ప్రజల రాక
నగరంవైపు రోడ్లపై వాహనాల బారులు

త్వరలో 8వ వేతన కమిషన్

నియామకానికి ప్రధాని మోదీ ఆమోదం
కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త
2026 జనవరి 1 నుంచి 'కొత్త జీతాలు'
గడువులోపు సంప్రదింపులకు కమిషన్

శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్

3,985 కోట్లు వ్యయం.. 4 ఏళ్లలో పూర్తి

విశాఖ ఉక్కుకు 11,500 కోట్ల ప్యాకేజీ!

న్యూఢిల్లీ, జనవరి 16: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్రం శుభవార్త వినిపించింది. ఏమాత్రం ఆలస్యం కాకుండా, సకాలంలో 'కొత్త జీతాలు' అందించేలా 8వ వేతన కమిషన్‌ను నియమించాలని నిర్ణయించింది. 2016 జనవరి 1వ తేదీ నుంచి 7వ వేతన కమిషన్ సిఫారసులు అమలులోకి వచ్చాయి. దీనికి సంబంధించి పదేళ్ల గడువు... ఈ ఏడాది చివరితో ముగుస్తుంది. 2026 జనవరి 1వ తేదీ సవరించిన వేతనాలు అందించేలా ప్రధాని నరేంద్ర మోదీ 8వ వేతన సవరణ కమిషన్‌కు ఆమోదం తెలిపినట్లు

మిగతా 2వ పేజీలో...





పెన్, పేపర్ విధానంలోనే నీట్

ఒకేరోజు, ఒకే షిఫ్ట్‌లో నిర్వహణ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వెల్లడి

న్యూఢిల్లీ, హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్)-2025 నిర్వహణపరంగా ఓ స్పష్టత వచ్చింది. నీట్‌ను మునుపటి మాదిరిగానే పెన్, పేపర్ విధానం (ఓఎంఆర్)లో నిర్వహించనున్నారు. ఒకేరోజు, ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహిస్తారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) మార్గదర్శకాల ప్రకారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రకటించింది. నీట్-2025ను ఓఎంఆర్ విధానంలో నిర్వహించాలా? కంప్యూటర్-బేస్డ్ టెస్ట్ (సీబీటీ) విధానంలో నిర్వహించాలా? అనే విషయంలో కేంద్ర విద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖలు నెలరోజులుగా మల్లగుల్లాలు పడ్డాయి. ఈ మేరకు కేంద్రమంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన రెండుసార్లు సమావేశం కూడా నిర్వహించారు. చివరికి ఓఎంఆర్ విధానంలోనే నిర్వహించాలని నిర్ణయించారు. ఇతర వివరాల కోసం అభ్యర్థులు ఎన్టీఏ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చని ఎన్టీఏ తెలిపింది.

ఏఐ కంటెంట్‌పై లేబుల్స్ తప్పనిసరి

» ఎన్నికల ప్రచారంలో ఏఐ.. పార్టీలకు ఈసీ సూచనలు

న్యూఢిల్లీ, జనవరి 16: రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచారంలో కృత్రిమ మేధ(ఏఐ)ను విరివిగా వినియోగిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం(ఈసీ) అప్రమత్తమైంది. ఏఐ సాయంతో రూపొందించిన ఫొటోలు, వీడియోలు, ఆడియో వంటివి ఓటర్లను ప్రభావితం చేస్తున్నాయని గుర్తించింది. దీంతో ఏఐ వినియోగం అంశంలో రాజకీయ పార్టీలకు పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని పేర్కొంటూ గురువారం పలు సూచనలు చేసింది. ఏఐ ద్వారా రూపొందించిన ఫొటోలు, వీడియోలు, ఆడియోను ప్రచారంలో వినియోగిస్తే.. ఆ కంటెంట్‌పై 'ఏఐ జనరేటెడ్/డిజిటల్లీ ఎన్‌హ్యాన్స్‌డ్/ సింథటిక్ కంటెంట్' అనే లేబుల్స్‌ను కనిపించేలా తప్పనిసరిగా ముద్రించాలని రాజకీయ పార్టీలను ఈసీ ఆదేశించింది. అంతేకాక, ఏఐ సాయంతో రూపొందించిన కంటెంట్‌తో ప్రకటనలు ఇచ్చేటప్పుడు.. ముందుగా హెచ్చరికలు వెయ్యాలని సూచించింది. ఈ మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓ అడ్వయిజరీ పంపింది.

కశ్మీర్‌లో మిస్టరీ మరణాలు

» నెలన్నర వ్యవధిలో 15 మంది మృతి

జమ్మూ, జనవరి 16: ప్రకృతి అందాలకు నెలవైన జమ్మూకశ్మీర్‌లో మిస్టరీ మరణాలు ప్రజలకు, అధికారులకు దడ పుట్టిస్తున్నాయి. కశ్మీర్ రాజౌరి జిల్లాలోని బుధాల్ గ్రామంలో నెలున్నర వ్యవధిలో 15 మంది మృతి చెందగా వారిలో ఎక్కువగా చిన్నారులే ఉండటం ఆందోళన కలిగిస్తోంది. బాధితులు వాంతులు చేసుకుని, ఒక్కసారిగా స్పృహ కోల్పోతున్నారు. అనంతరం వారిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణిస్తున్నారు. బాధితుల నమూనాలను లేబరేటరీలకు పంపగా.. వారి మరణాలకు బ్యాక్టీరియా లేదా వైరస్ కారక సాంక్రమిక వ్యాధులు కారణం కాదని తేలడంతో అధికారులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. అయితే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసెర్చ్ (ఐఐటీఆర్) నిర్వహించిన విశ్లేషణలో మాత్రం ఆ నమూనాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు తేలింది. దీంతో అప్రమత్తమయిన ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని వివిధ శాఖలను ఆదేశించింది. దర్యాప్తు కోసం 11 మందితో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.





సునీతా విలియమ్స్.. 8వ సారి స్పేస్ వాక్

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో చిక్కుపోయిన సునీతా విలియమ్స్ ఏడు నెలల తర్వాత స్పేస్ వాక్ కోసం ఐఎస్ఎస్ నుంచి బయటకు వచ్చారు. ప్రస్తుతం స్టేషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న ఆమె.. మరో వ్యోమగామి నిక్ హేగ్‌తో కలిసి ఐఎస్ఎస్‌కు సంబంధించి కొన్ని మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. కాగా, 2012లో చివరిసారిగా స్పేస్ వాక్ చేసిన సునీతకు ఇది 8వ సారి. గత ఏడాది జూన్ 6న బోయింగ్ 'స్టార్‌లైనర్'లో ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లు అక్కడే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే.

- కేప్ కెనావెరల్



గంగానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న అశేష భక్త జనం

4 రోజుల్లో 6 కోట్ల మంది!

» వైభవంగా సాగుతున్న మహా కుంభమేళా

మహాకుంభ్ నగర్/లఖ్‌నవూ, జనవరి 16: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఈ మహోత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంలో కోట్లాదిమంది పాలుపంచుకుంటూ.. భక్తిపారవశ్యంతో మునిగి తేలుతున్నారు. గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో గురువారం లక్షలాది మంది పుణ్య స్నానాలు ఆచరించగా, తొలి 4 రోజుల్లో అమృత స్నానాలు ఆచరించిన వారి సంఖ్య 6 కోట్లు దాటిందని అధికారికవర్గాలు పేర్కొన్నాయి. 45రోజులుసాగే మహా కుంభమేళాలో పాల్గొనేందుకు 50 కోట్ల మంది వరకు ప్రయాగ్‌రాజ్ వచ్చే అవకాశం ఉందని డీజీపీ ప్రశాంత్ కుమార్ అన్నారు. 20 లక్షల మంది వరకు విదేశీ యాత్రికులు ఉంటారని అంచనా వేశారు. కాగా, భారత విదేశాంగ శాఖ ఆహ్వానం మేరకు 10 దేశాలకు చెందిన 21 మందితో కూడిన అంతర్జాతీయ బృందం ప్రయాగ్‌రాజ్‌లోని తాత్కాలిక టెంట్ సిటీకి చేరుకుంది. వీరంతా త్రివేణి సంగంలో పవిత్ర స్నానాలు చేయడంతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. కుంభ్ ఆధ్యాత్మిక వైభవంలో కాంటే వాలే బాబా అలియాస్ రమేశ్ కుమార్ మాంఝీ 'ముళ్ల కంప పాన్పు'పై పడుకొని డమరుకం మోగిస్తూ తన భక్తిని చాటారు. మహా కుంభమేళాను ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు ఆరెస్సెస్ 'వన్ ప్లేట్, వన్ బ్యాగ్' ప్రచారాన్ని ప్రారంభించింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ యోగా సాధకులు 129 ఏళ్ల స్వామి శివానంద బాబా మహా కుంభమేళాకు హాజరయ్యారు. ఈయన గత వందేళ్లుగా ప్రయాగ్‌రాజ్, నాసిక్, ఉజ్జయినీ, హరిద్వార్‌లతో జరిగే ప్రతి కుంభమేళాకు హాజరవుతున్నారని ఆయన శిష్యుడు సంజయ్ సర్వజన పేర్కొన్నారు.

మహా కుంభమేళాలో శ్రీవారికి స్నపన తిరుమంజనం

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహా కుంభమేళాలో ప్రయాగ్‌రాజ్‌లోని దశాశ్వమేధ ఘాట్‌వద్ద గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం వైభవంగా జరిగింది. తిరుమల ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు ఆధ్వర్యంలో అర్చక బృందం గంగా నది ఒడ్డున ఈ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించింది.

సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

ముంబైలోని ఇంట్లోకి చొరబడి దుండగుడి దాడి.. వెన్నెముక నుంచి 2.5 అంగుళాల కత్తి ముక్క తొలగింపు

» లీలావతి ఆస్పత్రిలో శస్త్రచికిత్స.. ఆరోగ్యం నిలకడ

» దుండగుడిపై దోపిడీ, హత్యాయత్నం కేసు నమోదు



పోలీసులు విడుదల చేసిన నిందితుడి ఫొటో



ముంబై, జనవరి 16: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై ఓ గుర్తుతెలియని దుండగుడు విచక్షణారహితంగా కత్తితో దాడి చేశాడు. ఆరు కత్తిపోట్లకు గురైన సైఫ్.. ప్రస్తుతం లీలావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు అత్యవసర శస్త్రచికిత్సలు చేశామని, ప్రాణాపాయం ఏమీ లేదని, రెండ్రోజుల్లో నాన్-ఐసీయూ విభాగానికి మారుస్తామని వైద్యులు తెలిపారు. దొంగతనానికి వచ్చిన దుండగుడి ప్రయత్నాన్ని సైఫ్ అడ్డుకోవడంతో జరిగిన పెనుగులాటలో కత్తితో దాడి చేసినట్లు ఆ ఇంటి పనిమనిషి చెబుతోంది. ఆమెకు కూడా స్వల్ప గాయాలయ్యాయి. సైఫ్ అలీఖాన్ ఇంటి పనిమనిషి ఫిర్యాదు, పోలీసుల కథనం ప్రకారం.. గురుగ్రామ్‌లోని పటౌడీ సంస్థాన వారసుడు, బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ముంబైలోని బాంద్రాలో 12 అంతస్తులు ఉన్న సత్‌గురు శరణ్ అపార్ట్‌మెంట్‌లో.. చివరి నాలుగు అంతస్తుల్లో నివసిస్తున్నారు. బుధవారం రాత్రి ఆయన భార్య, బాలీవుడ్ నటి కరీనాకపూర్, కుమారులు జహంగీర్ అలీఖాన్, తైమూర్ అలీఖాన్‌తో నిద్రకు ఉపక్రమించారు. వీరు ఉంటున్న అపార్ట్‌మెంట్‌కు కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. అయితే.. రాత్రి 2 గంటల సమయంలో ఓ దుండగుడు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు కిందకు దిగేందుకు ఉపకరించే ఎమర్జెన్సీ మార్గం నుంచి సైఫ్ ఇంట్లోకి ప్రవేశించాడు. ఆ మార్గం సైఫ్ కుమారుడు జహంగీర్ గదికి అనుసంధానమై ఉంటుంది. జహంగీర్ తన తల్లిదండ్రుల వద్దే ఉండడం.. ఆ గదిలో అలికిడి రావడంతో పనిమనిషి నిద్రలేచి, అక్కడికి వెళ్లింది. జహంగీర్ గదిలో దుండగుడు నక్కి ఉండడంతో.. "దొంగ.. దొంగ.." అంటూ గట్టిగా కేకలు వేసింది. దాంతో నిద్ర లేచిన సైఫ్.. ఆ గదికి చేరుకున్నాడు. అప్పటికే ఆ దుండుగు పనిమనిషిని గట్టిగా పట్టుకుని, మెడపై కత్తి పెట్టి సైఫ్‌ను బెదిరించాడు. "రూ. కోటిన్నర ఇస్తేనే ఆమెను వదులుతాను" అంటూ హెచ్చరించాడు. దీంతో సైఫ్ దుండగుడితో తలపడ్డారు. ఈ క్రమంలో పెనుగులాట జరిగింది. తేరుకున్న దుండగుడు కత్తితో సైఫ్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ అలికిడితో కరీనా, ఇద్దరు పిల్లలు, మరో పనిమనిషి అక్కడికి వచ్చేసరికి దుండగుడు వచ్చిన మార్గంలోనే పరారవ్వగా.. సైఫ్ రక్తమోడుతూ కనిపించారు. సైఫ్ వెన్నెముక, మెడ భాగంలో లోతుగా కత్తిపోట్లు కాగా.. చేతిపై, భుజంపై మరో నాలుగు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను లీలావతి ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో కారు సిద్ధంగా లేకపోవడంతో లేకపోవడంతో.. సైఫ్‌ను ఆటోలో తీసుకెళ్లారు. తెల్లవారుజామున 3 గంటల సమయంలో పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాంద్రా పోలీసులు భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని సెక్షన్లు 311(దోపిడీ యత్నం, హత్యాయత్నం, తీవ్రంగా గాయపరచడం), 331(4) (అనుమతి లేకుండా ఇంట్లోకి చొరబాటు, చోరీ యత్నం) కింద కేసు నమోదు చేశారు. ఆ వెంటనే కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ చేశారు. సైఫ్ ఉంటున్న సద్గురు శరణ్ అపార్ట్‌మెంట్ సీసీకెమెరాల ఫుటేజీని జల్లెడపట్టిన పోలీసులు.. నిందితుడి ఫొటోను మీడియాకు విడుదల చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు 7 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. క్లూస్‌టీమ్ కీలక ఆధారాలను సేకరించగా.. స్నిఫర్ డాగ్స్‌తో దర్యాప్తు కొనసాగించారు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరున్న దయానాయక్ కూడా సైఫ్ ఇంటిని పరిశీలించారు. ఈ దర్యాప్తులో ఆయన కూడా పాలుపంచుకుంటారని తెలుస్తోంది. కొంతకాలంగా అపార్ట్‌మెంట్ ఉన్న హౌసింగ్ సొసైటీలో పలు ఇళ్లకు మరమ్మతులు జరుగుతున్నాయని, అక్కడ పనిచేస్తున్న కార్మికులను కూడా ప్రశ్నిస్తున్నామని పోలీసులు వివరించారు.

రాజకీయ రచ్చ?

సైఫ్ అలీఖాన్‌పై దాడి ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. ముంబైలో సెలబ్రిటీలకే భద్రత లేకుంటే.. సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఎన్‌సీపీ(ఎస్‌పీ) చీఫ్ శరద్‌పవార్ ప్రశ్నించారు. శాంతిభద్రతలు అదుపుతప్పాయని విమర్శించారు. గత ఏడాది బాంద్రాలోనే ఎన్సీపీ మాజీ ఎమ్మెల్యే బాబా సిద్ధిఖీ హత్యకు గురైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎం ఫడణవీస్ వద్దే హోం శాఖ ఉన్న విషయం తెలిసిందే..! ముంబైలో ఎవరూ సురక్షితంగా లేరని శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్‌రౌత్ ఆరోపించారు. మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే కూడా హోంశాఖను తనవద్ద పెట్టుకున్న ముఖ్యమంత్రి ఫడణవీస్ శాంతిభద్రతల విషయంలో దారుణంగా విఫలమయ్యారంటూ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ ఘటనపై విస్మయం వ్యక్తం చేశారు. సైఫ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

సైఫ్ క్షేమం

తీవ్ర గాయాలపాలైన సైఫ్ అలీఖాన్‌కు లీలావతి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నితిన్ డాంగే(న్యూరో సర్జన్), డాక్టర్ లీనా జైన్(కాస్మెటిక్ సర్జన్), డాక్టర్ నిషా గాంధీ(అనస్థీషియాలజిస్టు) రెండున్నర గంటల పాటు శ్రమించి, శస్త్రచికిత్స చేశారు. 2.5 అంగుళాల పొడవున్న కత్తి ముక్కను సైఫ్ వెన్నెముఖ నుంచి తొలగించామని వైద్యులు పేర్కొన్నారు. "తెల్లవారుజామున 3 గంటల సమయంలో సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండ్రోజుల్లో కోలుకుంటారు. ఆ తర్వాత ఆయనను నాన్-ఐసీయూ వార్డుకు తరలిస్తాం" అని లీలావతి ఆస్పత్రి సీవోవో డాక్టర్ నీరజ్ వెల్లడించారు. వెన్నెముక గాయాన్ని సరిచేసి, లీకైన ఫ్లూయిడ్లను సరిచేశామన్నారు. చేతికి, మెడకు ప్లాస్టిక్ సర్జరీలు చేశామని తెలిపారు. కాగా.. ఆస్పత్రి వద్ద సైఫ్, కరీనా టీమ్‌లు మీడియాతో మాట్లాడాయి. ఈ దాడి విషయంలో మీడియా సంయమనం పాటించాలని కోరాయి. సైఫ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నాయి.

లోకం తీరు



హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ మూసివేత

వ్యవస్థాపకుడు నాథన్ ఆండర్సన్ లేఖ

వాషింగ్టన్/న్యూఢిల్లీ, జనవరి 16: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ వ్యాపార సామ్రాజ్యాన్ని కుదిపేసి, ఆయన కంపెనీల నుంచి రూ.వందల కోట్లు ఆవిరి చేసి అంతర్జాతీయంగా ప్రకంపనలు సృష్టించిన అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ సంస్థ 'హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ' మూతపడింది. ఈ మేరకు ఆ సంస్థ వ్యవస్థాపకుడు నాథన్(నేట్) ఆండర్సన్ గురువారం ప్రకటించారు. తాము ఎంచుకున్న ప్రణాళికలు పూర్తయిన తర్వాత సంస్థను మూసేయాలన్న ఆలోచన ఉందని, అది ఈ రోజే.. అని సంస్థ వెబ్‌సైట్‌లో పోస్టు చేసిన లేఖలో ఆయన తెలిపారు. ఈ సంస్థను నడపడం జీవితకాల సాహసంగా ఆయన అభివర్ణించారు. 'ఈ నిర్ణయం వెనుక ఎలాంటి కారణాలు, బెదిరింపులు, ఆరోగ్య కారణాలు, వ్యక్తిగతమైన అంశాలు ఏమీ లేవు. గతంలో నన్ను నేను నిరూపించుకోవాలని భావించేవాడిని. ఇప్పుడు జీవితంలో తొలిసారిగా నేను కంఫర్ట్ జోన్‌లో ఉన్నానని అనిపిస్తోంది. హిండెన్‌బర్గ్ సంస్థను నన్ను నిర్వచించే ప్రధాన విషయంగా కాకుండా.. నా జీవితంలో ఒక అధ్యాయంగా మాత్రమే చూస్తున్నాను' అని ఆ లేఖలో ఆండర్సన్ వెల్లడించారు. కాగా, హిండెన్‌బర్గ్ సంస్థ మూసివేయడం అంటే మోదానీకి క్లీన్‌చిట్ ఇచ్చినట్లు కాదని కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది.



తప్పుడు క్లెయిమ్‌లతో 1,070 కోట్లు లాగేశారు

» ఐటీ శాఖ పరిశీలనలో తేలిన లెక్క

న్యూఢిల్లీ: ఆదాయపు పన్ను చట్టంలోని వివిధ సెక్షన్ల కింద అటు ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), ఇటు ప్రైవేట్ సంస్థలకు చెందిన 90 వేల మంది వేతనజీవులు తప్పుడు క్లెయిమ్‌లు దాఖలు చేసి 2024 డిసెంబరు 31 నాటికి రూ.1,070 కోట్లు మినహాయింపులు పొందారని ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ పరిశీలనలో తేలింది. ఐటీ శాఖ నిర్వహించిన సోదాలు, దాడులు, సర్వేల్లో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయని అధికారులు తెలిపారు. వారందరూ సమర్పించిన ఐటీఆర్‌లలో 80సీ, 80డీ, 80ఇ, 80 జీ, 80 జీజీబీ, 80 జీజీసీ సెక్షన్ల కింద తప్పుడు క్లెయిమ్‌లు చేయడం వల్ల ఆ మేరకు ప్రభుత్వాదాయానికి గండి పడింది. ప్రధానంగా 80 జీజీబీ/80 జీజీసీ సెక్షన్ల కింద పన్ను చెల్లింపుదారులు తీసుకున్న మినహాయింపు మొత్తానికి, దానం తీసుకున్న సంస్థలు దాఖలు చేసిన ఐటీఆర్‌లలో చూపిన మొత్తానికి మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్టు తేలింది. అదే విధంగా 80సీ, 80ఇ, 80జీ కింద క్లెయిమ్ చేసుకున్న కొన్ని మినహాయింపులు సైతం అనుమానాస్పదంగా ఉన్నట్టు తేలిందని ఐటీ శాఖ వర్గాలు తెలిపాయి. కొందరు అవాంఛనీయ శక్తులు వారిని తప్పుదారి పట్టించినట్టు కూడా పరిశీలనలో తేలినట్టు చెప్పారు. ఇలాంటి తప్పుడు క్లెయిమ్‌ల వల్ల ఏర్పడే పరిణామాలు, వాటిని దిద్దుకునే మార్గాలపై యాజమాన్యాల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు చేపడుతున్నట్టు వారు తెలిపారు. ఐటీ చట్టం 1961 కింద ఐటీఆర్‌ల దాఖలులో ఎలాంటి లోటుపాట్లున్నా అసెసీలు సంబంధిత అసెస్‌మెంట్ సంవత్సరం నుంచి రెండేళ్ల లోపు సవరించిన రిటర్న్ దాఖలు చేసుకునే వెసులుబాటు ఉంది.

96 గంటల చర్చలు

దానివల్లే ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం

» అమెరికా, ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వం

» దోహాలో సుదీర్ఘ కసరత్తు



టెల్‌అవీవ్, జనవరి 16: దాదాపు 15 నెలలపాటు అంతులేని విధ్వంసానికి, ప్రాణనష్టానికి, వేదనలు, రోదనలకు కారణమైన ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం వెనుక సుదీర్ఘమైన కసరత్తు దాగి ఉంది. ఇరుపక్షాలు నిరవధికంగా 96 గంటల పాటు చర్చలు జరిపి చివరికి ఒక పరిష్కారానికి చేరుకున్నాయి. మధ్యవర్తిత్వం వహించిన ఖతార్, ఈజిప్టు ప్రతినిధుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఖతార్ రాజధాని దోహాలో ఓ బహుళ అంతస్తుల భవనంలో చర్చలు జరిగాయి. ఇజ్రాయెల్, హమాస్ ప్రతినిధులు విడివిడిగా ఒక్కో అంతస్తులో ఉండగా.. వారితో మధ్యవర్తులు చర్చలు జరుపుతూ వివాదాన్ని కొలిక్కి తెచ్చారు. కాగా, ఈ చర్చల ప్రక్రియలో అమెరికా అధ్యక్షుడు బైడెన్, కాబోయే అధ్యక్షుడు ట్రంప్ తరఫున ప్రతినిధులు ఒక్కటిగా కాకుండా.. ఎవరికివారుగానే పాల్గొనటం విశేషం. బైడెన్ దూతగా బ్రెట్ మెక్‌గార్క్, ట్రంప్ ప్రతినిధిగా స్టీవ్ విట్కాఫ్ పాల్గొన్నారు. అయితే, వారిద్దరూ ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుకొంటూ.. మంచి సమన్వయంతో చర్చలను ముందుకు తీసుకెళ్లారని అమెరికా ప్రభుత్వాధికారులు వెల్లడించారు. చర్చల్లో అమెరికా విదేశాంగమంత్రి ఆంటోని బ్లింకెన్, ఆ దేశ జాతీయ భద్రత సలహాదారు జేక్ సులివాన్ కీలక పాత్ర పోషించారని బైడెన్ కొనియాడారు. తమ వల్లే ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందం సాధ్యమైందంటూ అటు బైడెన్, ఇటు ట్రంప్ పోటాపోటీగా ప్రకటనలు జారీ చేయటం గమనార్హం.

ఒప్పందం ప్రకారం ఇలా..

ఈ నెల 19 నుంచి అమలులోకి రానున్న కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం.. తమ వద్ద బందీలుగా ఉన్న 33 మందిని హమాస్ వచ్చే ఆరువారాల వ్యవధిలో విడిచిపెడుతుంది. దానికి బదులుగా ఇజ్రాయెల్ జైళ్లలో సుదీర్ఘకాలంగా మగ్గుతున్న వందలాది మంది పాలస్తీనీయులను ఇజ్రాయెల్ వదిలిపెడుతుంది. గాజాలో మోహరించిన పలు ప్రాంతాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం వైదొలుగుతుంది. ఇజ్రాయెల్ హెచ్చరికలు, బాంబుల వర్షంతో తరలిపోయిన గాజా వాసులు తిరిగి తమ స్వస్థలాలకు చేరుకుంటారు. రెండోదశలో భాగంగా హమాస్ తమ వద్ద ఉన్న మిగిలి ఉన్న బందీలను (వీరిలో ఇజ్రాయెల్ సైనికులు కూడా ఉన్నారు) విడిచిపెడుతుంది. ఇజ్రాయెల్ కాల్పుల విరమణకు పూర్తిగా కట్టుబడి, దళాలను పూర్తిగా ఉపసంహరించుకోనంతవరకూ తాము రెండో దశ బందీల విడుదల ప్రక్రియను చేపట్టబోమని హమాస్ ఇప్పటికే స్పష్టం చేసింది. కాగా, హమాస్‌ను పూర్తిగా తుదముట్టించేంతవరకూ తమ పోరాటం ఆగదని ఇజ్రాయెల్ తెలిపింది.

యుద్ధనష్టం

ఇజ్రాయెల్

2023 అక్టోబరు 7న హమాస్ దాడి - 1200 మంది మృతి; బందీలు 251 మంది (వీరిలో కొందరు ఇప్పటికే విడుదల కాగా.. పలువురు మరణించారు. 62 మంది సజీవంగా ఉన్నట్లు అంచనాలున్నాయి) ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం: మృతి చెందిన సైనికులు: 840; గాజా నుంచి ఇజ్రాయెల్ మీదికి ప్రయోగించిన రాకెట్లు: 10 వేలకుపైగా; దాడుల కారణంగా ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిన ప్రజలు: 75,500

గాజా

మరణించిన పాలస్తీనీయన్లు - 46 వేల మందికిపైగా (వీరిలో సగానికిపైగా స్త్రీలు, పిల్లలు), గాయపడిన వారు - 1.09 లక్షల మంది, హతమైన మిలిటెంట్లు: 17 వేల మంది (ఇజ్రాయెల్ సైన్యం చెప్పిన దాని ప్రకారం), ధ్వంసమైన ఇల్లు, కట్టడాలు: 1,36,000; ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన ప్రజలు: 19 లక్షల మంది; ఇజ్రాయెల్ అదుపులో ఉన్న గాజా భూభాగం: 90 %.



పుతిన్‌తో భేటీ కానున్న ట్రంప్!

అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం అనంతరం ట్రంప్.. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యే అవకాశం ఉందని గురువారం వార్తలు వెలువడ్డాయి. ఈ సమావేశంలో.. ఉక్రెయిన్ నాటో సభ్యత్వం గురించి ఇరువురూ చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం. నాటోతో సంబంధాలను ఉక్రెయిన్ వదులుకోవాలని, పరిమితంగానే సైన్యాన్ని ఉంచుకోవాలని పుతిన్ డిమాండ్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ ఎక్కడ, ఎప్పుడు జరుగుతుందన్న వివరాలు వెల్లడి కాలేదు.

త్వరలో 8వ వేతన కమిషన్

(మొదటిపేజీ తరువాయి)



కేంద్ర సమాచార-ప్రసార, రైల్వే, ఎలక్ట్రానిక్స్-ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ గురువారం విలేకరులకు తెలిపారు. క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన ఆయన.. ఈ శుభవార్త కూడా వినిపించారు. "ప్రధాని మోదీ నిర్దిష్ట కాల పరిమితి ప్రకారం పీఆర్సీని నియమిస్తున్నారు. 2016నుంచి అమల్లోకి వచ్చిన 7వ పీఆర్సీ సిఫారసులు ఈ ఏడాదితో ముగుస్తాయి. 2026 జనవరి 1 నుంచి కొత్త పేకమిషన్ సిఫారసులు అమల్లోకి రావాలి. ఈలోపే కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో సంప్రదింపులు జరిపి సిఫారసులు చేసేలా త్వరలోనే 8వ వేతన కమిషన్‌ను వేస్తాం. ఒక చైర్మన్, ఇద్దరు సభ్యులను నియమిస్తాం"అని వైష్ణవ్ తెలిపారు. మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్న సమయంలోనే కేంద్రం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ ప్రకటనరావడం మరో విశేషం. ఈ నిర్ణయం వల్ల 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరనుంది. కొత్త కమిషన్ అమల్లోకి వస్తే కరువు భత్యం సర్దుబాటు జరిగి తమ వేతనాలు, పింఛన్లు పెరుగుతాయి. పే కమిషన్‌ను ఎప్పుడు నియమించనున్నదీ వైష్ణవ్ చెప్పలేదు.

7వ కమిషన్‌తో ఇలా...

వేతనాలు, పింఛన్లు లెక్కగట్టడంలో ఫిట్‌మెంట్‌ది కీలక పాత్ర. ఏడో కమిషన్ వేతనాలు సవరించే సమయంలో ఉద్యోగులు 3.68ఫిట్‌మెంట్ కోరారు. అయితే కేంద్రం 2.57 ఫిట్‌మెంట్‌ను నిర్ణయించింది. ఈ నిర్ణయంతో నాడు కేంద్ర ఉద్యోగుల కనీస మూల వేతనం (బేసిక్ పే) నెలకు రూ.18 వేలకు పెరిగింది (ఆరో వేతన కమిషన్ కాలంలో ఇది రూ.6వేలు ఉండేది). అలాగే కనీస పింఛను రూ.3,500 నుంచి రూ.9 వేలకు, గరిష్ఠ వేతనం రూ.2,50,000కు, గరిష్ఠ పెన్షన్ రూ.1,25,000కు పెరిగాయి. ఎనిమిదో వేతన కమిషన్ సిఫారసులతో కనీస, గరిష్ఠ వేతనాలు, పెన్షన్లు భారీగా పెరుగుతాయని ఉద్యోగ వర్గాలు ఆశిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల తీరుతెన్నులు, అలవెన్సులు, ఇతర ప్రయోజనాల ఖరారులో వేతన కమిషన్ ప్రధాన పాత్ర పోషిస్తుంది. సాధారణంగా కేంద్ర వేతన కమిషన్ ప్రతి పదేళ్లకోసారి ఏర్పాటవుతుంది. 7వ వేతన కమిషన్‌ను 2014లో నియమించగా... దాని సిఫారసులు 2016 జనవరి 1నుంచి అమలులోకి వచ్చాయి. ద్రవ్యోల్బణం, ఇతర ఆర్థిక సూచికల ఆధారంగా పే స్కేళ్లు, అలవెన్సులు, ప్రయోజనాలను ఎలా మార్పు చేయాలో వేతన కమిషన్ సూచనలు చేస్తుంది. దాని సిఫారసులు లక్షలాది ఉద్యోగులు, పెన్షనర్లపై తీవ్ర ప్రభావం చూపుతాయి. అన్ని కేంద్రప్రభుత్వ శాఖలు, సంస్థలు వీటి సిఫారసులను అమలు చేస్తున్నాయి. 1947నుంచి ఇప్పటిదాకా కేంద్రం 7వేతన కమిషన్లను ఏర్పాటుచేసింది.

ఉద్యోగులు మాకు గర్వకారణం

"వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు మాకు గర్వకారణం. 8వ పే కమిషన్‌ను ఆమోదిస్తూ కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం వారి జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తుంది. వ్యయ సామర్థ్యాన్ని, వినియోగాన్ని పెంచుతుంది"

- ప్రధాని మోదీ (ఎక్స్ వేదికగా)

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వడానికి కేంద్రప్రభుత్వం సూత్రపాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఆర్థికంగా నష్టాలు ఎదుర్కొంటున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని అందించాలని ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గం సూత్రపాయంగా అంగీకరించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి కొన్ని అంశాలపై స్పష్టతను ఏర్పరచుకునేందుకు శుక్రవారం కేంద్ర ఉక్కు మంత్రి జేడీ కుమారస్వామితో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు విస్తృత చర్చలు జరపనున్నారు. ఈ చర్చల తర్వాత ప్రత్యేక ప్యాకేజీ ద్వారా స్టీల్‌ప్లాంట్‌ను నడిపేందుకు విధివిధానాలను ఇరువురు మంత్రులు వెల్లడించే అవకాశాలున్నాయి. ఇటీవల ప్రధాని మోదీ విశాఖపట్నం వచ్చినప్పుడు స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని సీఎం చంద్రబాబు కోరారు.

12 మంది నక్సల్స్ కాల్చివేత

2 కి.మీ. వేటాడి.. వెంటాడి..

- తెలంగాణ సరిహద్దుల్లో.. మారేడుబాక అడవుల్లో ఘటన
- వెయ్యిమంది బలగాలతో ఆపరేషన్
- భారీగా ఆయుధాల స్వాధీనం
- టెక్నికల్ టీమ్ కమాండర్ లొంగుబాటు

చర్ల, జనవరి(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దులకు 15 కిలోమీటర్ల దూరంలో.. ఛత్తీస్‌గఢ్‌లోని మారేడుబాక అడవుల్లో తుపాకులు గర్జించాయి. డీఆర్‌జీ, కోబ్రా బలగాలకు చెందిన వెయ్యిమంది నిర్వహించిన ఆపరేషన్‌లో.. తమకు తారసపడ్డ మావోయిస్టులను రెండు కిలోమీటర్ల దూరం వరకు వెంటాడి.. వేటాడి కాల్చిచంపారు. పోలీసుల కథనం ప్రకారం.. బీజాపూర్ జిల్లా పూజారికాంకేర్ సమీపంలోని మారేడుబాక అడవుల్లో మావోయిస్టులు సమావేశమైనట్లు బలగాలకు ఉప్పందింది. దీంతో.. గురువారం ఉదయం సుమారు వెయ్యి మంది డీఆర్జీ, కోబ్రా బలగాలు కూంబింగ్‌కు ఉపక్రమించాయి. ఉదయం 9 గంటల సమయంలో బలగాలకు మావోయిస్టులు తారసపడడంతో.. ఇరువైపులా కాల్పులు మొదలయ్యాయి. మధ్యాహ్నం మూడు గంటల వరకు కాల్పులు కొనసాగాయి. ఓ దశలో తమవైపు నష్టం జరుగుతున్నట్లు గుర్తించిన మావోయిస్టులు అడవుల్లోకి వెళ్లగా.. బలగాలు వారిని రెండు కిలోమీటర్ల దూరం వరకు వెంటాడాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది మావోయిస్టుల మృతదేహాలను, భారీగా ఆయుధాలు, మందుపాతరలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులను గుర్తించాల్సి ఉందన్నారు. మృతుల్లో తెలుగువారు ఉండిఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. శుక్రవారానికి వివరాలు తెలుస్తాయని చెప్పారు. కాగా.. ఈ ఏడాది జరిగిన ఎన్‌కౌంటర్లలో ఇప్పటి వరకు 20 మంది నక్సల్స్ మృతిచెందినట్లు బస్తర్ రేంజ్ ఐజీ కార్యాలయం తెలిపింది. ఈ నెల 12న బీజాపూర్‌లో జరిగిన నేషనల్‌పార్క్ ఎన్‌కౌంటర్లో ఐదుగురు, సుకుమా జిల్లా పాలగూడ అడవుల్లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు చొప్పున మావోయిస్టులు మృతిచెందినట్లు గుర్తుచేసింది.

కమల్‌దాస్ ఉసెండీ లొంగుబాటు

మావోయిస్టు పార్టీలో టెక్నికల్ టీమ్ కమాండర్‌గా పనిచేస్తున్న గింజురాం అలియాస్ కమల్‌దాస్ ఉసెండీ గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని కొండగావ్ జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. 27 ఏళ్లగా ఇతను నక్సల్‌బరి ఉద్యమం, మావోయిస్టు పార్టీలో పనిచేశాడు. మిలీషియా సభ్యుడుగా కూడా పనిచేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతం టెక్నికల్ టీమ్ కమాండర్‌గా పనిచేస్తున్నాడు. కమల్‌దాస్‌పై రూ.25 లక్షల రివార్డు ఉందని, ప్రభుత్వం తరఫున ఇతనికి ప్యాకేజీని అందజేస్తామని పోలీసులు వెల్లడించారు.

ఇంజనీరింగ్ విద్యార్థినిపై అత్యాచారం

- ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేటు బాలికల వసతి గృహంలో ఘటన.. నిందితుడి అరెస్టు

ఇబ్రహీంపట్నం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులో ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని అత్యాచారానికి గురైంది. రాత్రి వేళ ప్రైవేటు గర్ల్స్ హాస్టల్‌లోకి ప్రవేశించిన యువకుడు.. గదిలో ఒంటరిగా ఉన్న యువతిపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేటు గర్ల్స్ హాస్టల్‌లో బుధవారం అర్ధరాత్రి ఈదారుణం జరిగింది. మంగల్‌పల్లిలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని సమీపంలోని (మంగల్‌పల్లి గేట్ దగ్గర) ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. నల్లగొండ జిల్లాకు చెందిన అజిత్ (22) ఆ హాస్టల్ భవన యజమాని దగ్గర గతంలో డ్రైవర్‌గా పని చేసి, మానేసిన అజిత్.. బుధవారం రాత్రి ఆ హాస్టల్‌లోకి ప్రవేశించాడు. బాధిత విద్యార్థిని తన గదిలో ఒంటరిగా ఉండగా.. బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టాడు. పక్క గదుల్లో ఉన్న యువతులు.. డయల్ 100కు ఫోన్ చేశారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు.. అజిత్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాధిత విద్యార్థినిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసులు నమోదు చేశారు.

మైనర్ బాలికతో పెళ్లి, లైంగిక దాడి

- నిందితుడికి 20 ఏళ్ల జైలు .. కోర్టు తీర్పు

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మైనర్ బాలిక వెంటపడి, పెళ్లి చేసుకొని, అనంతరం లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి గురువారం న్యాయస్థానం 20ఏళ్ల జైలు శిక్ష విధించింది. నాగర్ కర్నూల్ జిల్లా బన్నేన్‌పల్లికి చెందిన ఆకుల నరేష్ (24) సరూర్‌నగర్‌లో ఉంటూ తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆ ప్రాంతంలో ఓ మైనర్ బాలికను ప్రేమించానంటూ పెళ్లి చేసుకున్నాడు. అనంతరం లైంగిక దాడికి పాల్పడ్డాడు. సరూర్‌నగర్ పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన రంగారెడ్డి ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక కోర్టు నరేష్‌కు 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు, రూ30 వేల జరిమానా విధించింది.





గద్వాల జిల్లా పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద నిలిచిపోయిన వాహనాలు, భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద బారులు తీరిన వాహనాలు

విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్

4.కి.మీ మేర నిలిచిపోయిన వాహనాలు.. ఏపీ నుంచి హైదరాబాద్‌కు ప్రజల రాక

బీబీనగర్, చౌటుప్పల్ టౌన్, కేతేపల్లి, కోదాడ రూరల్, చిట్యాల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పుట్టి పెరిగిన పల్లెల్లో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకొన్న ప్రజలు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ముఖ్యంగా కోడి పందేలను చూసేందుకు ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన నగరవాసులు కనుమ ముగియగానే తిరుగుముఖం పట్టారు. ఫలితంగా ఏపీ నుంచి హైదరాబాద్ వైపు రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, కార్లు ఇతర ప్రైవేటు వాహనాలు, బైక్‌ల వరదతో రద్దీ నెలకొంది. దీన్ని ఆసరగా చేసుకొని ప్రైవేటు బస్సులు, ఇతర వాహనదారులు ప్రయాణికులను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. సాధారణ రోజుల్లో చార్జీలకన్నా మూడు రెట్లు ఎక్కువగా వసూలు చేస్తున్నారు. గురువారం ఉమ్మడి నల్లగొండ జిల్లా కోదాడ బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల దాకా హైదరాబాద్‌కు ఆర్టీసీ నుంచి ఒక్క బస్సూ లేదని ప్రయాణికులు వాపోయారు. సాధారణ రోజుల్లో కోదాడ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ప్రైవేటు వాహనదారులు ఒక్కొక్కరి నుంచి రూ.350 చార్జీ చేస్తారు. ఇప్పుడేమో రద్దీని ఆసరాగా చేసుకొని రూ.700నుంచి రూ.1000దాకా వసూలు చేస్తున్నారు. 65వ నంబర్ జాతీయ రహదారి, ఉమ్మడి నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద కంటైనర్ ఇరుక్కుపోయింది. ఫలితంగా రోడ్డుకు ఇరువైపులా నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అరగంటపాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇక ఏపీ నుంచి హైదరాబాద్‌వైపు జాతీయ రహదార్లపై రద్దీ నివారణకు టోల్‌గేట్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. నల్లగొండ జిల్లాలోని గూడూరు, పంతంగి, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాల మీదుగా గురువారం లక్ష వాహనాలు హైదరాబాద్‌కు వెళ్లాయి. గూడూరు టోల్‌ప్లాజా వద్ద రద్దీని నివారించేందుకు 100 అడుగుల దూరంలోనే ఫాస్టాగ్ స్కాన్ అయ్యేలా సాంకేతికపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ టోల్‌ప్లాజాలో మొత్తం 12గేట్లు కాగా, హైదరాబాద్ వైపు ఎనిమిది, వరంగల్ వైపు నాలుగు గేట్ల నుంచి వాహనాలను పంపుతున్నారు. సాధారణ రోజుల్లో 20వేల వాహనాలు ప్రయాణిస్తే గురువారం 23వేల వాహనాలు వెళ్లాయి. ఇక్కడ బైక్‌ల మీద వస్తున్నవారికి పోలీసు సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. చౌటుప్పల్‌లోని 65వ నంబరు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ దృష్ట్యా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్టు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. హైవేపై 200మంది పోలీసులను నియమించినట్లు, రెండు పెట్రోలింగ్ వాహనాలను 24 గంటలు తిప్పుతున్నామని ఏసీపీ తెలిపారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16 గేట్లు కాగా హైదరాబాద్ వైపు 12గేట్ల నుంచి విజయవాడ వైపు నాలుగు గేట్ల నుంచి వాహనాలను అనుమతిస్తున్నారు. సాధారణ రోజుల్లో 20వేల వాహనాలు వెళుతుండగా, గురువారం అదనంగా 10వేల వాహనాలు వెళ్లాయి. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలోని 12టోల్ వసూలు కౌంటర్లలో వాహనాల రద్దీకి అనుగుణంగా కౌంటర్లు కేటాయించారు. ఇక్కడ సాధారణ రోజుల్లో 17వేల వాహనాలు వెళుతుండగా, గురువారం 50వేల వాహనాలు వెళ్లాయి.

మొక్కు కోసం వెళ్లి మృత్యు ఒడికి


మనుమడు పుట్టాడన్న సంతోషంతో షిర్డీకి కుటుంబం.. షిర్డీ-ఔరంగాబాద్ రోడ్డులో ట్రాక్టర్‌ను ఢీకొన్న వాహనం

- 14 మందిలో నలుగురి దుర్మరణం.. మరో నలుగురు చావుబతుకుల్లో



ప్రమాదంలో మృతిచెందిన ప్రసన్న లక్ష్మి, అక్షిత, ప్రేమలత. వైద్విక్ (ఫైల్)

మోత్కూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మొక్కు తీర్చుకోవడానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదం కబళించింది. 14 మంది ప్రయాణిస్తున్న వాహనం ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేసేక్రమంలో దాన్నే ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వాహనంలో ప్రయాణిస్తున్న వారిలో 6నెల ల శిశువు సహా నలుగురు దుర్మరణంపాలయ్యారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారి పరిస్థితి విషమంగా ఉంది. ఆరుగురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మహారాష్ట్రలోని షిర్డీ-ఔరంగాబాద్‌లో రహదారి గంగాపూర్ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. మృతులు, క్షతగాత్రులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. బాధిత కుటుంబం స్వస్థలం యాదాద్రి జిల్లా భువనగిరి జిల్లా మోత్కూరు పరిధిలోని కొండగడప గ్రామం. ఈ ఊరికి చెందిన శ్యామ్‌శెట్టి కృష్ణమూర్తి కుటుంబం 12 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడింది. అక్కడ కృష్ణమూర్తి కిరాణా దుకాణం నడుపుతున్నాడు. కృష్ణమూర్తికి భార్య ప్రేమలత కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. అందరికీ పెళ్లిళ్లయ్యాయి. పండుగలప్పుడు ఈ కుటుంబం స్వగ్రామానికి వచ్చి వెళుతుంటుంది. కృష్ణమూర్తి కుమారుడు, కోడలైన వెంకన్న-యామిని దంపతులకు ఎనిమిదేళ్లుగా పిల్లలు లేరు. సంతానం కోసం ఎన్నో ఆలయాలు తిరిగి మొక్కుకున్నారు. ఈ దంపతులకు ఆర్నెల్ల క్రితం కుమారుడు వైద్విక్ పుట్టాడు. సంక్రాంతికి సెలవులు రావడంతో కృష్ణమూర్తి కుటుంబం సొంతూరుకొచ్చింది. మనుమడు పుట్టినందుకు షిర్డీ వెళ్లి మొక్కు తీర్చువాలని అనుకుంది. ఈనెల 13న రాత్రి కృష్ణమూర్తి కుటుంబసభ్యులు, ఆయన కూతుళ్లు, అల్లుళ్లు కలిపి మొత్తం 14మంది షిర్డీ బయలుదేరారు. 14న షిర్డీలో సాయిబాబాను దర్శించుకున్నారు. సమీపంలో ఉన్న దేవాలయాలు చూసేందుకు 15న షిర్డీలో ఓవాహనం అద్దెకు తీసుకుని బయలుదేరారు. నాసిక్ వెళుతూ ఆ రోజు రాత్రి షిర్డీ-ఔరంగాబాద్ రహదారిలో గంగాపూర్ వద్ద వారు ప్రయాణిస్తున్న వాహనం ఓ ట్రాక్టర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి దాన్నే ఢీకొట్టిం ది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి భార్య ప్రేమలత (57), పెద్ద కుమార్తె ప్రసన్న లక్ష్మి(42), ప్రసన్నలక్ష్మి పెద్ద కుమార్తె అక్షిత (21), వెంకన్న-యామినిల కుమారుడు వైద్విక్ (6నెలలు) అక్కడికక్కడే మృతి చెందారు. కృష్ణమూర్తి, ఆయన కుమారుడు వెంకన్న, కృష్ణమూర్తి అల్లుడు తొలుపునూరి శ్రీనివాస్, శ్రీనివాస్ కుమార్తె శరణ్య తీవ్రంగా గాయపడ్డారు. వారి ని ఔరంగాబాద్‌లోని గజానన్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. కృష్ణమూర్తి చిన్న కుమార్తె స్రవంతి, ఆమె భర్త రాంబాబు, వారి ఇద్దరు పిల్లలు, కృష్ణమూర్తి కోడలు యామిని, ఆమె తల్లి, వాహనం డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో కొండగడపలో విషాదఛాయలు అలుముకున్నాయి.



లారీ కిందకు దూసుకెళ్లిన కారు

తల్లీకుమార్తెను బలిగొన్న పొగమంచు

- ముందున్న లారీ కనిపించక కారు ఢీ
- మరో కుమార్తె, భర్తతో పాటు బంధువులకు గాయాలు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన



అనూష, చైత్ర (ఫైల్)

భువనగిరి రూరల్/ కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రహదారి కనిపించనంతగా కమ్మేసిన పొగమంచు తల్లీకుమార్తెను బలితీసుకుంది. యాదాద్రిభువనగిరి సమీపంలో వరంగల్-హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం ఉదయం పొగమంచు కమ్మేయడంతో ముందున్న లారీ కనిపించక కారు ఢీకొనడంతో తల్లీ చిన్నకుమార్తె మృతి చెందగా భర్త, పెద్ద కుమార్తెతో పాటు బంధువులకు గాయాలయ్యాయి. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం గాంధీపురం పరిధి వెంకట్రాంతండాకు చెందిన భూక్య సంతోష్ కుటుంబంతో హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిస్తున్నాడు. సంక్రాంతికి కుటుంబంతో స్వగ్రామానికి వెళ్లి తిరిగి హైదరాబాద్ వస్తుండగా దట్టమైన పొగమంచు కారణంగా మార్గమధ్యలో భువనగిరి సమీపంలోని రాయిగిరి వద్ద వీరి కారు ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు సీటులో కూర్చున్న సంతోష్ భార్య అనూష (28), చిన్న కుమార్తె చైత్ర (7) మృతి చెందగా సంతోష్‌తో పాటు పెద్ద కుమార్తె భూక్య ప్రణశ్విని, సంతోష్ సోదరి భవాని, ఆమె భర్త రవి, కుమార్తె మోక్షకు గాయాలయ్యాయి. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోవడంతో అందులోంచి క్షతగాత్రులను బయటకు తీయడానికి పోలీసులకు అరగంటకుపైగా సమయం పట్టడంతో వారు నరకయాతన అనుభవించారు. అనంతరం వారిని భువనగిరి ఆసుపత్రికి తరలించారు. అనూష, చైత్ర మృతదేహాలను పోస్టుమార్టం ముగిసిన తర్వాత బంధువులకు అప్పగించారు. ఈ ఘటనతో వెంకట్రాంతండ, అనూష పుట్టినిల్లు లచ్చీరాంతండాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. సంక్రాంతి సెలవుల్లో తమతో సరదాగా గడిపి వెళ్లిన అనూష, చైత్ర మృతిచెందడంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

చాందిని చికిత్సకు సాయం చెయ్యరూ..

- అన్న కూతురిని ప్రేమించిన యువకుడి ఇంటికి చిన్నాన్న నిప్పుపెట్టిన ఘటనలో గాయపడ్డ చాందిని
- వైద్య ఖర్చులకు దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు



ఆస్పత్రిలో చాందిని

అల్వాల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అన్న కూతురిని ప్రేమించిన యువకుడి తండ్రి, వారి ఇంటిపై పెట్రోల్ పోసి యువతి చిన్నాన్న నిప్పు పెట్టిన ఘటనలో కాలిన గాయాలతో ఆస్పత్రి పాలైన చిన్నారి చాందిని(4) కోలుకుంటోంది. అయితే, తమ కుమార్తెకు చికిత్సకు దాతలు సాయం చేయాలని చాందిని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. అల్వాల్ పోలీసుస్టేషన్ పరిధి గోపాల్‌నగర్, ఎరుకల బస్తీలో జనవరి 14న జరిగిన ఘటనలో ప్రదీప్ అనే యువకుడి తండ్రి ప్రకాశ్(60), వారి ఇంటికి సమీపంలో ఆడుకుంటున్న చాందిని కాలిన గాయాలతో ఆస్పత్రి పాలైన సంగతి తెలిసిందే. చాందినిని తల్లిదండ్రులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. కూలి పనులు చేసుకుని జీవించే తాము.. కుమార్తె వైద్యానికి ఇప్పటికే రూ.2లక్షలు ఖర్చు పెట్టామని చాందిని తల్లిదండ్రులు దిలీప్, శాంతమ్మ 'ఆంధ్రజ్యోతి' వద్ద వాపోయారు. ఐసీయూలో ఉండడంతో ప్రతీ రోజు కనీసం రూ.15వేలు ఆస్పత్రికి చెల్లించాల్సి ఉందన్నారు. చాందిని చికిత్సకు దాతలు ఆర్థిక సాయం చేయాలని వేడుకుంటున్నారు. ఫోన్ పే, గుగూ ల్ పే నెంబర్ 7684052533, అకౌంట్ నెంబర్ 50100526253660 హెచ్‌డీఎఫ్‌సీ, రాజేంద్రనగర్ శాఖ ఐఎఫ్ఎస్‌సీ కోడ్ హెచ్‌డీఎఫ్‌సీ0001031కు దాతలు ఆర్థిక సాయం పంపాలని కోరారు. ఇక, 50 శాతం కాలిన గాయాలతో గాంధీ ఆస్పత్రిపాలైన ప్రదీప్ తండ్రి ప్రకాశ్‌కు చికిత్స కొనసాగుతోంది. మరోపక్క, ఈ కేసులో ప్రధాన నిందితుడైన వివేకానంద(37) అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి గురువారం లొంగిపోయాడు. పవన్(29), ఏల్లేష్(31)ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

అమ్మా నాన్నా.. నన్ను క్షమించండి

- అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉరేసుకుని బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

అబ్దుల్లాపూర్‌మెట్, వనపర్తి రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): "ప్రియమైన అమ్మానాన్న నన్ను క్షమించండి" అంటూ లేఖ రాసి ఓ బీటెక్ విద్యార్థి ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్‌లో జరిగింది. వనపర్తి జిల్లాలోని పెద్దగూడెం గ్రామానికి చెందిన భానుప్రకాశ్ (19) రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్‌లోని హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. 4 రోజుల క్రితం సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లిన భానుప్రకాశ్ బుధవారం హాస్టల్‌కు తిరిగొచ్చాడు. అదే రోజు అర్ధరాత్రి హాస్టల్ పెంట్ హౌజ్‌పై ఉన్న ఐరన్ మెట్లకు టవల్‌తో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే భాను ప్రకాశ్ ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటు పడినట్లు తెలిసింది. ఆ కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడా.. లేక ఇతర కారణాలేమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆశారేఖ...!

తాను గద్దెదిగేలోగానే ఇజ్రాయెల్–హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వారం క్రితం ఆశాభావం వెలిబుచ్చినప్పుడు ఎవరూ దానిని పట్టించుకోలేదు. బందీల అప్పగింతలకు సంబంధించి ఇరుపక్షాలూ తీవ్రమైన అడ్డంకులను అధిగమించాయని బైడెన్ అప్పట్లో సూచన ప్రాయంగా అన్నారు. చర్చలు కొలిక్కిరాకుండా హమాస్ అడ్డుపడుతోందని బైడెన్ అనగానే, మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఖతార్, ఈజిప్ట్ అధికారులు మాత్రం అందుకు నెతన్యాహూ కారకుడన్నారు. వారం క్రితం బైడెన్ చెప్పింది ఇప్పుడు నిజమైందనీ, అడ్డంకులూ అభ్యంతరాలూ తొలగి ఎట్టకేలకు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని వార్తలు వింటున్నాం. ఈ శుభవార్తతో పాటుగానే, ఇజ్రాయెల్ మంత్రివర్గం ఇంకా సదరు ఒప్పందాన్ని ఆమోదించవలసి ఉందని, నెతన్యాహూ పలు వ్రీలూ కొర్రీలతో మంత్రివర్గ సమావేశాన్ని వాయిదావేస్తూ కొత్తకుట్రలకు తెరదీస్తున్నారన్న అనుమానాలు కూడా జోరుగా ప్రచారమవుతున్నాయి.

ఆదివారంనుంచి ఈ ఒప్పందం అమలులోకి వస్తుందని ఖతార్ ప్రధాని షేక్ మహ్మద్ బిన్ అల్‌థానీ సగర్వంగా ప్రకటించిన కొద్ది గంటల్లోనే గాజామీద తీవ్రస్థాయిలో ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఒప్పందం అమల్లోకి వచ్చేలోగా మరిన్ని ఊచకోతలు, కూల్చివేతలతో నెతన్యాహూ కక్షతీర్చుకుంటున్నారు. పదిహేను నెలల్లో యాభైవేలమందిని హతమార్చి, గాజాను స్మశానంగా తయారుచేసినా ఆయనకు ఇంకా తృప్తికలగలేదు. అనుకున్నట్టుగా ఆదివారంనుంచి ఒప్పందం అమల్లోకి వచ్చినపక్షంలో ఈ ఊచకోతలకు తాత్కాలికంగానైనా విరామం దక్కుతుంది. ప్రతి దశ ఆరువారాలచొప్పున మూడుదశల్లో అమలయ్యే ఈ ఒప్పందానికి గత ఏడాది మేనెలలో తాను చేసిన ప్రతిపాదనలే ప్రాతిపదికలని బైడెన్ అంటున్నారు. తొలి ఆరువారాలు ఇది గనుక సవ్యంగా అమలు జరిగితే, ఇజ్రాయెల్ బలగాలు గాజాను కనీసం కొంతమేరకు ఖాళీచేయడం, బందీల అప్పగింత గాడినపడటం మొదలవుతుంది. ప్రతీ ఏడురోజులకూ ఏ పక్షం ఎంతమందిని ఇచ్చిపుచ్చుకోవాలన్నది ఈ ఒప్పందంలో నిర్దిష్టంగా ఉంది. ఒప్పదం అమలులోకి రాగానే సహాయకచర్యలు ఊపందుకుంటాయి, నీరు, ఆహారం, విద్యుత్ ఇతరత్రా అవసరాలు తీరడానికి ప్రత్యేక ప్రయత్నాలు జరుగుతాయి.

గత ఏడాదికాలంలో హమాస్ పలుమార్లు కాల్పుల విరమణకు దిగిరావడం, దానికి పూర్తి భిన్నంగా నియమనిబంధనల విషయంలో ఇజ్రాయెల్ ఏవో అడ్డంకులు పెడుతూండటం తెలిసిందే. బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలను విడిపించుకోవడంకంటే హమాస్‌ను దుంపనాశనం చేయడమే తన ప్రథమకర్తవ్యమని ప్రకటించి, యుద్ధాన్ని నెతన్యాహూ ఏడాదిన్నరపాటు కొనసాగించడంతో ఈ సంస్థ పూర్తిగా దెబ్బతినిపోయింది. సర్వశక్తిసంపన్నులనుకున్న దాని నాయకులంతా ఒక్కరొక్కరుగా రాలిపోయి, దాని సమస్తవ్యవస్థలూ కూలిపోయాయి. అప్పట్లో హమాస్ అపహరించుకుపోయినవారిలో ఓ అరవైమంది మాత్రమే ఇంకా దానివద్ద మిగిలి ఉన్నారని, వీరికి బదులుగా వందలాదిమంది పాలస్తీనియన్ ఖైదీలు విడుదలకాబోతున్నారని వార్తలు వెలువడుతున్నాయి. మొదటి ఆరువారాల అనంతరం కూడా కాల్పుల విరమణ కచ్చితంగా కొనసాగించాలన్న లిఖితపూర్వకమైన అవగాహన ఏదీ ఈ ఒప్పందంలో ఇప్పటికైతే లేదట. ఒప్పందం అమలులోకి వచ్చిన పదహారోరోజున తిరిగి చర్చలకు కూచొని, సమీక్షలతో మలిదశకు పురోగమించాల్సి ఉంటుంది. గత ఏడాది నవంబరులో స్వల్పకాలిక విరామం ఇస్తున్నట్టే ఇచ్చి, నెతన్యాహూ తిరిగి దాడులకు దిగిన విషయం తెలిసిందే. ఒప్పందాన్ని వమ్ముచేసేందుకు ఆయన దగ్గర సవాలక్ష కారణాలు సిద్ధంగా ఉంటాయి. కాల్పుల విరమణ అన్న మాటకే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ఆదినుంచీ బద్ధవ్యతిరేకి. యుద్ధం పూర్తిగా నిలిచిపోయిన పక్షంలో తాను గద్దెదిగాల్సివస్తుందని, తన కూటమి ప్రభుత్వం అధికారంనుంచి తప్పుకొని ఎన్నికలకు పోవాల్సి ఉంటుందని ఆయన తెలుసు.

ప్రస్తుతానికి యుద్ధం ముగిసిపోలేదు కానీ, తొలి ఆరువారాలూ ఈ ఒప్పందం సవ్యంగా అమలైనపక్షంలో అందుకు అవకాశమైతే ఏర్పడుతుంది. ఈ ఒప్పందాన్ని కుదిర్చింది బైడెన్ కాదు, మరో ఐదు రోజుల్లో అమెరికా అధ్యక్షపీఠాన్ని అధిరోహించబోతున్న ట్రంప్ హెచ్చరికలతోనే నెతన్యాహూ ఎట్టకేలకు దిగివచ్చాడన్నది నిజమైతే మరీ మంచిది.

అపురూప కవులకు లోక్‌నాయక్ పురస్కారం

గత 20 సంవత్సరాలుగా ఎన్.టి. రామారావు గారి పుణ్యతిథి రోజున లోక్‌నాయక్ ఫౌండేషన్ (విశాఖపట్నం) రెండు లక్షల రూపాయల నగదు ప్రదానం చేసే సాహిత్య పురస్కారాన్ని ఈ సంవత్సరానికి గాను అందెశ్రీ, ఖాదర్ మొహియుద్దీన్ స్వీకరిస్తారు. మనిషితనానికై పరితపించిన పాట అందెశ్రీది. ముస్లిం అస్తిత్వ వేదనను పలికించిన కవనం ఖాదర్ మొహియుద్దీన్‌ది.

అక్షర జ్ఞానం లేని రత్నాకరుడనే బోయవాడు సంస్కృతంలో రామాయణ మహాకావ్యాన్ని రచించి వాల్మీకి అయ్యాడని చదువుకున్నాం. మన కాలపు వాల్మీకి అందెశ్రీ. పాండిత్యం పండితుల కుటుంబాల్లో, ప్రతిభ పెట్టుబడిదారుల కుటుంబాల్లో మాత్రమే పుట్టదు అని నిరూపించారు.

అసలు పేరు అందె ఎల్లయ్య. 1961 జూలై 18వ తేదీన వరంగల్ జిల్లా మద్దూర్ మండలం రేబర్తి గ్రామంలో జన్మించారు. పదేళ్ళు కూలీగా, ఇరవై రెండేళ్ళు తాపీ మేస్త్రీగా పనిచేశారు. అక్షర జ్ఞానం లేదు. చదవడం, రాయడం రాదు. "నేను పుట్టిన దేశంలో కులమే ప్రామాణికమైనప్పటికీ నా ఊరిలో నాకు కులమనే మరకే అంటలేదు. నా ఊరిలోని ప్రజలందరూ మానవ కులంగా బ్రతుకుతారు. నా ఊరు నాకు చెక్కుచెదరని నేపథ్యంగా మారింది" అని చెప్పిన అందెశ్రీ, హైదరాబాద్ వచ్చి ఐదేళ్ల పాటు కాలినడకనే నగరంలో తిరిగాడు. భార్య మెడ లోని తాళిబొట్టు కూడా అమ్ముకోవాల్సిన దుర్భర పరిస్థితులు. తినడానికి ఒక్క రూపాయి లేక ఆకలితో ఆత్మహత్య చేసుకుందామనుకున్నాడు. అప్పుడే ఆయన లోంచి కవి పుట్టుకొచ్చాడు. జీవించాలి అనే తలంపు ఉంటే అన్నీ నేర్పుతుంది జీవితం. ఇందుకు అందెశ్రీ నిలువెత్తు నిదర్శనం. నిజామాబాద్ లోని శృంగేరి మఠంలో శంకర్ మహరాజ్ అందెశ్రీ అని పేరు పెట్టి, వెన్నుతట్టి ప్రోత్సహించారు. చదువుకుంటేనే భాష వస్తుంది అనేది అపోహనని నిరూపించారు అందెశ్రీ. వినడం ద్వారానే పురాణ, ఇతిహాసాలు, వేద వాఙ్మయ, ఉపనిషత్తుల ధర్మాలు అన్నీ అవగాహన చేసుకున్నారు. భక్తి పాటలు రాశారు. ప్రజా ఉద్యమాలకు బాటలు వేసే గొప్ప గీతాలు రచించారు. "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు/ నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు/ ఏడ ఉన్నడో కానీ కంటికీ కానరాడు" – అంటూ మనిషితనం కోసం తపించాడు.



"మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు/ మచ్చుకైనా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు/ నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు/ ఏడ ఉన్నడో కానీ కంటికీ కానరాడు" – అంటూ మనిషితనం కోసం తపించిన కవి అందెశ్రీ, స్వాతంత్ర్యానంతర కాలంలో భారత ముస్లింల అస్తిత్వ వేదనను 'పుట్టుమచ్చ' కవిత రూపేణా శక్తిమంతంగా అభివ్యక్తం చేసిన కవి ఖాదర్ మొహియుద్దీన్ ఈ ఏడాది 'లోక్‌నాయక్ ఫౌండేషన్' వార్షిక సాహిత్య పురస్కారాన్ని స్వీకరించనున్నారు.

'జయజయహే తెలంగాణ' ఇప్పుడు రాష్ట్ర గీతంగా ధ్వనిస్తోంది. ఆయన రచనలు పాఠ్యపుస్తకాల్లో భాగాలయ్యాయి. భారత ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారాన్ని, కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్న అందెశ్రీ 'లోక కవి' బిరుదును సొంతం చేసుకున్నారు. ఈ సంవత్సరం 'లోక్‌నాయక్ ఫౌండేషన్' అందెశ్రీని తమ వార్షిక సాహిత్య పురస్కారం రెండు లక్షల రూపాయల నగదుతో సత్కరిస్తున్నది.

స్వాతంత్ర్యానంతర కాలంలో భారత ముస్లింల అస్తిత్వ వేదనను శక్తివంతంగా అభివ్యక్తం చేసిన కవిత ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ'. రామచంద్ర గుహ వంటి చరిత్రకారుడు తన 'ఇండియా ఆఫ్టర్ గాంధీ' పుస్తకంలో 'పుట్టుమచ్చ' కవిత నుంచి కొన్ని పంక్తులను ఉటంకించారు. ప్రఖ్యాత హిందీ కవి అశోక్ వాజపేయి సంపాదకత్వంలో వెలువడిన 'ఇండియా డిసెంట్స్: 3000 ఇయర్స్ ఆఫ్ డిఫరెన్స్, డౌట్ అండ్ ఆర్గ్యుమెంట్' బృహత్ సంకలనం కోసం తెలుగు నుంచి మూడు కవితలను ఎంపిక చేశారు. అందులో ఒకటి ఖాదర్ మొహియుద్దీన్ 'పుట్టుమచ్చ' కాగా, మిగతా రెండిటిలో ఒకటి అన్నమయ్యది, రెండవది గద్దర్‌ది!

"నేను పుట్టకముందే దేశద్రోహుల జాబితాలో నమోదైవుంది నా పేరు" అన్న ఖాదర్– 1955 ఆగస్టు 10న కృష్ణాజిల్లాలోని ఒక మారుమూల కుగ్రామంలో జన్మించారు. పుట్టి పెరిగిన దేశంలోనే వలస జీవనాన్ని ఈడ్వాల్సిన కాందిశీకుని యాతన ఖాదర్ మొహియుద్దీన్ కవిత్వంలో వినిపించే వేదన. అమాయకంగా దెబ్బతింటున్న భారత ముస్లింల స్వరానికి ఇచ్చిన కొన్ని లక్షల కోట్ల డెసిబిల్స్ శబ్దం ఖాదర్ మొహియుద్దీన్ కవిత్వం.

నిజానికి పుట్టుమచ్చ దీర్ఘకవిత ఖాదర్ మొహియుద్దీన్ ఇతర కవితలను కనుమరుగయ్యేలా చేసిందని పలువురు విమర్శకులు, కవులు గుర్తించారు. ఉదాహరణకు మొదటి కవిత 'సంధ్య' నుంచి రెండు చరణాలు– "ఎవరో చచ్చిన ఆవును మోసుకుపోతున్నారు/ దాని తోక నేల మీద ఎలిజీ రాస్తోంది.../ వెలుగు చీకట్ల పల్టీలు వేస్తూ/ ఎర్ర లంగోటా చుట్టుకుని/ కాలం వేసిన శీర్షాసనం ఈ సంధ్యా సమయం" – ఇటువంటి అద్భుతమైన వాక్యాలతో పాటు, "చినిగిపోతున్న క్యాలెండర్ చివరి పేజీ వెనుక నా నీడంటే భయం...", "గోడల్ని నిలువునా కూల్చితే తప్ప నీడలు నిజాల్ని విప్పవు/ బహుశా దిక్కులు లేవనెత్తితే ఉషస్సు శవపేటికలా పైకి లేస్తుంది" వంటి మహావాక్యాలు ఖాదర్ మొహియుద్దీన్ కవిత్వంలో అనేకం. 'ఆజైవిక' శీర్షికతో కరోనా వైరస్‌పై రాసిన కవిత ఇటీవలి సంచలనం. అనువాద రంగంలో ఖాదర్ మొహియుద్దీన్‌ది అందె వేసిన చెయ్యి. టి.ఎస్. ఎలియట్ 'ద వేస్ట్ లేండ్'కు 'చవిటిపర్ర' శీర్షికతో చేసిన అనువాదం ఒక ఉదాహరణ మాత్రమే. 'పుట్టుమచ్చ' ఇంటి పేరుగా మారిపోయిన ఖాదర్ మొహియుద్దీన్‌కు 'లోక్‌నాయక్ ఫౌండేషన్' విశాఖపట్నం రెండు లక్షల రూపాయల నగదుతో తమ వార్షిక సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నది.

లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదానం రేపు సాయంత్రం 5 గంటలకు డా. బి.ఆర్. అంబేద్కర్ అసెంబ్లీ హాల్, ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్నంలో జరుగుతుంది. పై పురస్కారాలతో పాటు లక్షరూపాయల జీవన సాఫల్య పురస్కారాన్ని ఇమ్మణ్ణి దీపావెంకట్, డి.ఆర్.కె. ప్రసాద్, పద్మావతి దంపతులు స్వీకరిస్తారు. సభలో ముఖ్య అతిథిగా నల్లు ఇంద్రసేనారెడ్డి, సభాధ్యక్షులుగా గంటా శ్రీనివాసరావు, గౌరవ అతిథిగా నటుడు కన్నెగంటి బ్రహ్మానందం, ఆత్మీయ అతిథులుగా– చలసాని అశ్వనీదత్, వై.వి.యస్. చౌదరి, వల్లేపల్లి శశికాంత్, లావు రాణి రుద్రమదేవి పాల్గొంటారు.


◆ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

చరిత్రలోకి జారిపోతున్న 'ఇండియా'!

'ప్రధాని మోదీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీకి వ్యతిరేకంగా ఒక మహాకూటమి ఏర్పాటు చేయాలన్న ఆలోచన యుక్తమైనదే, అయితే అదెంత వరకు సుసాధ్యమవుతుందో నేను కచ్చితంగా చెప్పలేను'– జూన్ 2023లో ఇండియా కూటమి సీనియర్ నాయకుడు ఒకరు అన్న మాట అది. ఆ రాజకీయ దురంధరుడు చాలా జాగ్రత్తగా చెప్పిన ఆ మాటలు ఇప్పుడు దాదాపుగా రుజువయ్యాయి. పద్దెనిమిది నెలల క్రితం రోహిణీ కార్తె రోజుల్లో పాట్నాలో విభిన్న రాజకీయ స్వభావాలతో వ్యవహరించే వివిధ రాజకీయ పక్షాలు అసంభవమనుకున్న బీజేపీ వ్యతిరేక రాజకీయ కూటమి నేర్పాటు చేశాయి. సార్వత్రక ఎన్నికల అనంతరం ఆ కూటమి చీలిపోవడం ప్రారంభమయింది. ఆ చీలిక ప్రక్రియ ఇప్పుడు దాదాపుగా పూర్తయిందని చెప్పవచ్చు. ఇండియా కూటమి దాదాపుగా అస్తమించింది. దానికి అంత్యక్రియలు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన పిమ్మట తప్పక జరుగుతాయి.

గత సార్వత్రక ఎన్నికలలో మోదీ నేతృత్వంలో బీజేపీ 400 లోక్‌సభ సీట్లను సాధించాలని మోదీ నేతృత్వంలోని బీజేపీ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని అడ్డుకునేందుకు ప్రభవించిన ఇండియా కూటమి లక్ష్య పరిపూర్తి అనంతరం ఎంతో కాలం సమైక్యంగా ఉండలేక పోయింది. తగ్గిన మెజారిటీతో నరేంద్ర మోదీ మళ్లీ ప్రధానమంత్రి అయ్యారు. ఆ తరువాత జాతీయ ప్రాథమ్యాల కంటే రాష్ట్ర స్థాయి రాజకీయ అవసరాలు, ఒత్తిళ్లే ఇండియా కూటమి రాజకీయాలను ప్రభావితం చేయడం ప్రారంభమయింది. బెంగాల్‌లో మమతా బెనర్జీ, వామపక్షాలు సమైక్యంగా పనిచేసేందుకు ఆమోదయోగ్యమైన ప్రాతిపదిక ఏమైనా ఉన్నదా? పోనీ, అటువంటి ప్రాతిపదికను కనుగొనేందుకు మమత, వామపక్షాలు ప్రయత్నించగలవని ఎవరూ భావించలేరు. బిహార్‌లో శత్రువులుగా మారిన స్నేహితులు, తిరిగి స్నేహపూరిత శత్రువులుగా మారిన నితీశ్ కుమార్, లాలూప్రసాద్ యాదవ్‌ల మధ్య ఎప్పుడైనా పరస్పర విశ్వాసమున్నదా? కశ్మీర్ లోయలో ఆధిపత్యానికి తీవ్రంగా పోటీపడే ఒమర్ అబ్దుల్లా, మెహబూబా ముఫ్తి ఇంకా ఎంతకాలం ఒకే కూటమి(ఇండియా)లో ఉండగలుగుతారు? మహారాష్ట్రలో శివసేన (ఉద్ధవ్) తన మిలిటెంట్ హిందుత్వ గతాన్ని తన ఇప్పటి అస్పష్ట వర్తమానంతో ఇంకెంత కాలం సామరస్యంగా ఉంచగలుగుతుంది? జాతీయ ఎన్నికలలో నరేంద్ర మోదీ, బీజేపీ ఉమ్మడి శత్రువులే అయినప్పటికీ రాష్ట్ర స్థాయిలో సమీకరణాలు తప్పక మారతాయి. మారాయి కూడా.

ఢిల్లీలోనే ఈ వాస్తవం తేటతెల్లంగా కనిపిస్తోంది. ఎనిమిది నెలల క్రితం దేశ రాజధానిలో కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలుగా కలిసికట్టుగా పోరాడాయి. అదే సమయంలో పంజాబ్‌లో ప్రత్యర్థులుగా ఎన్నికల బరిలో నిలిచాయి. ఒకే కూటమిలో ఉన్నా ఇరు పార్టీల మధ్య సఖ్యత లోపించింది. రాజకీయ అంకగణితం నుంచి లబ్ధి పొందడానికి ఎంతగా ప్రయత్నించినా కాంగ్రెస్, ఆప్‌ల మధ్య దృఢ అనుబంధం లేనేలేదు. ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ శిథిలాల నుంచే రాజకీయ అంకుర పక్షమైన ఆప్ ప్రభవించిందనే సత్యం విస్మరించరానిది. 2011లో అవినీతికి వ్యతిరేకంగా అరవింద్ కేజ్రీవాల్ నిర్వహించిన ఉద్యమమే మన్మోహన్ సింగ్ ప్రభుత్వాన్ని బలహీనపరిచింది. ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక వాతావరణాన్ని సృష్టించింది. ఈ పరిస్థితిని 2014 సార్వత్రక ఎన్నికలలో తన ప్రయోజనాలకు బీజేపీ పూర్తిగా వినియోగించుకున్నది. ఢిల్లీకి వరుసగా 15 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ నాయకురాలు షీలా దీక్షిత్‌ను మట్టి కరిపించారు. అయితే అంతిమంగా కాంగ్రెస్ బయట నుంచి ఇచ్చిన మద్దతుతో ఢిల్లీలో ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ ఏర్పాటు చేశారు. దేశ పురాతన రాజకీయ పక్షానికి కొత్తగా రాజకీయాలలోకి వచ్చిన కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్‌కు మద్దతునివ్వడం తప్పనిసరి అయింది. దరిమిలా దేశ రాజధానిలో కాంగ్రెస్ వైభవం క్షీణించిపోయింది. ఒక దశాబ్ద కాలంగా ఢిల్లీ నుంచి లోక్‌సభకు గెలిచిన కాంగ్రెస్ నేత ఎవరూ లేరు.



ఎన్డీఏ, దాని రాజకీయ ప్రత్యర్థులు పార్లమెంటు లోపల, బయట సమస్థాయిలో పోటీ పడే రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయనే ఆశాభావాన్ని 2024 సార్వత్రక ఎన్నికల ఫలితాలు కలిగించాయి. అంతర్గత విభేదాలతో ఇండియా కూటమి శీఘ్ర పతనం మరింత గందరగోళ, నిరాశా జనక రాజకీయాలు మళ్లీ నెలకొనవచ్చని సూచిస్తోంది. అదే జరిగితే మోదీ సర్కార్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే వారినందరినీ నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు వెనుకాడదు. భారత్‌కు ఇప్పుడు అవసరమయింది ప్రతిపక్షాలు లేని రాజకీయాలు ఎంత మాత్రం కాదు.

కనుకనే ప్రస్తుత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయడం ద్వారా తన మనుగడను కాపాడుకునేందుకు, తన సత్తాను నిరూపించుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. గత సార్వత్రక ఎన్నికలలో వలే కలిసికట్టుగా పోటీ చేసేందుకు అటు ఆప్ గానీ, ఇటు కాంగ్రెస్ గానీ ప్రయత్నించనే లేదు. పైగా ఇరు పార్టీలు పరస్పరం తీవ్ర విమర్శలు చేసుకుంటున్నాయి. వాటి మధ్య మాటల యుద్ధం అదుపు తప్పుతోంది. ఈ పరిస్థితి బీజేపీకి తన గెలుపుపై భరోసానిస్తోంది. గత ఏడాది హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో ఆప్‌తో పొత్తు పెట్టుకునేందుకు రాహుల్ గాంధీ అంగీకరించారు. అయితే తమ విజయంపై మితిమీరిన విశ్వాసంతో హర్యానా పీసీసీ నాయకులు ఆప్‌తో పొత్తుకు అంగీకరించలేదు. పొత్తు ప్రయత్నాలను విఫలం చేసేందుకు చేయవలసినదంతా చేశారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఓడిపోయిన కాంగ్రెస్, ఇప్పుడు ఢిల్లీ ఎన్నికలలో ఒంటరిగా పోటీ చేయవలసిన అగత్యంలోకి పడిపోయింది. ఇప్పుడు కేజ్రీవాల్ కాంగ్రెస్‌తో పొత్తుకు ససేమిరా అన్నారు. అంతేకాకుండా ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్‌ను గెంటివేయాలని కూడా ఘోషించారు!

ఇండియా కూటమి ఆవిర్భావం నుంచి దాని ప్రస్థానాన్ని సింహావలోకనం చేస్తే నాయకుల అహమికలు, ఆకాంక్షలు ఎంత పరస్పర విరుద్ధంగా ఉన్నాయో ఆశ్చర్యం గొలుపుతుంది. ఆ మాటకొస్తే ఆ నాయకులు అసలు ఆ మహా కూటమి నిర్మాణానికి ఎలా పూనుకున్నారా అని అంతులేని విస్మయమూ కలుగుతుంది. మోదీ వ్యతిరేక ప్రతిపక్ష కూటమిని తొట్ట తొలుత ప్రతిపాదించిన నితీశ్ కుమార్ 'ఇండియా' నుంచి వైదొలిగిన మొట్టమొదటి నేత కావడం గమనార్హం. ఇండియా కూటమికి కన్వీనర్‌గా ఉండాలన్నది ఆయన ప్రగాఢ ఆకాంక్ష. అయితే ఇతర భాగస్వామ్య పక్షాలు అందుకు ససేమిరా అనడంతో నితీశ్ ముందుగానే ఇండియా కూటమి నుంచి నిష్క్రమించి తన కొక భద్ర బాటను ఎంచుకున్నారు. బెంగాల్‌లో వామపక్షాలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకోవడాన్ని మమతా బెనర్జీ క్షమించరుగాక క్షమించరు. పైగా అన్ని విధాల తనకు జూనియర్ అయిన రాహుల్ గాంధీ కంటే తాను తక్కువ స్థానంలో ఉండవలసిరావడాన్ని ఆమె అంగీకరించలేక పోయారు. కాంగ్రెస్ ఆధిపత్యాన్ని ఆమె ప్రశ్నించారు, వ్యతిరేకించారు. ఇక కాంగ్రెస్ నాయకత్వంలో ఒక బలమైన వర్గం లోక్‌సభలో తమకు 99 స్థానాలు దక్కడాన్ని ఒక మహా విజయంగా పరిగణించింది. తమ పార్టీ పునరుజ్జీవితమవుతున్నదని విశ్వసించింది. క్షేత్ర స్థాయి వాస్తవాలను విస్మరించింది. ప్రజల మద్దతు ఇక పూర్తిగా ఉంటుందని భ్రమ పడింది. అధికార కైవసానికి తాము చేరువవుతున్నామని నమ్మింది. కూటమిని పటిష్ఠం చేయగల బాధ్యతను సమర్థంగా నిర్వర్తించగల నేత శరద్ పవార్. ఇప్పుడు అష్టదులు పైబడిన వయసులో ఉన్న వృద్ధ నేత. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఆయన పార్టీ అనూహ్య పరాజయం పాలయింది. ఖిన్నుడైన పవార్ నిస్సహాయుడుగా మిగిలిపోయారు. ఈ పరాజయ అవమానంతో ఇండియా కూటమి అంతర్గత కలహాలను తీర్చ గల సంకల్పం, సామర్థ్యం ఆయనలో లేకుండా పోయాయి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

అయితే ఇండియా కూటమి పతనంలో దాని నాయకులకు మాత్రమే పరిమితం కాని ఒక పాఠం ఉన్నది. గత దశాబ్దంలో మోదీ ఉత్థానం ఒక రాజకీయ భూతాన్ని సృష్టించింది: ఏక పార్టీ, ఏక నాయకుడు ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నిరంకుశ పాలన' వైపు దేశం నెట్టబడుతుందనే భీతి సర్వత్రా వ్యాపించింది. ఈ కారణంగానే తాము పూర్తిగా ప్రాధాన్యం కోల్పోతామనే భయమే ప్రతిపక్షాలను ఏకం చేసింది. అయితే మోదీ, మోదిత్వ పట్ల తీవ్ర వ్యతిరేకత మినహా ఆ ఏకీకరణకు మరెలాంటి ఉమ్మడి ప్రాతిపదిక లేదు. 1970ల్లో ఇందిరాగాంధీని ఎట్టి పరిస్థితులలోను అధికారం నుంచి దించివేయాలనే ప్రతిపక్షాల కోరిక నుంచి జనతా పార్టీ ఆవిర్భవించినట్టుగా ఇప్పుడు మోదీ పట్ల తీవ్ర వ్యతిరేకతే ఇండియా కూటమి ప్రభవించడానికి దారితీసింది. అయితే సైద్ధాంతిక ప్రాతిపదికలు లోపించిన ప్రతిపక్ష రాజకీయాలు స్వల్పకాలిక లక్ష్యాలపై ఆధారపడి మనుగడ సాగించలేవు. కనుకనే జనతా పార్టీ కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే అధికారంలో ఉండగా, ఇండియా కూటమి అధికారాన్ని కైవసం చేసుకోలేక పోగా అంతకంటే తక్కువ వ్యవధిలోనే చీలి పోవడం ప్రారంభమయింది. జనతా పార్టీకి కనీసం మహోన్నతుడైన లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ కొంత కాలం మార్గదర్శిగా ఉన్నారు; ఇండియా కూటమికి అటువంటి వివేకశీలి అయిన నాయకుడు లేక పోవడమే కాకుండా దాని ప్రస్థానాన్ని తీర్చి దిద్దగల ఒక కనీస ఉమ్మడి కార్యక్రమం కూడా లేకపోయింది.

ఇండియా కూటమి పతనం, 2024 ఆరంభంలో బీజేపీ ఎంత బలీయశక్తిగా ఉన్నదో మళ్లీ అంత బలమైనశక్తిగా పునరావిర్భవించడాన్ని సూచిస్తుంది. గత సార్వత్రక ఎన్నికలకు ముందు తనకు అడ్డుగా ఉన్న ఏ ప్రతిపక్షాన్ని అయినా కూల్చివేయగల శక్తి సామర్థ్యాలు మోదీ పార్టీకి పుష్కలంగా ఉన్నాయన్న వాస్తవం విస్మరించరానిది. మోదీ ప్రభుత్వం తనను వ్యతిరేకిస్తున్న రాజకీయ పక్షాలను ఆత్మరక్షణలో పడవేసేందుకు రాజ్యాంగ సంస్థలు, వ్యవస్థలను నిస్సంకోచంగా ఉపయోగించుకుంటున్న తరుణంలో ప్రతిపక్షాలు వేటికవి వేరుపడి పోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తిగల పౌరులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. ఎన్డీఏ ప్రభుత్వం దాని రాజకీయ ప్రత్యర్థులు పార్లమెంటు లోపల, బయట సమస్థాయిలో పోటీ పడే రాజకీయ పరిస్థితులు నెలకొన్నాయనే ఆశాభావాన్ని 2024 సార్వత్రక ఎన్నికల ఫలితాలు కలిగించాయి. అంతర్గత విభేదాలతో ఇండియా కూటమి శీఘ్రగతిన కూలిపోవడం మరింత గందరగోళ, నిరాశా జనక రాజకీయాలు మళ్లీ నెలకొనవచ్చని సూచిస్తోంది. అటువంటి పరిస్థితుల్లో మోదీ ప్రభుత్వం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసే వారినందరినీ నిర్దాక్షిణ్యంగా అణచివేసేందుకు వెనుకాడదు. భారత్‌కు ఇప్పుడు అవసరమయింది ప్రతిపక్షాలు లేని రాజకీయాలు ఎంత మాత్రం కాదు కదా.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మనిషిని యంత్రుడుగా మారుస్తారా?

జనవరి తొమ్మిదిన రెండు వార్తలు ఉద్యోగ, శ్రామిక రంగాల్లో పెద్ద దుమారాన్ని రేపాయి. మొదటిది, కృత్రిమ మేధ (ఏఐ) తదితర ఆధునిక సాంకేతిక ఆవిష్కరణల వల్ల దాదాపు 93 మిలియన్ల మంది ఉద్యోగులు సామూహిక స్థానభ్రంశానికి గురి కాబోతున్నారనేది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్లుఇఎఫ్) 'ఉద్యోగుల భవిష్యత్తు' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ హెచ్చరికను చేసింది. రెండోది, లార్సన్ అండ్ టూబ్రో (ఎల్ అండ్ టీ) చైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ 90 గంటల పని వారాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు అనేది.

సుబ్రమణ్యన్ ఒక ఆంతరంగిక సమావేశంలో యథాలాపంగా అన్న మాటల్ని పట్టించుకోవాల్సిన పనిలేదని ఆ సంస్థ ప్రతినిధులు అంటున్నారు. సుబ్రమణ్యన్ మాట్లాడింది ఒక విధానానికి సంబంధించిన అంశం కనుక ఎక్కడ అన్నారూ అనేదానికన్నా ఏమన్నారూ అనేదే ప్రధానం. సుబ్రమణ్యన్ ప్రతిపాదన ప్రకారం వారానికి ఏడు పనిదినాలయితే రోజుకు 13 గంటలు పనిచేయాలి. ఆరు పనిదినాలయితే రోజుకు 15 గంటలు పనిచేయాలి. ఐదు పనిదినాలయితే రోజుకు 18 గంటలు పనిచేయాలి. గతంలో ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి కూడ 70 గంటల పనివారాన్ని ప్రతిపాదించారు. వారి ఉద్దేశ్యం కూడా సిబ్బందితో రోజుకు 14 గంటలు పని చేయించాలనే.

కార్మిక సంఘాలు, సామ్యవాదులు మాత్రమే గాక మానవతావాదులు, సామాన్యులు సహితం ఇలాంటి ప్రతిపాదనల్ని సహజంగానే తీవ్రంగా వ్యతిరేకిస్తారు. నిజానికి ఈ రెండు వార్తలూ పరస్పర విరుద్ధంగా ఉన్నాయి. మొదటిది– ఉన్న ఉద్యోగాలే ఊడిపోతాయి అంటుంటే, రెండోది, శ్రామికులు మరిన్ని అదనపు గంటలు పనిచేయాలంటున్నది.

ప్రత్యర్థుల నోరు మూయించడానికి మన ఏలినవారు ఇటీవలి కాలంలో దేశభక్తిని తిరుగులేని ఆయుధంగా వాడుతున్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీలు విడుదల చేసే కాలుష్యానికి వ్యతిరేకంగా స్థానికులు ఆందోళన చేస్తుంటే, వాళ్ళ నోళ్లు మూయించడానికి కూడా దేశభక్తిని ముందుకు తెస్తున్నారు. శిలాజ ఇంధనమైన ముడి చమురును దిగుమతి చేసుకోవడానికి భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని చెల్లించి దేశం అప్పుల పాలవుతున్నదనీ, ఇథనాల్ వంటి జీవ ఇంధనాలను ఇక్కడే తయారు చేస్తే దేశం మీద రుణభారం తగ్గుతుందనీ ఆ వాదన సారాంశం. పని గంటల విషయం లోనూ ఇదే వాదన. మన దేశం చైనాను అధిగమించాలంటే భారత ఉద్యోగులు, శ్రామికులు అధికంగా శ్రమించాలంటున్నారు. భారతదేశ భవిష్యత్తు ఇప్పుడు శ్రామికుల చేతుల్లోనే ఉంది అనే మాటలూ వినిపిస్తున్నాయి.

భూమి, ఆకాశం, సముద్రాలు, అడవులు, కొండలు, గనులతోపాటు దేశ శ్రామికుల్ని కూడా ప్రభుత్వం మెగా కార్పొరేట్లకు అప్పచెపుతోంది. శ్రామికులు మారు మాట్లాడకుండా దేశభక్తి పారవశ్యంతో రోజుకు 24 గంటలు పని చేస్తే భారతదేశం చైనాను ఏమిటీ, ఏకంగా అమెరికాను సహితం అధిగమిస్తుంది అనేది ఏలినవారు చెప్పదలచుకున్న సిద్ధాంతం.

కృత్రిమ మేధ (ఏఐ) వచ్చాక లెక్క ప్రకారం మనిషికి పనిభారం తగ్గాలి. విడ్డూరం కాకపోతే ఈ పని గంటలు పెంచడం ఏమిటీ? కృత్రిమ మేధను ఒక బూచిగా చూపించి ఉద్యోగ, శ్రామిక వర్గాలను మరింతగా లొంగదీసుకోవడానికి మెగా కార్పొరేట్లు కుట్రలు పన్నుతున్నాయా?



16వ శతాబ్దంలో ఆధునిక యంత్రాల మీద ఉత్పత్తి విధానం మొదలయినప్పుడే మనిషి ఒక రోజులో ఎంత సమయం శ్రమించాలి అనే చర్చ కూడా మొదలయింది. ఇందులో తాత్త్విక, ధార్మిక, సాంస్కృతిక దృక్పథాలు ఉన్నాయి. శ్రమించడం దైవారాధనకు మరో రూపం, సాతాను ప్రభావంలో ఉన్నవాళ్ళు శ్రమించరు – వంటి భావనని జాన్ కాల్విన్ వంటివాళ్ళు ముందుకు తెచ్చారు. అంతకుముందే సెయింట్ బెనెడిక్ట్ రులే వంటివారు ప్రార్థన, శ్రమ, విశ్రాంతుల మధ్య సమయ విభజన చేయడానికి ప్రయత్నించారు. 18వ శతాబ్దపు బెంజమిన్ ఫ్రాంక్లిన్ Early to bed and early to rise అంటూ మనందరికీ బాగా తెలిసిన నీతిని చెపుతూ త్వరగా పడుకొని త్వరగా లేచే మనిషిని ఆరోగ్యం, ధనం, జ్ఞానం వరిస్తాయి అని ఆశపెట్టాడు. ఇస్లాం ప్రబోధించే ఉపవాసాల్లోనూ ఎప్పుడు లేవాలి, ఎప్పుడు పడుకోవాలి అనే అంశాలతో పాటు మనిషి తన జీవితాన్ని, ఆర్థిక సామాజిక కర్తవ్యాలని సూర్యోదయ సూర్యాస్తమయాలతో అనుసంధానం చేయాలనే సూచనలు ఉంటాయి. తరువాత ఆడమ్ స్మిత్, మాక్స్ వేబర్ వంటి అర్థశాస్త్ర, సమాజశాస్త్ర ఆదిపురుషులు వచ్చారు. సమయం అంటే డబ్బు అనే మాట అప్పుడే పుట్టింది. అయితే, వీళ్ళందరూ తమకు తెలిసో తెలియకో పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన వాదనలు చేశారు.

దానికి విరుద్ధమైన వాదనలు కూడా అప్పట్లోనే వచ్చాయి. మనందరం ఏ తొమ్మిదో తరగతిలోనో న్యూటన్ చలన సూత్రాలను చదివి ఉంటాం. అందులో బాగా గుర్తుండిపోయేది: ప్రతి చర్యకు తత్సమానమైన వ్యతిరేకమైన ప్రతిచర్య ఉంటుంది అనేది. మనం తరచూ అక్కడితో ఆగిపోతాం. ఆ ప్రతిచర్య కూడా ఒక చర్య అయినప్పుడు దానికీ ఒక ప్రతిచర్య ఉంటుందని గుర్తించం. ఇలాంటి చర్య ప్రతిచర్యల నిరంతర కొనసాగింపే గతితర్కం.

ఆహార సేకరణ కాలంలో మనిషి కూడా దాదాపు జంతువుల్లానే జీవించాడు. అయితే, మనిషి పరికరాలు, యంత్రాలను సృష్టించి వాటిని విస్తృతంగా వాడడం మొదలు పెట్టాక సమయ పాలన అతన్ని జంతు ప్రపంచం నుంచి పూర్తిగా విడగొట్టేసింది. ఆహార నిద్రా మైథునాలనే శరీర ధర్మాలు, మతం, వాణిజ్యం వంటి సాంస్కృతిక, సామాజిక ధర్మాలతో పాటు శ్రమకు ఎంత సమయాన్ని కేటాయించాలనే అంశం చర్చకు వచ్చింది.

రోజుకు 24 గంటలు అనుకుంటే దాన్ని మూడు భాగాలు చేసి మొదటిదాన్ని శ్రమకు, రెండోదాన్ని సమాజానికీ, మూడోదాన్ని విశ్రాంతికీ కేటాయించాలనే అభిప్రాయం క్రమంగా బలపడింది. ఒక్కోదానికి చెరో ఎనిమిది గంటలు అన్నమాట. 19వ శతాబ్ద ఆరంభ కాలపు సమాజశాస్త్రవేత్త రాబర్ట్ ఒవెన్ ఈ సమాన సమయ విభజనను సిద్ధాంతీకరించాడు అంటారు. ఇందులో సమాజం అనే మాటకు చాలా అర్థాలున్నాయి. తల్లిదండ్రులు, భార్యాపిల్లలు, మిత్రులు, కళా సాహిత్య అభిరుచులు, రాజకీయ ఆసక్తులు, ప్రేమ, ద్వేషాలు వగైరాలన్నీ ఇందులో ఉంటాయి. అవన్నీ ఉన్నప్పుడే మనిషి సంఘజీవి అవుతాడు.

ఎనిమిది గంటల పని దినాన్ని ఫ్యాక్టరీ యజమానులు ఆమోదించలేదు. ఇప్పటి సుబ్రహ్మణ్యన్, నారాయణ మూర్తిల్లా 16 గంటల పనిదినం అమలు కావల్సిందేనని పట్టుబట్టారు. 1886లో అమెరికా అంతటా ఎనిమిది గంటల పనిదినం డిమాండు చాలా బలంగా ముందుకు వచ్చింది. ఆ ఏడాది మే ఒకటిన ఆల్బర్ట్ పార్సన్స్, ఆగస్టు స్పైయాస్ తదితరుల నాయకత్వంలో చికాగో నగరంలో జరిగిన ఉద్యమాన్ని రక్తపాతంతో ముంచెత్తారు. అయినప్పటికీ అది విజయం సాధించింది. ఇప్పుడు ఆ విజయాన్ని బలహీనపరిచి 18 గంటల పనిదినాన్ని పునరుద్ధరించాలన్న వాదనలు మొదలయ్యాయి.

చైనాతో మనం ఏ విధంగానూ పోల్చుకోలేము. పని స్థలానికి సమీపంలోనే అక్కడి ప్రభుత్వం కార్మికులకు నివాసాన్ని ఏర్పాటు చేస్తుంది. దానివల్ల మూడు లాభాలుంటాయి. ప్రయాణ సమయం, వాహనాల ఇంధన ఖర్చు, దేశంలో కాలుష్యం మూడూ తగ్గుతాయి. భారతదేశంలో అలాంటి ఏర్పాటు లేదు.

ఉదాహరణకు హైదరాబాద్‌లో పనిచేయడానికి కొందరు ఇప్పటికీ ప్రతిరోజూ వరంగల్, భూదాన్ పోచంపల్లి నుంచి వస్తుంటారు. కార్యాలయంలో ఎనిమిది గంటల పనిదినం ఎలాగూ తప్పదు. అది మారదు. ప్రయాణ సమయం సులువుగా 6–7 గంటలు ఉంటుంది. దీని కోసం వాళ్ళు సామాజిక జీవితాన్నయినా కోల్పోవాలి, లేదా విశ్రాంతి సమయాన్ని అయినా కోల్పోవాలి. వెరసి మనిషి ఒక యంత్రంగా మారిపోవాలి. ఇవి ఆ శ్రామికుల జీవితాల్లో అనేక కొత్త సంక్షోభాలను సృష్టిస్తాయి. మనిషిని యంత్రుడుగా మార్చే కపటం కొనసాగుతుంది.

సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కర రావు 1947లో రాసిన 'మాభూమి' నాటకంలో, నెలల పసిబిడ్డ అయిన తన కొడుకు నిద్రలేవడానికి ముందే ఓ వెట్టి కూలీ పనికి పోతుంటాడు. రాత్రి ఆ పిల్లవాడు నిద్రపోయాక ఇంటికి చేరుతుంటాడు. మెలకువగా ఉండగా తన కొడుకును చూడలేదని నెలల తరబడి వాపోతాడతడు. వర్తమాన ఉద్యోగ సమూహాలు అంతకన్నా దారుణమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు దీనికి మినహాయింపు కావచ్చు.

కృత్రిమ మేధ (ఏఐ) వచ్చాక లెక్క ప్రకారం మనిషికి పనిభారం తగ్గాలి. విడ్డూరం కాకపోతే ఈ పని గంటలు పెంచడం ఏమిటీ? కృత్రిమ మేధను ఒక బూచిగా చూపించి ఉద్యోగ, శ్రామిక వర్గాలను మరింతగా లొంగదీసుకోవడానికి మెగా కార్పొరేట్లు కుట్రలు పన్నుతున్నారా? అనే సందేహం ఎవరికయినా రావాలి.

● డానీ
సమాజ విశ్లేషకులు



సర్వే షురూ..

హనుమకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా, ఇందిరమ్మ రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు రంగం సిద్ధమైంది. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో గురువారం నుంచి సర్వే మొదలైంది. ఈనెల 24 వరకు ఈ సర్వే జరుగుతుంది. గ్రామ సభల్లో తుది జాబితాలను రూపొందిస్తారు. ఈనెల 26 నుంచి పథకాల అమలుకు చర్యలు తీసుకుంటారు.

రైతు భరోసా

రైతు భరోసా పంపిణీకి ప్రభుత్వం సన్నాహాలు మొదలయ్యాయి. సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించేందుకు హనుమకొండ, వరంగల్ జిల్లాల యంత్రాంగాలు వ్యవసాయ క్లస్టర్ల వారీగా బృందాలను ఏర్పాటు చేశాయి. హనుమకొండ జిల్లాల్లో 266 గ్రామపంచాయతీలు, వార్డు, డివిజన్లకు గాను 266 బృందాలను నియమించారు. ఈ బృందాలు గురువారం ఉదయం నుంచే తమ సర్వేలను ప్రారంభించాయి. ఈ బృందాలు నాలుగు రోజుల పాటు క్షేత్ర పరిశీలన చేసి అర్హులైన రైతులతో కూడి జాబితాలను సిద్ధం చేయనున్నాయి. ధరణి పోర్టల్ వివరాలు, గ్రామ పంచాయతీ, పురపాలిక, ఇతర శాఖల రికార్డుల ఆధారంగా సాగుకు యోగ్యంకాని భూముల ఏరివేత దాదాపు పూర్తయినట్టు అధికారులు చెబుతున్నారు. వీటిని క్లస్టర్ వారీగా గుర్తించే పని ప్రారంభించారు. క్రాప్ బుకింగ్ పోర్టల్‌లోని వివరాలను సాగుకు యోగ్యంకాని భూముల గుర్తింపునకు ప్రామాణికంగా తీసుకుంటున్నారు. క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో నాలుగేళ్ల నుంచి ఏఈవోలు, పంటలు వేస్తున్నట్లు నమోదు చేస్తే సదరు భూముల వివరాలను తొలగించనున్నారు. క్షేత్రపర్యటనలో ఆయా భూముల వివరాలను పరిశీలించి నిర్ధారణ చేసుకోనున్నారు.

బృందాలు

హనుమకొండ జిల్లా వ్యాప్తంగా 55 క్లస్టర్లు ఉన్నాయి. ఒక్కో క్లస్టర్‌లో సాగుభూముల విస్తీర్ణం 5వేల నుంచి 13వేల ఎకరాల వరకు ఉంది. సాగుకు యోగ్యం కాని భూముల వివరాలను పరిశీలించేందుకు ఏఈవో, రెవెన్యూ, ఆర్ఐ, గ్రామస్థాయి అధికారులను సభ్యులుగా నియమిస్తూ జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 16, 17,18, 20వ తేదీల్లో అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించనున్నారు. పరిశీలన బృందాల పనితీరును పర్యవేక్షించే బాధ్యతలను మండల స్థాయిలో తహసీల్దార్‌కు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలకు అప్పగించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా భూములను గుర్తించే ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

- నాలుగు పథకాల అమలుకు అధికారుల గ్రామబాట
- లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- ఒక్కో పంచాయతీ, వార్డు, డివిజన్‌కు ఒక్కో బృందం
- 24 వతేదీ వరకు సర్వే, 26న జాబితా ఖరారు
- హనుమకొండ జిల్లాలో 266, వరంగల్ జిల్లాలో 391 బృందాల ఏర్పాటు

భూ భారతిలో..

గతంలో రైతు బంధు పంపిణీకి బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పోర్టల్‌ను ఏర్పాటుచేసి పట్టాదారుల వివరాలు నమోదు చేసింది. ఆ వివరాల ఆధారంగానే పెట్టుబడి సాయం పంపిణీ చేశారు. ఏఈవోలకు, వ్యవసాయశాఖ అధికారులకు లాగిన్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ ప్రభుత్వం లబ్ధిదారుల వివరాల నమోదుకు భూ-భారతి పోర్టల్‌లో ప్రత్యేక ఐచ్ఛికాన్ని ఏర్పాటు చేస్తున్నారు. నమోదు, వివరాల తొలగింపునకు లాగిన్ ఎవరికిస్తారనేదానిపై సందిగ్ధత నెలకొంది. వ్యవసాయయోగ్యమైన భూములకు ఎకరానికి రూ.12 వేలు రైతుభరోసా పేరిట రైతు ఖాతాల్లో జమచేయనున్నారు. పనికిరాని సాగుభూములను గుర్తించిన తర్వాత గ్రామసభలను ఏర్పాటు చేసి ఆ భూముల వివరాలను చదివి వినిపిస్తారు. అందరి ఆమోదం మేరకు ఆ భూములను తొలగిస్తారు.



పరకాల మండలం నాగారం గ్రామంలో రేషన్ కార్డుల లబ్ధిదారుల గుర్తింపునకు వివరాలు సేకరిస్తున్న అధికారుల బృందం

హనుమకొండ జిల్లాలో 266 బృందాలు

హనుమకొండ జిల్లా పరిధిలో 266 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రామపంచాయతీ, వార్డు, డివిజన్‌కు ఒక్కక్కటి చొప్పు వీటిని ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 210 గ్రామపంచాయతీలు, పరకాల మున్సిపాలిటీ 22 వార్డులు, వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 34 డివిజన్లను ఉన్నాయి. వీటిని తిరిగి 67 క్లస్టర్లు విభజించారు. అంటే ఒక్కో క్లస్టర్‌కు సగటున నాలుగేసి బృందాలను నియమించారు. ప్రతీ బృందంలో ఈ నాలుగు సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించేందుకు సంబంధిత శాఖలైన వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి , పౌరసరఫరాలు, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులకు సర్వే బాధ్యతలను అప్పగించారు.

వరంగల్ జిల్లాలో 391 బృందాలు

వరంగల్ జిల్లాలో మొత్తం 391 సర్వే బృందాలను ఏర్పాటు చేశా రు. జిల్లాను 145క్లస్టర్లుగా విభ జించారు. ఇందులో రూరల్ క్లస్టర్లు 74 కాగా, అర్బన్ 71. జిల్లాలో 323 గ్రామ పంచాయతీలు, నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీలు, వరం గల్ నగర పాలక సంస్థ కొంత భా గం ఉంది. నర్సంపేట మున్సిపాలి టీలో 24వార్డులు, వర్ధన్నపేట ము న్సిపాలిటీలో 12వార్డులు ఉండగా జీడబ్ల్యూఎంసీ డివిజన్లు 32ఉన్నాయి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు కూడా గురువారం నుంచే సర్వే మొదలైంది. ఏడాదికి రూ.12వేలను రెండు విడతలు గా ఎంపిక చేసిన కుటుంబాల ఖాతాల్లో నగదు జమ చేస్తారు. ఇందుకు 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజులు ఉపాధి పనులకు వెళ్లిన వారినే ప్రామాణికంగా తీసుకుంటారు. ముసాయిదా జాబితాలను గ్రామసభలో ప్రదర్శించి ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి ప్రత్యేకాధిరుల సమక్షంలో తుది జాబితాను సిద్ధం చేస్తారు. అభ్యంతరాలు ఉంటే పది రోజుల్లో పరిష్కరిస్తారు.

రేషన్ కార్డుల సర్వే

రేషన్ కార్డుల సర్వే కూడా గురువారం నుంచే మొదలైంది. ఇందిరమ్మ ఇండ్ల పథకం రూ.5లక్షలు మంజూరు కావాలంటే లబ్ధిదారులకు రేషన్‌కార్డుతో పాటు నిర్మాణానికి స్థలం

మిగతా 8వ పేజీలో...

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- కడిపికొండ ఆర్వోబీ నిర్మాణం పూర్తి చేయాలి
- రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచండి
- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య



కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య, చిత్రంలో సీపీ అంబర్‌కిషోర్ ఝా, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

హనుమకొండ కలెక్టరేట్, జనవరి16(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. హనుమకొండ కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గురువారం ఆర్‌అండ్‌బీ, పోలీసు, రవాణా, వైద్య, ఆరోగ్య, మున్సిపల్, ఇతర శాఖల అధికారులతో రోడ్డు సేఫ్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో రోడ్డు సేఫ్టీకి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. రోడ్డు సేఫ్టీకి తీసుకోనున్న ముందస్తు చర్యల వివరాలు వెల్లడించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ఆర్‌అండ్‌బీ శాఖ ఆదర్యంలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. కడిపికొండ ఆర్వోబీ నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని, జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో గూడెప్పాడ్ వరకు కొనసాగుతున్న పనులు పూర్తిచేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు కృషి చేయాలని, కటాక్షపూర్ దగ్గర పనులు పూర్తిచేయాలన్నారు. వడ్డెపల్లి జంక్షన్ నుంచి గోకుల్‌నగర్ వరకు సిగ్నళ్లు పనిచేసే విధంగా చూడాలని, రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద చర్యలు తీసుకోవాలని, తరచుగా ప్రమాదాలు జరుగుతున్న చోట్ల వలంటీర్లను నియమించి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్ ఝా పేర్కొన్నారు. యువత ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించే విధంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రోజురోజుకూ వాహనాల వినియోగం పెరుగుతున్నందున అదేస్థాయిలో ట్రాఫిక్ పెరుగుతోందన్నారు. డ్రంక్ అండ్ డ్రైవింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ఎదురయ్యే ప్రమాదాల గురించి సమాజంలో అవగాహన పెరగాలన్నారు. రవాణా, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలను అమలు చేయడంలో అన్ని శాఖల బాధ్యత ఉంటుందని, రోడ్లకు ఇరువైపులా రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మున్సిపల్ శాఖ పోలీస్‌శాఖకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, అదనపు డీసీపీ సలీమా, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్, ట్రాన్స్‌పోర్ట్, ఆర్‌అండ్‌బీ, పోలీస్‌శాఖతో పాటు సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో కదలిక
ప్లాట్‌ఫారాలపై కవర్ షెడ్ల ఏర్పాటు
వరంగల్‌లో మోడల్ ఇంజన్‌కు రంగులు
అమృత్ భారత్ పథకం పనుల్లో వేగం
6

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



డ్రెయినేజీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని పరిష్కరించి తీరుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే గుంతలమైన కడిపికొండ ఆర్వోబీని, 63వ డివిజన్‌లో మెయిన్‌రోడ్‌లో మరమ్మతులకు గురైన డ్రైనేజీని ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్వోబీపై గుంతలు ఏర్పడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే విధంగా ప్రధాన రోడ్డులో డ్రైనేజీ నిర్మాణం విస్తరించకపోవడంతో స్థానికంగా ప్రజలకు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించామని, తక్షణమే పరిష్కరిస్తామన్నారు.

ఎమ్మెల్యే వెంట 63వ డివిజన్ కార్పొరేటర్ విజయ శ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, నాయకులు ఎం.డి. అంకూస్, ఎస్కే అజ్గర్, సిరిల్ లారెన్స్, సిలువేరు విజయ్ భాస్కర్, ఇప్ప శ్రీకాంత్, తమ్మడి మానస మధు, బి.శ్రీనివాస్, తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు వస్త్రాలను అందజేస్తున్న కునూరు వాసులు

మల్లన్న స్వామికి ఘనంగా సంప్రోక్షణ
పట్టువస్త్రాలు సమర్పించిన కూనూరు వాసులు
7



వీరభద్రస్వామి ఆలయంలో భక్తుల సందడి

కొత్తకొండలో కొనసాగుతున్న భక్తుల రద్దీ
గుమ్మడికాయ, కోడెలతో భక్తుల మొక్కులు
7

రాహుల్.. రాష్ట్రాన్ని నాకు అప్పగిస్తే.. దేశాన్ని మీకు అప్పగిస్తా..

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేఏ పాల్

బాలసముద్రం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రాష్ట్రాన్ని నాకు అప్పగిస్తే.. దేశాన్ని మీకు అప్పగిస్తా' అంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఓ ఆఫర్ ఇచ్చారు. గురువారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని తాను ఏనాడో చెప్పానని, తెలంగాణ కంటే తక్కువ జనాభా ఉన్న పలు దేశాలు అభివృద్ధిలో ఎంతో ముందున్నాయన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ను మూడు ముక్కలు చేసి రాష్ట్రాన్ని కైవసం చేసుకోవాలని ప్రధాని మోదీ చూస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌లో పది దాకా గ్రూపులు న్నాయని, తాను బీసీనని, దళిత మహిళను వివాహం చేసుకున్నా నని, బీసీగా తనను ముఖ్యమంత్రిగా గెలిపిస్తే విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఇద్దరో ముగ్గురో డిప్యూటీ సీఎంలను పెట్టి వారు పనిచేయకుంటే కొరడాతో కొడతానన్నారు. తనకున్న సంబంధాలతో ప్రపంచ బ్యాంకు నుంచి ఇతర విదేశీ సంస్థల నుంచి నిధులు తీసుకొచ్చి కంపెనీలు ఏర్పాటు చేసి నిరుద్యోగాన్ని రూపుమాపుతానన్నారు.

బీసీల్లో ఐక్యత లేక భూ కబ్జాలకు, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న నాయకులను బుద్ధి లేని జనాలు ఓట్లు వేసి గెలిపిస్తున్నారని కేఏ పాల్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ సుమారు రూ.7లక్షల కోట్ల అప్పులు చేసి ఆయన కుటుంబ సభ్యులు కోట్లకు పడగలెత్తితే, సీఎం రేవంత్‌రెడ్డి సంవత్సర కాలంలోనే రూ.లక్షా 30 వేల కోట్ల అప్పులు చేశారని అన్నారు. బీఆర్ఎస్ దొరల పార్టీ, దొంగల పార్టీ కుటుంబ సభ్యులే రాష్ట్రాన్ని నడిపారని, గొంతెత్తి మాట్లాడితే ప్రజలు నమ్మి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చారని అన్నారు. బుద్ధి ఉన్న వ్యక్తులెవరూ కేసీఆర్, కాంగ్రెస్ వైపు చూడొద్దని కోరారు.

ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి పాలన చూసిన ప్రజలు మళ్లీ కేసీఆర్ వస్తేనే మంచిదని అనుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం తాను ఎంతో కసిగా ఉన్నానని రాష్ట్రంలో తనను అధికారంలోకి తీసుకొస్తే 60 లక్షల మంది నిరుద్యోగులకు రెండేళ్లలో ఉద్యోగాలు ఇస్తానని కేఏ పాల్ హామీ ఇచ్చారు. ఇక వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ తరపున సర్పంచ్‌లుగా పోటీ చేసి గెలిస్తే.. సంవత్సరానికి రూ.కోటితో ఆ గ్రామాలను అభివృద్ధి చేస్తానని, ఆ సర్పంచ్‌లకు నెలకు రూ.30వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తానన్నారు.

గతంలో తాను ఎన్నికల్లో పోటీ చేయగా ఎన్నికలప్పుడే వస్తాడని ఓడించారని, 2018 నుంచి తాను తెలుగు రాష్ట్రాల్లోనే ఉంటున్నానని, నాడు పార్టీ పునాదులు లేక గెలవలేదని ఇప్పుడు పునాదులు వేస్తున్నానన్నారు. స్థిర చిత్తంతో తనను తాను నమ్ముకుంటూ ప్రజలను నమ్ముతున్నానన్నారు.

ఐదు శాతం ఉన్న రెడ్లు సగానికి పైగా ఉన్న బీసీలను అణగదొక్కుతున్నారని బీసీలు తమ ఓటును తమకే వేసు కోవాలన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లను నిలబెట్టి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవాలనే ఆలోచనతో ఉన్నానని కేఏ పాల్ అన్నారు. సర్పంచ్‌లుగా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీల మద్దతుతో పోటీ చేయకుండా ఇండిపెండెంట్‌గా నిలబడకుండా ప్రజాశాంతి పార్టీ పక్షాన పోటీ చేయాలని కేఏ పాల్ విజ్ఞప్తి చేశారు.

పండుగ పూట దొంగాట!



పల్లెల్లో చొరబడ్డ దొంగలు

- మామునూరు, పరకాల పోలీస్ డివిజన్‌ల్లో చోరీలు
- ఆభరణాలు, లక్షల్లో నగదు దోపిడీ
- కరువైన పోలీసుల ముందుస్తు చర్యలు

వరంగల్ క్రైం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం పట్టణాలపై దృష్టిసారించే దొంగలు.. ఈ సారి పల్లెలపై పడ్డారు. సాధారణంగా పండుగల సమయాన పట్టణాల్లో చోరీలు జరుగుతుండేవి. కానీ ఈ సారి చోరులు రూటు మార్చారు. గ్రామాల్లో దొంగతనాలు చేశారు. పెద్దఎత్తున నగలు, నగదు దోచుకెళ్లారు. అయితే ఇది ఇతర రాష్ట్రాల దొంగల పనిగా పోలీసులు భావిస్తున్నారు. నిందితులను పట్టుకునే పనిలో ఉన్నారు.

పండుగ వేళ..

పండుగలు ఉన్న సమయంలో పట్టణాల్లో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తారు. గ్రామాలకు వెళితే పోలీసు స్టేషన్‌లో చెప్పాలని, విలువైన వస్తువులను తీసుకెళ్లాలని, ఇంటి ఆవరణలో సీసీ కెమెరా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తారు. అలాగే రాత్రి వేళ గస్తీ కాస్తారు. ఈ సారి కూడా పోలీసులు నగర ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రధానంగా హనుమకొండ డివిజన్‌లో ఏసీపీ దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీల్లో మైకులు పట్టుకొని తిరుగుతూ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ చోరీలపై ప్రజలను అప్రమత్తం చేశారు. అయితే పల్లెల్లోకి వచ్చేసరికి పోలీసులు అప్రమత్తం కాలేకపోయారు. పండుగల సమయాన జరిగే చోరీలను అడ్డుకునేందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో మామునూరు, పరకాల పోలీసు డివిజన్‌లోని గీసుగొండ, దామెర, ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో గుర్తుతెలియని వ్యక్తులు పలు ఇళ్లలో పడి సుమారు 23 తులాల బంగారు ఆభరణాలు, 76 తులాల వెండి ఆభరణాలు, రూ.1,86,000 పై చిలుకు నగదు లూటీ చేశారు. ఈ రెండు పోలీసు డివిజన్‌ల పరిధిలో పరిశ్రమలు, ఇతర వ్యాపారాలు జరుగుతుంటాయి. అంతరాష్ట్ర వ్యక్తులు ఈప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తుండటంతో అంతరాష్ట్ర వ్యక్తులే పనే అయిఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

మామునూరు, పరకాల డివిజన్‌లే టార్గెట్

మామునూరు, పరకాల పోలీసు డివిజన్‌లోని గ్రామాలనే దొంగలు టార్గెట్ చేసుకొని హల్‌చల్ చేశారు. గీసుగొండ, ఏనుమాముల, దామెర పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలను ఎంచుకొని ఊడ్చేశారు. గీసుగొండ పీఎస్ పరిధిలోని గొర్రెకుంట శివారులోని అపర్ణకాలనీలో మిట్టపల్లి సాంబయ్య కుటుంబసభ్యులతో కలిసి ఊరికివెళ్లగా 14న గుర్తుతెలియని వ్యక్తులు 35 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. బొడ్డు చింతలపల్లి గ్రామంలో గుండె రవి శుభకార్యానికి వెళ్లగా ఇంటి తాళాలు పగులగొట్టి 54 గ్రాముల బంగారు ఆభరణాలు, 23 తులాల వెండి, రూ.31వేల నగదు చోరీ చేశారు. దామెరలోని మాదారపు విజయ ఇంట్లో 7తులాల బంగారు ఆభరణాలతో పాటు 13 తులాల పట్టా గొలుసులను చోరీ చేశారు. ఒగ్లాపూర్ లోని జ్ఞానేశ్వర్‌రావు ఇంట్లో బీరువా పగల గొట్టి లక్ష నగదుతో పాటు 15 తులాల వెండి ఆభరణాలు దొంగలించా రు. ముస్త్యాలపల్లిలో 50 తులాల నగదుతో పాటు రెండు తులాల నెక్లెస్‌ను దొంగలించా రు, ఏనుమాముల పీఎస్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మద్దూరు వినోద ఇంటి తాళాలు పగల గొట్టి 4.5 తులాల బంగారు ఆభరణాలతో పాటు 25 తులాల వెండిఆభరణాలతో పాటు 5,500 నగదు దోచుకె ళ్లారు. మరిన్ని ఇళ్ల తాళాలు పగలగొట్టి సామాన్లను చిందరవందర చేశారు.

కానరాని పెట్రోలింగ్

పోలీసుల పెట్రోలింగ్ కేవలం నగరాలకు మాత్రమే పరిమితమైనట్లుగా కనిపిస్తోంది. గ్రామాల్లోకి వచ్చేసరికి నెలరోజుల్లో ఒక్క రోజైనా పోలీస్ సిబ్బంది రాత్రి పెట్రోలింగ్ చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. శివార్లలోని ఠాణా అధికారులు పట్టణాల్లో నివాసముంటూ విధులకు రాకపోకలు సాగిస్తుండటంతో ఠాణా పరిధిలో సమస్యలపై దృష్టిసారించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో దొంగలు పల్లెలపై పడి అందినకాడికి దోచుకొని బయటపడ్డారు. ఒక్కటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పది చోట్ల వరుసగా ఒకే రోజు చోరీలు చేసి పోలీసులకు సవాల్ విసిరారు. ఇతర రాష్ట్రాల వ్యక్తులు చేసిన పనిగా భావిస్తున్న పోలీసులు.. నగర శివార్లలో ఉన్న వివిధ పరిశ్రమలు, ఇటుకబట్టీలు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న అంతరాష్ట్ర వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.



ఎంపికైన క్రీడాకారులతో స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకయ్య, కోచ్ మట్టెడ కుమార్ తదితరులు

కేయూ సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ పురుషుల క్రికెట్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జనవరి 16 నుంచి 21 వరకు చెన్నైలోని మద్రాస్ యూనివర్సిటీలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ క్రీడలకు కేయూ పురుషుల క్రికెట్ జట్టును 2024-25 ఏడాదికి గురువారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో బి.విశాల్ యాదవ్, బి.వరుణ్ (వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, హనుమకొండ), షేక్ అజార్ (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల, ఖమ్మం) జి.హరిప్రసాద్, (వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, హనుమకొండ), కె.రోహిత్‌రెడ్డి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి). ఆర్.శ్రీచరణ్ (జేఆర్‌బీ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), బి.కిరణ్ (ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూ క్యాంపస్), మహ్మద్ ఇబ్రహీం(కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), బి.సచిన్ (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఖమ్మం), షేక్ సమీర్ పాషా(వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల, హనుమకొండ), అంగోత్ విడిన్ (కేఎండీసీ కళాశాల, ఖమ్మం) బి సంతోష్,(ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల, ఖమ్మం), కె.నిఖిల్ (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), మహ్మద్ పర్హాన్ (మాస్టర్జీ డిగ్రీ కళాశాల, హనుమకొండ)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా హనుమకొండ భీమారంలోని కేశవ డిగ్రీ కళాశాల, ఫిజికల్ డైరెక్టర్ మట్టెడ. కుమారస్వామి, (కుమార్)వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య అభినందించారు.

కామర్స్‌లో రామకృష్ణకు డాక్టరేట్



రామకృష్ణ

కేయూ క్యాంపస్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం పరిశోధకుడు రామగిరి రామకృష్ణ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్‌కు రామకృష్ణ డాక్టరేట్ ప్రకటించారు. రామకృష్ణ 'రిటైల్ ఇన్వెస్టర్స్ బిహేవియర్ టువర్డ్సు ఈక్విటీ అన్వెస్ట్‌మెం ట్ ఇన్ స్టాక్ మార్కెట్ - ఏ స్టడీ ఆఫ్ నార్తన్ తెలంగాణ రీజియన్' అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రకటించారు. కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వర లక్ష్మి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ గవర్నమెంట్ ఆర్ట్స్ అండ్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా రామకృష్ణ పనిచేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన రామకృష్ణను పలువురు అభినందించారు.

జువాలజీ విభాగంలో రెండు రోజుల జాతీయ సదస్సు



సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 24, 25 తేదీల్లో కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం నేతృత్వంలో నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సు గోడపత్రికను వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. కేయూ పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రతాప్‌రెడ్డితో పాటు సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు సదస్సు వివరాలను వెల్లడించారు. 'ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ఇన్ యానిమల్ బయో టెక్నాలజీ అండ్ ఇమ్మ్యూనోలజీ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ తదితరులు పాల్గొన్నారు.

డీఅడిక్షన్ సెంటర్‌లో మెడికల్ కౌన్సిల్ తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య

వరంగల్ మెడికల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యసన నియంత్రణ కేంద్రం, డీఅడిక్షన్ సెంటర్‌పై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా టీజీఎంసీ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ నరేశ్‌కుమార్ మాట్లాడుతూ.. వైద్యపరంగా ఎలాంటి విద్యార్హత లేకున్నా పి.రాము అనే వ్యక్తి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అనే నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్ నెలకొల్పి అదే పేరుమీద డీఅడిక్షన్ సెంటర్ సర్క్యూట్ హౌస్ రోడ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఅడిక్షన్ సెంటర్‌కు వచ్చే రోగులకు ఎలాంటి సైకియాట్రిక్ట్ సలహా లేకుండా మందులు ఇస్తూ, వాటిని చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచి, దుర్వినియోగం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నకిలీ వైద్యుడు రాముపై ఎన్ఎంసీ చట్టం 34, 54 ప్రకారం కేసు నమోదు చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ తనిఖీలో టీజీఎంసీ అధికారులతోపాటు వరంగల్ సైకియాట్రీ సొసైటీ సభ్యులు డాక్టర్ మన్మోహన్‌రాజు, డాక్టర్ శ్రీధర్‌రాజు, డాక్టర్ జగదీష్‌బాబు, డాక్టర్ రాజేష్, డాక్టర్ ధర్మ జ్యోతి, డాక్టర్ నవ్య, డాక్టర్ దివిజ, డాక్టర్ షీతల్ పాల్గొన్నారు.

పరిశీలించిన డీఎంహెచ్‌వో

హనుమకొండలోని హెల్పింగ్ హ్యాండ్స్ వ్యసన నియంత్రణ కేంద్రం, డీఅడిక్షన్ సెంటర్‌ను హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య తన బృందంతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖ రిజిస్ట్రేషన్ నిబంధనలకు విరుద్ధంగా సంస్థను నడిపిస్తున్నారని, ఆల్కహాల్ బాధితులకు తగినట్లుగా వసతులు కల్పించలేదని తెలిపారు. రిజిస్ట్రేషన్‌లో చూపిన విధంగా రెసిడెంట్ డాక్టర్ లేకపోవడంలాంటి ఉల్లంఘనలను గమనించి షోకాజ్ నోటీసు ఇచ్చి మూడు రోజుల్లో సంబంధిత ధృవపత్రాలతో సమాధానం ఇవ్వాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు.



సుందరీకరణలో భాగంగా పాత ఇంజన్‌కు రంగులు వేస్తున్న దృశ్యం

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల్లో కదలిక

- ప్లాట్‌ఫారాలపై కవర్ షెడ్ల ఏర్పాటు
- మోడల్ ఇంజన్‌కు రంగులు
- వేగం పుంజుకున్న అమృత్ భారత్ పథకం పనులు

గిర్మాజిపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ రైల్వేస్టేషన్‌లో అభివృద్ధి పనులు ఆలస్యంగా సాగుతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభించారు. వివరాల్లోకి వెళితే.. వరంగల్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల కోసం అమృత్ భారత్ పథకం కింద కేంద్రం రు.25.41 కోట్లు కేటాయించింది. సుమారు పది నెలల కిందట ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా పనులు ప్రారంభించారు. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు నత్తనడకన సాగుతున్నాయి. మరోవైపు ప్లాట్‌ఫారాలపై కవర్ షెడ్‌లు లేక ప్రయాణికులు ఎండకు, వానకు ఇబ్బందిపడుతున్నారు. ఈ సమస్యపై గత డిసెంబర్ 26న 'అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రయాణికులు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయం డీఆర్ఎం దృష్టికి పోవడంతో వెంటనే ఆయన స్థానిక ఐఓడబ్లు అధికారితో పాటు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్లాట్‌ఫారాలపై కవర్ షెడ్‌లు లేకపోవడం, సుందరీకరణ పనులు ఆగిపోవడం, మోడల్ ఇంజన్‌కు రంగులు వేయకపోవడం, నీరు లేక మొక్కలు ఎండిపోవడం తదితర పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో పనుల్లో వేగం పుంజుకుంది. ఇప్పటికే 3 ప్లాట్‌ఫారాలపై కవర్‌షెడ్‌లు ఏర్పాటు చేశారు. మోడల్ ఇంజన్‌కు రంగులు వేస్తున్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలు నాటేందుకు చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఉన్నతశ్రేణి, మహిళా ప్రయాణికుల విశ్రాంతి మందిరాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి.

దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ ఉర్జా సురక్ష ఏవం ఉత్థాన్ మహాభియాన్ (పీఎం కుసుమ్) పథకం ద్వారా సోలార్ పవర్ ప్లాంట్స్ ఏర్పాటు చేసుకునేందుకు పోడు భూముల హక్కు పత్రం కలిగిన గిరిజన రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల రైతులు ఈ నెల 19వ తేదీలోగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఇతర వివరాల కోసం 9652369090 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో వివిధ పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్స్, రైల్వే రిక్రూట్‌మెంట్‌బోర్డు, స్టాఫ్ సెలక్షన్ కమిటీ, బ్యాంకింగ్ వివిధ పోటీ పరీక్షలకు నాలుగు నెలల బేసిక్ ఫౌండేషన్ కోర్సులో అందించే ఉచిత శిక్షణను ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్సీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు 0870-2980533, 9550560175, 9398860995 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కేయూ ఇన్‌చార్జ్ ఆర్ట్స్ డీన్‌గా ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్



మనోహర్

కేయూ క్యాంపస్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ రెండు కీలకమైన పదవులకు నూతన ఇన్‌చార్జిలుగా ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, ప్రొఫెసర్ వల్లూరు రామచంద్రంలను నియామిస్తూ గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఆర్ట్స్ విభాగాల ఇన్‌చార్జి డీన్‌గా, సోషల్ విభాగాల డీన్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్‌ను, అలాగే కేయూ క్యాంపస్ కళాశాల ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపాల్, హెడ్‌గా దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలు నియామితులయ్యారు. ఈ మేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు వీరిద్దరినీ నియమించారు. ఆర్ట్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి మరణంతో ఖాళీ ఏర్పడింది.

నిరుపేద మహిళకు సరుకుల అందజేత



సరుకులను అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

కరీమాబాద్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): భర్తను కోల్పోయి ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వితంతు మహిళకు సనాతన హిందూ సేవాసమితి వారు గురువారం నిత్యావసర సరుకులను అందజేశారు. ములుగు జిల్లా మంగపేట మండలకేంద్రానికి చెందిన గుమ్మల లలిత అనే వివాహిత భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలను పోషించేందుకు ఇబ్బందిపడుతుండగా విషయం తెలుసుకున్న సనాతన హిందూ సేవా సమితి సోషల్ మీడియా గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం మంగపేటకు వెళ్లి ఆమెకు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకుడు తాళ్లపెల్లి నగేష్, గ్రూప్ సభ్యుడు చరణ్ పాల్గొన్నారు.

మిల్స్‌కాలనీ ఎస్సైకి తప్పిన ప్రమాదం

కరీమాబాద్, జనవరి16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్‌కు పెను ప్రమాదం తప్పింది. గురువారం ఉదయం ఆయన కొత్తకొండ వీరభద్రస్వామి దర్శనం కోసం కారులో వెళుతుండగా కొత్తపల్లి శివారులో టిప్పర్ లారీలను తప్పించే క్రమంలో అదుపుతప్పి కారు పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎస్సై స్వల్ప గాయాలతో బయట పడినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.



జఫర్‌గఢ్‌లో అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో మాధురి కిరణ్‌చంద్ర షా

అర్హులకు పథకాలు అందేలా చూడాలి

- జడ్పీ సీఈవో మాధురి కిరణ్‌చంద్ర షా
- గ్రామాల్లో అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన

జఫర్‌గఢ్, జనవరి 16(ఆంధ్రజ్యోతి) : అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని జనగామ జడ్పీ సీఈవో మాధురి కిరణ్‌చంద్రషా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం జఫర్‌గఢ్‌లో రేషన్ కార్డులు, ఇందిరమ్మ సర్వే, తదితర అంశాలపై పరిశీలన జరిపారు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న మండల కేంద్రంలోని ఓ మహిళ ఇంటికి వెళ్లి క్షేత్ర స్థాయిలో ఆర్థిక స్థితిగతులపై ఆరా తీశారు. అనంతరం జడ్పీ సీఈవో మాధురి కిరణ్‌చంద్ర షా స్థానిక గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులచే పథకాలపై సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. మండల కేంద్రంలో ఇందిరమ్మ సర్వేను వంద శాతం పూర్తిచేయాలని ఆదేశించారు. మండలానికి మంజూరైన 765 రేషన్ కార్డుల పంపిణీపై సమగ్ర పరిశీలన జరపాలన్నారు. ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పథకాల లబ్ధిదారుల ఎంపికైన అధికారులు, ఉద్యోగ సిబ్బంది ఆయా గ్రామాల్లో సమగ్రంగా పరిశీలన జరపాలన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామాల్లో నిర్వహించే గ్రామసభలను సక్సెస్ చేసేందుకు కార్యాచరణ రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో స్టేషన్‌ఘన్ పూర్ ఆర్డీవో వెంకన్న నాయక్, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రాధాకిషన్, ఎంపీడీఓ సుమన్, తహ సీల్దార్ శంకరయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు. కాగా, ఆర్డీఓ వెంకన్న నాయక్ గురువారం అధికారులతో కలిసి మండలంలోని ఉప్పు గల్లు, కూనూరు, జఫర్‌గఢ్, అలియాబాద్ రెవెన్యూ గ్రామాల్లో పర్యటించి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా పథకాలతో పాటు. వ్యవసాయ యోగ్యం కాని భూములను ఆయన పరిశీలించారు.

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

మామునూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మామునూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం శనివారం ఉదయం 11.30 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 28 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని, మహబూబాబాద్ జిల్లాలో 5 కేంద్రాలు, ములుగులో 3, భూపాలపల్లిలో 1, సిద్దిపేటలో 1, హనుమకొండలో 5, వరంగల్‌లో 9, జనగామలో 4 కేంద్రాలలో పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్యాడ్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్ తెచ్చుకోవాలని, పరీక్ష కేంద్రానికి శనివారం ఉదయం 10.30 గంటలకు చేరుకోవాలని, వాచ్, కాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకుని రావొద్దని సూచించారు.

మార్గదర్శకాల ప్రకారం సర్వే నిర్వహించాలి

జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా



నీర్మాలలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌భాషా

దేవరుప్పుల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందేలా క్షేత్ర స్థాయిలో అన్ని శాఖల అధికారులు పనిచేస్తున్నారని జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా అన్నారు. దేవరుప్పుల మండలంలోని నీర్మాలలో గురువారం నేటి నుంచి నిర్వహిస్తున్న నాలుగు సంక్షేమ పథకాల సర్వే ప్రక్రియను ఆయన సందర్శించి పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటింటికి వెళ్లి సర్వే తీరును పరిశీలిస్తూ ఇంట్లో సభ్యులతో మాట్లాడారు. ఇంట్లో ఎంత మంది ఉంటారు? ఏం జీవనం సాగిస్తుంటారు? పొలం ఉందా? ఎన్ని ఎకరాలు ఉంది? వంటి తదితర వివరాలను సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల పథకాలకు ప్రజలు దరఖాస్తు చేసుకోగా అట్టి దరఖాస్తులను ప్రభుత్వం తెలిపిన మార్గ దర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే చేసి లబ్ధిదారులను గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. మొదటి విడతలో నిరుపేదలకు ప్రాధాన్యం ఉంటుందని అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. రేషన్ కార్డులకోసం పట్టణ ప్రాంతాల్లో రూ. 2 లక్షల వార్షిక ఆదాయం, గ్రామీణ ప్రాంతాల్లో రూ. అక్షన్నర ఆదాయం కలిగి ఉండాలన్నారు. అదే విధంగా మూడున్నర ఎకరాల తడి, ఏడున్నర ఎకరాల ఖుష్కి లోపు భూమి ఉన్నవారు అర్హులని ఆయన వివరించారు. అంతే కాకుండా సర్వే ప్రక్రియ ఈ నెల 20వరకు కొనసాగుతుందని, కుటుంబాల సమగ్ర వివరాలను తెలుసుకొని ఆయా పత్రాలను పరిశీలించి ఫార్మ్‌లో నమోదు చేయాలని, పరక్రియ సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో వసంత, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో సురేష్ కుమార్, ఆర్ఐలు, ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న భద్రకాళి శేషు, ప్రొఫెసర్ తిరుపతయ్య

రేపు సద్గురు శ్రీత్యాగరాజ స్వామి ఆరాధన సంగీతోత్సవం

నిర్వాహక కమిటీ ప్రతినిధి భద్రకాళి శేషు

వడ్డెపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యారణ్య ఆర్షధర్మ రక్షణ సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో సద్గురు శ్రీత్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవం శనివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్ సమీపంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ ప్రతినిధులు భద్రకాళి శేషు, ప్రొఫెసర్ వి.తిరుపతయ్య తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, విశిష్ట అతిథులుగా కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, అజర హాస్పటల్ చైర్మన్ డాక్టర్ అప్పాల సుధాకర్ తదితరులు హాజరై ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు వరంగల్ భద్రకాళి దేవాలయం ఆర్చి వద్ద గల విద్యారణ్య స్వామి శిలా విగ్రహానికి పుష్ప మాలాలంకరణ జరుగుతుందని చెప్పారు. అనంతరం ఉదయం 9 గంటలకు జ్యోతి ప్రజ్వలన చేసి సంగీత కళాకారులతో త్యాగరాజ కీర్తనల కృతుల గానం, వీణావాదన, స్థానిక సంగీత, నృత్య సంస్థలకళాకారులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగీత కళాకారులు తరలివచ్చి తమ గానామృతాన్ని వినిపిస్తారని సంగీతప్రియులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఈ సమావేశంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఉమ్మడి లక్ష్మణాచారి, సూత్రపు అభిషేక్, వెలగందుల భాస్కర్, జీయా ఉద్దీన్, కోలా పశుపతి, పి.నీరజ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడి రాక

వరంగల్ కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల పరిరక్షణ కోసం నియమించిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ శుక్రవారం వరంగల్ నగరానికి వస్తున్నారు. ఎస్సీలకు కల్పించిన హక్కులు, రక్షణ అమలు, బాధిత కుటుంబాలకు చెల్లించే బకాయిలపై వరంగల్ కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6250	5600
పల్లికాయ (పచ్చిది)	4950	4100
కందులు	7033	5560
పెసళ్లు	-	-
పత్తి	7210	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14800	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	13000	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్ 341 కొత్తది	15000	11500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



ఐనవోలు ఆలయం ప్రాంగణంలో ప్రోక్షణ చేస్తున్న అర్చకులు, ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావులు

మల్లన్న స్వామికి ఘనంగా సంప్రోక్షణ

పట్టువస్త్రాలు సమర్పించిన కూనూరు వాసులు

ఐనవోలు, జనవరి16 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతరను పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులతో పూజలందుకున్న స్వామి వారికి గురువారం వైభవంగా మహాసంప్రోక్షణ క్రతువును నిర్వహించారు. పుణ్యాహవాచనములో భాగంగా వేదపండితులు, అర్చకులు స్వచ్ఛమైన జలము సుగంధ ద్రవ్యాలు నవధాన్యాలు కలుషంలో మిలితం చేసి మంత్ర పఠనం చేస్తూ స్వామి వారిని అవాహన చేశారు. తదుపరి ఆలయంతోపాటు ప్రాంగణములో వేద మంత్రోత్సరణలతో ప్రోక్షణ (చల్లడం) జరిపారు. మహాన్యాస పూర్వక శత రుద్రాభిషేకములు చేసి శివలింగాన్ని స్వామి వారి ప్రతిబింబముతో అలంకరించి అన్నపూజ నిర్వహించి మంత్రపుష్ప తీర్థప్రసాద వితరణ గావించారు. అనంతరం ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు బ్రాహ్మణులకు పండిత సన్మానాలూ సమారాధన జరిపారు. సంప్రోక్షణ అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తంశర్మ, అర్చకులు భానుప్రసాద్, ఉప్పల శ్రీనివాస్, అర్చక సిబ్బంది పూజల్లో పాల్గొన్నారు.

కునూరు వాసుల పట్టువస్త్రాలు

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం కునూరు గ్రామ ప్రజలు, గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామికి పట్టువస్త్రాలు బహూకరించారు. జాతరలో లక్షలాది మంది భక్తులచే పూజలు అందుకున్న స్వామి వారికి మహాసంప్రోక్షణ క్రతువును నిర్వహించాక స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు అందజేయడం అనవాయితీగా కొనసాగుతోంది. ఈ పట్టు వస్త్రాలను కునూరు ఉమామహేశ్వరం(శివాలయం) దేవాలయం, గ్రామ పంచాయతీలు ఆరేళ్లుగా అందజేస్తున్నాయి. మల్లికార్జునస్వామి, గొల్లకేతమ్మ, బలిజ మేడమ్మ, భ్రమరాంబదేవిక గణపతి అంజనేయస్వామిలకు పట్టువస్త్రాలను సమర్పించాక స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకుడు సదాశివశర్మ, బ్రహ్మణపల్లి మధుశర్మ గ్రామ పురప్రముఖులు పాల్గొన్నారు.



వీరభద్రస్వామికి కోడె మొక్కులు చెల్లిస్తున్న ఎల్కతుర్తి సీఐ పులి రమేష్

కొత్తకొండలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

భీమదేవరపల్లి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామి సన్నిధికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఆలయ ఈవో కిషన్‌రావుల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామికి ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ గురువారం కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి గుమ్మడికాయ, కోడె మొక్కులను చెల్లించారు.

యువ

ఆసక్తే ఆవిష్కరణలకు ప్రేరణ

పదికిపైగా పరికరాలను రూపొందించిన యువశాస్త్రవేత్త సంతోష్ కుమార్

వాటిలో సైన్యానికి ఉపయోగపడేవే ఎక్కువ



తాను రూపొందించిన వాయిస్ టెలిస్కోప్‌తో యువ శాస్త్రవేత్త డాక్టర్ శీలం సంతోష్ కుమార్

హనుమకొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : సరికొత్త సాంకేతిక పరికరాలను రూపొందించాలంటే ఆసక్తి, పరిశోధనలపై అనురక్తి.. శాస్త్ర, సాంకేతిక ఫలాలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న తపన ఉండాలి. ఇందుకు నిశిత దృష్టి, లోతైన అధ్యయనమూ ఎంతో అవసరం. ఇవన్నీ పుష్కలంగా ఉన్న యువశాస్త్రవేత్త డాక్టర్ శీలం సంతోష్ కుమార్.. అతి తక్కువ కాలంలోనే పదికిపైగా సరికొత్త పరికరాలకు రూపకల్పన చేశారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేటకు చెందిన సంతోష్‌కుమార్ ప్రస్తుతం నర్సంపేటలోని బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లోని రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం అధిపతిగా పని చేస్తున్నారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన ఆయన వరంగల్ పాలిటెక్నిక్ కంప్యూటర్ సైన్స్‌లో డిప్లమా చేసిన తర్వాత విద్యాజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో బీటెక్, శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీలో ఎంటెక్, గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. బాల్యం నుంచి కొత్త వస్తువులు తయారు చేయడమంటే ఎంతో ఆసక్తి ఉన్న ఆయన పాఠశాల స్థాయిలో చాలా సైన్స్ ఎగ్జిబిట్లు చేసి ప్రదర్శనకు పెట్టి.. ఎన్నో ప్రైజ్‌లు కూడా దక్కించుకున్నారు. ఎంటెక్, పీహెచ్‌డీ పూర్తయిన తర్వాత సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలపై మరింత దృష్టి పెట్టారు.

అటానమస్ రోబో

సైనికులకు ఎంతో ఉపయోగంగా ఉండే ఒక రోబోకు కూడా రూపకల్పన చేశారు సంతోష్‌కుమార్. ఈ రోబో సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం, శత్రువుల సమాచారం నమోదు చేయడం, వారిని కట్టడి చేయడం, గాయపడిన సైనికులను గుర్తించి యుద్ధం నుంచి సురక్షిత ప్రాంతానికి చేరవేయడానికి ప్రత్యేకంగా తయారు చేసిన వాహనాన్ని నడపడం లాంటి పనులు ఈ రోబో చేస్తుందని ఆయన వివరించారు. మొదటి దశ ప్రయోగం పూర్తయిందని, ప్రస్తుతం 50శాతం పనులు ఈ రోబో చేయగలుగుతోందని, దీనిని తయారు చేయడానికి ఇప్పటి వరకు రూ.50లక్షలు ఖర్చయిందని తెలిపారు.

సోలార్ పీసీ..

తాను రూపొందించిన పరికరాల్లో సోలార్ కంప్యూటర్‌కు కేవలం మానిటర్ ఉంటుందని, 12 వోల్టుల సోలార్ ప్యానెల్ జతచేయడం ద్వారా అడవిలో కూడా పనిచేస్తుందన్నారు. దీని తయారీ వ్యయం రూ.15వేలని, పేద విద్యార్థుల కోసం అన్ని ప్రోగ్రామింగ్ లాంగ్వేజులు, ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌లు అన్ని ఇందులో పొందుపరిచానని, 38 ఆపరేటింగ్ సిస్టమ్‌లు ఇందులో రన్ అవుతాయని, బ్లూటూత్, వైఫై ఇన్‌బిల్ట్‌గా ఉంటాయని, మానిటర్, మౌజ్, కీబోర్డు మాత్రమే బయట ఉంటాయన్నారు. ఒక సారి రీచార్జ్ చేస్తే కరెంట్ లేకుండా కూడా చాలా సేపు వాడుకోవచ్చని, ఈ రోజుల్లో స్మార్ట్ ఫోన్ ధర రూ. 25వేల నుంచి రూ 30వేలు ఉందని, ఒక కంప్యూటర్ కొనాలంటే రూ.50వేలకు పైనే అవుతుందని, పేద విద్యార్థుల కోసం తక్కువ ఖర్చుతో దీనిని తయారు చేశానన్నారు.

విదేశాల్లో పరిశోధనలు.. దక్కిన అవార్డులు..

తక్కువ ఖర్చుతో తయారు చేసిన పీసీకి మంచి స్పందన వచ్చిందని, దీనిపైనే విదేశాల్లో పరిశోధనలు చేయడానికి అవకాశం లభించిందని, ఆఫ్రికాలో ఈ ప్రాజెక్టును అమలు చేయమని పిలుపు వచ్చిందని సంతోష్ కుమార్ వివరించారు. జర్మనీ, ఆఫ్రికా దేశాల్లో ఈ ప్రాజెక్టుపై పనిచేశానని, అక్కడ ఇళ్లపై అనుమానాస్పద స్థితిలో ఎగిరే డ్రోన్లను గుర్తించే ఆటోమెటిక్ డిఫెన్స్ డిటెక్టివ్ సిస్టమ్ రూపొందించానన్నారు. ఇతియోపియా యూనివర్సిటీలో రెండేళ్ల పాటు వివిధ పరిశోధనలు చేశానన్నారు. అయితే డాక్టర్ సంతోష్ పరిశోధనలకు గాను 2018లో మైసూర్ యూనివర్సిటీ యంగ్ సైంటిస్టు అవార్డును ప్రదానం చేసింది. మానవ రహిత చోదక వాహనం తయారీకి న్యూఢిల్లీ బీడీఎస్‌ఏ అంబేద్కర్ నేషనల్ ఫెల్లోషిప్ అవార్డు అందించింది. ప్రస్తుతం ఉద్యోగ రీత్యా నర్సంపేట పట్టణంలోనే ఉంటున్న డాక్టర్ సంతోష్ కుమార్ తండ్రి శీలం సత్యనారాయణ తండ్రి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. తల్లి సరస్వతి. డాక్టర్ సంతోష్‌కు భార్య శివరాణి, ఇద్దరు కుమారులున్నారు. ఒక పక్క కాలేజీలో విద్యాబోధన సాగిస్తూనే మరో పక్క పరిశోధనలను మరింతగా కొనసాగిస్తానంటున్నారు. తన ఆలోచనల్లో మరిన్ని కొత్త ఆవిష్కరణలు ఉన్నాయనీ, వాటికి భవిష్యత్తులో ఒక రూపాన్ని ఇస్తానని డాక్టర్ సంతోష్ అంటున్నారు.

డ్రైవర్ రహిత వాహనం



సంతోష్ రూపొందించిన మానవ రహిత వాహనం

సంతోష్ ఆవిష్కరణల్లో ముఖ్యమైంది డ్రైవర్ రహిత వాహనం. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే వాహనాన్నే ప్రయోగానికి వినియోగించి.. కృత్రిమ మేధతో ఒక సిస్టమ్‌ను ఈ వాహనంలో ఉపయోగించి డ్రైవర్ లేకుండానే నిర్దేశిత మార్గంలో సునాయాసంగా ప్రయాణించేలా రూపకల్పన చేశారు. మనిషి ప్రమేయం లేకుండా అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగే ఈ వాహనం సైనికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, సైనికులు సరిహద్దుల్లో కాపాలాలో భాగంగా ఒక చోటి నుంచి మరో చోటికి వేళ్లేప్పుడు బరువైన సామగ్రి, ఆయుధాలను మోసుకెళుతుంటారు. ఆ సమస్యను అధిగవించడానికి ఈ వాహనం ఎంతో ఉపయోగపడుతుంది. 2489 సీసీ ఇంజన్ గల ఈ వాహనం గేర్, క్లచ్, బ్రేక్‌లను తనకుతానే నియంత్రించుకుంటూ ఎప్పటికప్పుడు దిశను మార్చుకుంటూ ముందున్న వాహనాన్ని అనుసరించేలా డీప్‌లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను వాడుకొని ఈ వాహనాన్ని రూపొందించారు. ప్రస్తుతం ఈ వాహనం రూపకల్పన చివరి దశలో ఉండగా.. దీనిపై ఇప్పటి వరకు రూ.18లక్షల వరకు ఖర్చవగా.. అదంతా బాలాజీ ఇన్ స్టిట్యూట్ యాజమాన్యమే భరించింది. అలాగే ఈ మానవ రహిత వాహనంపై గుంటూరులోని నాగా ర్జున విశ్వవిద్యాలయం, మధ్యప్రదేశ్‌లోని మంగల్యా తన్ యూనివర్సిటీలో పరిశోధన జరుగుతోందని, వాటిని తానే కోఆర్డినేట్ చేస్తున్నానని సంతోష్ తెలిపారు. ఈ వాహనం తయారీపై కేంద్ర ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని, దీనిని మరింత ఆధునికీకరించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

వాయిస్ టెలిస్కోప్..

దూరంగా ఉండే వస్తువులను చూసేది సాధారణ టెలిస్కోప్. దీనికి భిన్నమైనదే వాయిస్ టెలిస్కోప్. అరకిలో మీటరు దూరంలో ఉన్న వ్యక్తులను చూడడమే కాదు.. వారు ఏం మాట్లాడుకుంటున్నది కూడా వినవచ్చు. ఇది కూడా సైనికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, 2017-18లో రూపొందించిన ఈ పరికరాన్ని వరంగల్ నిట్ ప్రొఫెసర్లు కూడా చూసి ప్రశంసించారని, ఒక అంతర్జాతీయ సదస్సులో ఈ పరికరంపై ప్రజంటేషన్ ఇచ్చినప్పుడు మంచి స్పందన వచ్చిందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించిన ఈ పరికరానికి పేటెంట్ లభించిందని, ఈ వాయిస్ టెలిస్కోప్‌ను మరింత ఆధునికీకరించేందుకు కృషి జరుగుతోందని, ఈ పరికరం తయారీకి రూ.4లక్షలు ఖర్చయిందని, ఈ పరికరాన్ని బల్క్‌గా ఉత్పత్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ కింద రూ.3.50లక్షల నిధులను ఇచ్చిందన్నారు.

దృశ్యాదృశ్యీకరణ ప్రయోగం

దృశ్యాదృశ్యీకరణ.. మన వేదాల్లో యంత్రసర్వస్వం గ్రంథం ఉందని, భరద్వాజ మహర్షి సంస్కృతంలో రాసిన ఈ గ్రంథం ఇంగ్లీష్‌లో అనువాదమైందని, దానిని చదివినప్పుడు దృశ్యాదృశ్యీకరణ తనను బాగా ఆకర్షించిందన్నారు. కొన్ని చెట్ల ఆకుల రసాన్ని తీసి దానికి కొన్ని రకాల రసాయనాలను జోడించి ఒక ఇమేజ్‌పై పోసినప్పుడు అది తెల్లగా మారి అదృశ్యమైపోతుందని, దీనిని చూడాలంటే ప్రత్యేక పరికరం కావాలని, ఆ పరికరాన్ని తాను తయారు చేశానని, దీన్నే వేదాల్లో దృశ్యాదృశ్యీకరణ (ఇన్‌విజుబులిటీ) ప్రక్రియగా పేర్కొంటారన్నారు. కొన్ని అంతర్జాతీయ సదస్సుల్లో ఈ ప్రయోగంపై డెమో ఇచ్చినప్పుడు ప్రశంసలు వచ్చాయని దీనిపై ఇంకా లోతుగా పరిశోధన చేయాల్సి ఉందన్నారు.

ప్రస్తుతం గూడ్స్ రైళ్లకు వినియోగిస్తున్న డబ్ల్యూఏజీ-09 ఎలక్ట్రిక్ లోకో మోటివ్



- సరుకు తరలింపులో కీలకం కానున్న డబ్ల్యూఏజీ-12 లోకో మోటివ్‌లు
- కొత్త ఇంజన్ల రాకతో పెరగనున్న గూడ్స్ రైళ్ల సగటు వేగం
- మేక్ ఇన్ ఇండియాలో భాగంగా బిహార్‌లో తయారీ చేపట్టిన రైల్వేశాఖ

గూడ్స్ రవాణాలో గేమ్‌చేంజర్!

డోర్నకల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం మన భారతీయ రైల్వేశాఖ సరుకు రవాణాకు వినియోగిస్తున్న గూడ్స్ రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపు కాగా, ఎక్స్‌ప్రెస్ రైళ్ల సగటు వేగం 50 నుంచి 52 కిలోమీటర్లు లోపు మాత్రమే ఉంది. ఈ విషయాన్ని గతేడాది రైల్వే శాఖమంత్రి లోక్‌సభలో వెల్లడించారు. ఇకపై పరిస్థితి మారనుంది. సాంకేతికంగా మరింత అభివృద్ధి చెందిన దేశాల్లోలా.. సరుకును మరింత వేగంగా గమ్యానికి చేర్చేలా అధునాతన డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌ల ను రైల్వేశాఖ రూపొందిస్తోంది. 12వేల హార్స్‌పవర్... గంటకు 120కిలోమీటర్ల వేగం.. 6వేల టన్నుల బరువును ఎత్తుమార్గంలో సైతం లాగేలా తయారు చేస్తున్న ఈ కొత్త ఇంజిన్లు గూడ్స్ రవాణా వ్యవస్థలో గేమ్‌చేంజర్‌గా నిలవనున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి మన దేశంలో 1980వ దశకం వరకు రైళ్ల ద్వారానే అత్యధికంగా సరుకు రవాణా జరిగేది. సరళీకరణ, ఆర్థిక విధానాల ప్రవేశపెట్టిన తరువాత పెద్దఎత్తున జాతీయ రహదారుల నిర్మాణ విస్తరణ చేపట్టారు. దీంతో రోడ్డు రవాణా రంగం పుంజుకుంది. ప్రస్తుతం మన రైల్వేశాఖ సరుకుల రవాణాకు డబ్ల్యూఏజీ-9 లోకోమోటివ్‌లను వినియోగిస్తుండగా.. ఎత్తుగా ఉన్న ప్రదేశాల్లోకి వేళ్లే సమయంలో ఇంజన్‌లు లోడును లాగలేక మొరాయిస్తున్న సంఘటనలున్నాయి. ఇలాంటి సమస్యలకు చెక్‌పెట్టేలా డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌లను తయారు చేస్తోంది. ఇప్పటికే పారిశ్రామీకరణ రోజురోజుకు విస్తరించిన నేపథ్యంలో పరిశ్రమలకు అవసరమైన ముడిపదార్థాలు, వాటితో తయారైన ఉత్పత్తులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలను, ఉత్పత్తులను పెద్దస్థాయిలో వేగంగా తక్కువ ఖర్చుతో తరలించడానికి గాను గూడ్స్‌రైళ్లను ఉపయోగిస్తున్నారు. దీంతో రైల్వేలో గూడ్స్ రైళ్ల రద్దీ రోజురోజుకు పెరిగిపోతుంది. అందుకు అనుగుణంగా రైల్వేలైన్ల నిర్మాణం మాత్రం ఆశించిన మేర పెరగలేదు. 70 శాతం బ్రిటిష్ హయంలో నిర్మించిన మార్గాల మీదుగానే రైళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. భారతీయ రైల్వేలో ప్రస్తుతం 68 వేల కిలోమీటర్ల పొడవు గల ట్రాక్ ఉండగా.. ఇందులో స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ హయాంలో సుమారు 54 వేల కిలోమీటర్ల మేర రైల్వేలైను నిర్మించగా.. స్వాతంత్ర్యం అనంతరం కేవలం 14వేల కిలోమీటర్ల కొత్త రైలు మార్గాన్ని మాత్రమే నిర్మించారు. ప్రయాణికుల రైళ్లు, గూడ్స్ రైళ్ల రాకపోకలతో రైల్వేట్రాక్‌లపై విపరీతమైన రద్దీ ఉంటుంది. ఉదాహరణకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ రైల్వే జంక్షన్ మీదుగానే సగటున ప్రతీ 12 నిమిషాలకు ఒక రైలు వెళ్తుంది.

గూడ్స్ రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపే..

రైల్వేశాఖలో గూడ్స్‌రైళ్ల సగటు వేగం 25 కిలోమీటర్ల లోపే ఉండడం గమనార్హం. ఇందుకు ప్రధాన కారణం రైళ్ల రద్దీనే కాకుండా ప్రస్తుతం ఉన్న రైల్వేట్రాక్‌లపై ఏదో ఒకరోజు నిర్వహణ పనులు కొనసాగుతుండడం, చాలాచోట్ల వందేళ్ల క్రితం అప్పటి ఇంజనీరింగ్ ప్రమాణాలతో నిర్మించిన వంతెనలు, కల్వర్టులు, వంపు మార్గాలు అధికంగా ఉండడం, సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలు, నిర్వహణ సిబ్బంది కొరత, రైలు ఇంజన్ల సామర్థ్యం తదితర కారణాలనిని చెప్పవచ్చు. ప్రస్తుతం విపరీతమైన ఆలస్యంతో నడుస్తున్నా.. రైళ్లవల్ల సరుకు, ప్రయాణికుల చేరవేతలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని రైల్వే చేరుకోలేకపోతోంది. భారతీయ రైల్వేలో మౌళిక వసతుల కల్పన మరియు నూతన రైల్వేనిర్మాణం కోసం గత కొద్ది సంవత్సరాలుగా కేంద్ర బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయిస్తున్నారు. అందులో భాగంగానే ఉత్తర, దక్షిణ భారతదేశాలను అనుసంధానిస్తున్న న్యూఢిల్లీ-చెన్నై (గ్రాండ్‌ట్రంక్) మార్గంలో మూడోరైల్వే ట్రాక్ నిర్మా ణాన్ని చేపట్టింది. ప్రస్తుతం మూడోలైన్ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ ట్రాక్ అందు బాటులోకి వస్తే సత్వరమే వేగంగా రైళ్లను.. ముఖ్యంగా గూడ్స్‌రైళ్ల వేగం పెంచేందుకూ కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగానే శక్తివంతమైన రైలు ఇంజన్‌లను దేశంలోనే తయారు చేస్తున్నారు.

ఇప్పటికే బొగ్గు తరలింపులో వినియోగం..

శక్తివంతమైన ఈ కొత్త లోకోమోటివ్‌లను రాష్ట్రంలో వినియోగిస్తున్నారు. ఇవి గతేడాది నవంబరులో పట్టాలెక్కాయి. డోర్నకల్-భద్రాచలంరోడ్, మణుగూరు, ఇల్లెందు మధ్య సింగరేణి బొగ్గును తరలించేందుకు డోర్నకల్ రైల్వేజంక్షన్ మీదుగా నడిచే గూడ్స్ రైళ్లకు ఈ అధునాతన బాహుబలి ఇంజన్లను రైల్వేశాఖ ఉపయోగిస్తోంది. ప్రస్తుతం వీటి పనితీరు మెరుగ్గా ఉండటంతో భవిష్యత్‌లో వీటిని మరిన్ని రైళ్లకు వినియోగించేలా చర్యలు చేపడుతోంది.

కీలకం కానున్న డబ్ల్యూఏజీ-12 ఇంజన్..

రైల్వేలో డబ్ల్యూఏజీ-12 లోకోమోటివ్‌లు.. రానున్న రోజుల్లో కీలకంగా మారనున్నాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఈ ఇంజన్‌లను బిహార్ రాష్ట్రంలోని మాదేపూరలో రైల్వేశాఖ వీటి తయారీని చేపట్టింది. అందులో భాగంగా డబ్ల్యూఏజీ-12 మరియు డబ్ల్యూఏజీ-12బి సిరీస్ ఇంజన్లను తయారు చేస్తోంది. 12 వేల హార్స్ పవర్ (అశ్వికశక్తి) గల ఈ లోకోమోటివ్‌లు 6 వేల టన్నుల అధిక లోడును ఎత్తుమార్గంలో సైతం లాగడమే కాకుండా గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే విధంగా రూపకల్పన చేశారు. రైలు డ్రైవర్ (లోకోపైలెట్), సహాయ డ్రైవర్ (అసిస్టెంట్ లోకోపైలెట్)లకు సౌకర్యవంతంగా ఉండే విధంగా క్యాబిన్‌ను పూర్తిగా ఎయిర్ కండీషన్ చేశారు. ఇలాంటి శక్తివంతమైన ఎలక్ట్రిక్ రైళ్ల లోకో మోటివ్‌లను తయారు చేసిన ప్రపంచంలోని ఆరో దేశంగా మనదేశం నిలిచింది. అందులో భాగంగా దేశంలోని వివిధ రైల్వేజోన్‌లలో ఎత్తు పల్లాలు అధికంగా ఉన్నమార్గాల్లో ఈ బాహుబలి ఇంజన్లతో కూడిన గూడ్స్ రైళ్లను నడుపుతున్నారు. త్వరలో ఈ ఎలక్ట్రికల్ ఇంజన్లను భారీ ఎత్తున చేపట్టడానికి గాను మాదేపూర ప్లాంట్ విస్తరణను రైల్వే శాఖ చేపట్టింది.



రైల్వేలో నూతనంగా ప్రవేశపెట్టిన డబ్ల్యూఏజీ-12బీ లోకో మోటివ్

వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాట్లు

పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా ఏర్పాట్లు చేపట్టారు. వక్ఫ్‌బోర్డు నుంచి ఉర్సు ఉత్సవాలకు రూ.8.50 లక్షలు మంజూరు కాగా, ఆ నిధులతో పారిశుద్ధ్యం, తాగునీరు, భక్తుల విడిది, దర్గాతో పాటు చిల్లాలకు రంగులు, విద్యుద్దీపాలు, దర్గా ఆవరణలో అలంకరణ దీపాలు, రెండో రోజు భక్తులకు అన్నదానం తదితర ఏర్పాట్లు చేశారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ముఖ్య కూడళ్లు, దర్గా పరిసరాలు, ప్రధాన రోడ్లపై పోలీసుల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్గా ఆవరణలో విడిది చేశారు.

విద్యుద్దీపాల వెలుగులో దర్గా ఆవరణ



ప్రారంభమైన అన్నారం దర్గా ఉర్సు

అలరించిన ఖవ్వాలి గేయాలు

ఘనంగా సందల్ (గంధం) ఊరేగింపు

పర్వతగిరి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్ గ్రామంలోని యాకూబ్‌షావలి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముజావరు గౌస్‌పాషా ఇంటివద్ద హైదరాబాద్ నుంచి వచ్చిన కళాకారులచే ఖవ్వాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కళాకారులు ఆలపించిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం అక్కడినుంచి సందల్(గంధం) తీసుకుని బయలుదేరి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో జెండాలు, గంధంతో ముజావర్లు, మతపెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్లు ఒళ్లు గగుర్పొడిచే రీతిలో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గంధం ఊరేగింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మామునూరు ఏసీపీ తిరుపతి ఆధ్వర్యంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్‌లు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఊరేగింపు అనంతరం తెల్లవారుజామున దర్గాకు గంధం తీసుకువచ్చిన ముజావర్లు యాకూబ్‌బాబాకు సమర్పించారు. అనంతరం చాదర్ కప్పి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



దర్గా వద్ద ఉర్సు సందడి

నేడు అన్నదానం

ఉర్సు ఉత్సవాల్లో రెండో రోజైన శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రతీ ఏటా నిర్వహించే అన్నదానం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్నదానం చేపట్టనున్నారు. గురువారం రాత్రి దర్గాకు గంధం చెల్లించడంతో శుక్రవారం రోజంతా భక్తులు దర్శనం చేసుకుంటారు. చివరి రోజైన శనివారం దీపారాధన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయి.

క్యాలెండర్ ఆవిష్కరణ

వరంగల్ మెడికల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్‌కుమార్ గురువారం ఎంజీఎం ఆస్పత్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంజీఎం ఆస్పత్రిలో నాలుగో తరగతి ఉద్యోగులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహా అధ్యక్షుడు దాస్యనాయక్, టీఎన్‌జీవో అధ్యక్షుడు రామ్‌కిషన్, ఎంజీఎం ఏడీ ఇస్మాయిల్, సాంబయ్య, భానుప్రకాశ్, మల్లేశం, వేణుగోపాల్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ కిశోర్‌కుమార్

ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ను పరిశీలించిన డీఐవో



రికార్డులను పరిశీలిస్తున్న డీఐవో డాక్టర్ ప్రకాశ్

వరంగల్ మెడికల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డిస్టిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌ను డిస్ట్రిక్ట్ ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో) డాక్టర్ ఐ.ప్రకాశ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాశ్ మాట్లాడుతూ.. శారీరక, మానసిక బుద్ధిమాంద్యం, చెవిటి, మూగ, దంత వ్యాధులపై సేవలు అందించాలని సూచించారు. ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ అందించే సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా ఆరోగ్య శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిషన్ డాక్టర్ మంజుల నాయక్, డాక్టర్ శ్రీలక్ష్మి, డైక్ మేనేజర్ అనిల్ కుమార్, పవన్ కుమార్, ప్రశాంత్, సంపత్ కుమార్, హేమ, వనజ, రమేశ్, మాధవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ క్రికెట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

హసన్‌పర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి మాస్టర్ క్రికెట్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక గురువారం ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా కోడెల మురళి, ఉపాధ్యక్షుడిగా బోయిన శశికాంత్, ప్రధాన కార్యదర్శిగా పప్పుల మోహన్, సహాయ కార్యదర్శిగా వల్లాల యుగందర్‌గౌడ్, కోశాధికారిగా ఆకుతోట దయాకర్, సహాయ కోశాధికారిగా శీలం తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా కాజీపేట శ్రీనివాస్, కనపర్తి రాజు, శీలం క్రాంతి, ఎలిగేటి వెంకన్న, శీలం వంశీ, వేల్పుల సాయికుమార్, అడ్వైజర్లుగా పోలాస సురేష్, నల్ల గోపి, పర్శ సతీష్‌లు నియమితులయ్యారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా తిరుపతి యాదవ్



హసన్‌పర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా హసన్‌పర్తికి చెందిన మారం తిరుపతి యాదవ్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎండల లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా బీజేపీ ఎన్నికల అధికారి వేముల నరేందర్‌రావు గురువారం ప్రకటించారు. సంస్థాగత ఎన్నికలలో భాగంగా పార్టీ నిర్వహించిన ఎన్నికల్లో భాగంగా గతంలో 66వ డివిజన్ అధ్యక్షుడిగా పని చేసిన తిరుపతి మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, కిసాన్ జిల్లా అధ్యక్షుడు మారపల్లి రాంచంద్రారెడ్డిలు హర్షం వ్యక్తం చేసి అభినందించారు. తన నియామకానికి సహకరించిన బీజేపీ శ్రేణులకు తిరుపతి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీవోకు పలువురి శుభాకాంక్షలు

హసన్‌పర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి ఎఫ్ఏసీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీవో కర్ణాకర్‌రెడ్డిని గురువారం పలువురు నాయకులు మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్ఏసీ ఎంపీడీవోను కలిసిన వారిలో హసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్ బిల్ల ఉదయ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహెందర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెసరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, రాజు, జీవన్‌రెడ్డి, సత్యపాల్‌రెడ్డి, సంతోష్, మదన్‌గౌడ్, తదితరులున్నారు.

ఏటూరు జ్యోతి మృతి పట్ల సంతాపం



జ్యోతి మృతి పట్ల సంతాపం తెలుపుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం డీన్, తెలుగు శాఖాధ్యక్షురాలు ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి మృతి పట్ల గురువారం వర్సిటీ పరిపాలన భవనంలో మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో కేయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, పాలక మండలి సభ్యులు, వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, డాక్టర్ బొద్ది రమరెడ్డి, డాక్టర్ చిర్ర రాజుగౌడ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకర జ్యోతి, ప్రొఫెసర్ టి. సవితాజ్యోత్స్న, డాక్టర్ సీజే శ్రీలత, హిస్టరీ అండ్ టూరిజం విభాగాధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, ప్రొఫెసర్ ఎస్.వాసుదేవారెడ్డి, పీఆర్‌ఓ డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, ఇతర బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సిండి 'కేటుగాళ్లు'

- బల్దియా టెండర్లలో ఓ గుత్తేదారు ఆధిపత్యం
- సిండికేట్‌ను కాదని టెండరు వేస్తే అంతే సంగతి
- రాజకీయ పలుకుబడితో బెదిరింపులకు పాల్పడుతున్న వైనం
- టెండరు వేయాలంటేనే వణుకుతున్న సాధారణ కాంట్రాక్టర్లు



వరంగల్ కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో సిండికేటు హవా నడుస్తోంది. సిండికేటును నడిపించే ఓ బడా గుత్తేదారును కాదని ఎవరైనా ఆన్‌లైన్‌గానీ ఆఫ్‌లైన్‌లో గానీ టెండరు వేశారో వారికి మూడినట్టే. ఆ కాంట్రాక్టర్లకు మానసిక వేధింపులతో పాటు పోలీసుస్టేషన్‌ల చుట్టూ తిప్పుతుంటారనే ప్రచారం ఉంది. సివిల్ తగాదాల్లో పోలీసులు తలదూర్చకూడదని చట్టాలు చెబుతున్నా.. కొందరు పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఆన్‌లైన్ టెండర్లు

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్‌లలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాల కోసం బల్దియా ఇంజనీర్లు, అధికారులు టెండర్లు పిలిచారు. రూ.7.10కోట్ల అంచనాలతో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) పనులు, రూ.5.39కోట్లతో జనరల్ ఫండ్ సీటీఎస్-14 పనులకు టెండర్లు పిలిచారు. ఈ రెండు రకాల నిధులతో సుమారు 77 రకాల అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. ఇందుకు బల్దియాలో సుమారు 200 మంది ఆశావహులైన కాంట్రాక్టర్లు ముందుకు వచ్చినా సిండికేట్ ఉందని తెలిసి కొందరు వెనక్కి వెళ్లిపోగా మరికొందరు ఆన్‌లైన్ టెండరు దాఖలు చేశారు. కిందటేడు డిసెంబరు 4 నుంచి 21 వరకు ఆన్‌లైన్ ప్రక్రియ జరిగింది. అప్పటికే సిండికేటుగాళ్లు అధికారులు నిర్ణయించిన ధరలకంటే తక్కువ కొటేషన్ వేసి దరఖాస్తు చేశారు. ఒక్కో పనికి 15 నుంచి 20 శాతం తక్కువ కోట్ వేయాల్సిన టెండర్లు రూ.0.5 లేదా రూ.1 లెస్ వేసి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే ప్రయత్నాలు చేశారు. సుమారు 20 మంది కాంట్రాక్టర్లు ఒక సంఘంగా ఏర్పడి మాజీ బడే గుత్తేదారు సహకారంతో సిండికేట్‌గా మారిపోయి ఇప్పుడిప్పుడే కాంట్రాక్ట్ రంగంలోకి వస్తున్న వారికి దడపుట్టిస్తున్నారు. బల్దియా పనులకు ఎవ్వరినీ టెండరు వేయనీయకుండా అడ్డుకుంటూ సిండికేట్‌గా ఉన్న వారికే పనులు దక్కించుకుని అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నారు. కొందరు బల్దియా అధికారులు, పాలక వర్గం పెద్దలు సైతం సిండికేట్‌గాళ్లకు సహకరిస్తూ ఆన్‌లైన్ టెండర్లు విషయాలు చేరవేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం.

టెక్నికల్ బెడ్లు తెరిచేలోగా ఎన్‌వోసీ ఇవ్వాలి

ఇటీవల బల్దియా ఇంజనీరింగ్ అధికారులు పిలిచిన రూ.12.49కోట్ల పనులకు ఇంకా పనుల కేటాయింపు ఖరారు కాలేదు, మరో ఒకటి, రెండు రోజుల్లో టెక్నికల్ బిడ్లు ప్రారంభిస్తారు. కానీ అనుకున్న ప్రకారంగా సిండికేట్ బ్యాచ్ తక్కువ కొటేషన్‌తో కూడిన దరఖాస్తులు సమర్పించగా నేరుగా వచ్చిన కాంట్రాక్టర్లు పనులు దక్కించుకోవాలని ఎక్కువ లెస్ వేసి పోటీలో ఉన్నారు. దీంతో సిండికేట్ నడిపిస్తున్న ఓ మాజీ బడా గుత్తేదారు రంగంలోకి దిగాడు. టెక్నికల్ బిడ్లు తెరవకముందే టెండరు వేసిన వారిని గుర్తించే పనిలో పడ్డాడు. పలు కారణాలతో తనకు టెండరులో పాల్గొనడం ఇష్టం లేదని వారితోనే ఎన్‌వోసీ రాయించేలా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

కొందరిని పోలీసులతో బెదిరిస్తుండగా, మరికొందరిని రాజకీయ 'డాన్'లతో భయాందోళనకు గురిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు నలుగురిని తప్పించగా, మరో ఇద్దరిని పోటీ నుంచి తప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. టెండరు నుంచి తప్పుకున్న వారి నుంచి ఎన్‌వోసీ రాయించుకుని సిండికేట్లు రాజ్యం ఏలే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే సింగిల్ టెండర్‌ను బల్దియా కమిషనర్ అంగీకరిస్తుందా? లేదా అనే అనుమానాలు కొందరు కాంట్రాక్టర్లలో వ్యక్తమవుతున్నాయి.

ఐదేళ్ల తర్వాత రీ ఎంట్రీ..

ఇటీవల బల్దియాలో జరుగుతున్న అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లు ఆన్‌లైన్ టెండర్లలో పాల్గొని పనులు పూర్తి చేసి.. వరుస క్రమంలో బిల్లులు పొందేవారు. అయితే ఓ బడా గుత్తేదారు రాజకీయ పలుకుబడితో బల్దియాలో సిండికేట్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేశాడు. ప్రస్తుత కాంట్రాక్టర్ల సంఘంను కాదని.. కొత్త సంఘం ఏర్పాటు చేసి కొందరు కాంట్రాక్టర్లను సిండికేట్‌గా నియమించుకున్నాడు. సిండికేట్‌గా ఏర్పడిన కాంట్రాక్టర్లకు పనులు ఇప్పిస్తానని పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిసింది. అధికారులు, నిఘా వర్గాలు గుర్తించి సిండికేట్‌గాళ్లకు చెక్ పెట్టకుంటే బల్దియా ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడే అవకాశాలు ఉన్నాయి.

బల్దియాకు ముగ్గురు ఈఈల నియామకం

వరంగల్ కార్పొరేషన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు ముగ్గురు ఈఈ (ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ల)ను నియమిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిశోర్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇద్దరు వరంగల్ బల్దియాలో డీఈ(డిప్యూటీఇంజనీర్)లుగా పనిచేస్తున్న వారికి ఈఈలుగా పదోన్నతి కల్పించారు. అదేవిధంగా ఖమ్మంలో డీఈగా పనిచేస్తున్న మాధవికి వరంగల్ బల్దియా విభాగం ఈఈగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. ఇంకా బల్దియా క్వాలిటీ కంట్రోల్ విభాగంలో పని చేస్తున్న మోహన్‌ను హైదరాబాద్‌కు పదోన్నతి కల్పించి బదిలీ చేశారు. పదోన్నతి పొందిన వారిలో బల్దియా వెహికల్ షెడ్డులో పనిచేస్తున్న సంతోష్‌బాబు, పని చేస్తున్న రవికుమార్‌లు ఉన్నారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన ప్రదేశం
ఎస్.సంతోష్‌బాబు	వరంగల్ బల్దియా	వరంగల్ బల్దియా
టి.రవికుమార్	వరంగల్ బల్దియా	వరంగల్ బల్దియా
జి.మాధవి	ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్	వరంగల్ బల్దియా
కె.శ్యాంమోహన్	వరంగల్ బల్దియా	హెచ్ఎంఆర్ఎల్ హైదరాబాద్

బస్‌స్టేషన్లలో పండుగ రద్దీ

- సొంతూర్ల నుంచి జనం తిరుగుప్రయాణం
- 800 ప్రత్యేక బస్సులు ఏర్పాటు

హనుమకొండ టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో రద్దీగా మారింది. గురువారం సంక్రాంతి పండుగ కోసం సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికులు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి హనుమకొండ, హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు తిరుగు ప్రయాణం కావడంతో బస్టాండు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా సుమారు 800 ప్రత్యేక బస్సులు హైదరాబాద్ నుంచి హనుమకొండకు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమయానికి కొన్ని బస్సులు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు ఉన్న బస్సుల్లో సీట్లు లేక నిలుచుని ప్రయాణం చేశారు. పలు రూట్లలో బస్సులు ఆలస్యం కావడంతో అసౌకర్యానికి గురైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం భానుకిరణ్ మాట్లాడుతూ.. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సరిపడా బస్సులు ఏర్పాటు చేసి సర్వీసులను నడిపినట్లు తెలిపారు.



హనుమకొండ బస్టాండు ప్రాంగణంలో ప్రయాణికులు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలి

వడ్డెపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ లష్కర్‌సింగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 266లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రజాతంత్ర ఆలోచన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు తుపాకుల దశరథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ కేయూ వంద అడుగుల రోడ్డులో గల శ్యామల గార్డెన్‌లో నిర్వహించిన ప్రజాతంత్ర ఆలోచన వేదిక జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 266 సర్వే నంబర్‌లో ఏడు ఎకరాల 36 గుంటల ప్రభుత్వ స్థలం ఉందని అన్నారు. ఈ ప్రభుత్వ భూమిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుచేస్తే 53, 54, 56, 57, 58 డివిజన్ల ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. సీఎం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఏర్పాటుచేయాలని హైదరాబాద్‌లోని సచివాలయంలోని సీఎం గ్రీవెన్స్ సెల్‌లో రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించి కోరినట్లు దశరథం తెలిపారు. మార్కెట్ ఏర్పాటు కోసం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితోపాటు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి వినతి పత్రాలను అందజేసినట్లు చెప్పారు. మార్కెట్ కోసం స్థలాన్ని సర్వే చేయాలని ఎమ్మెల్యేలు హనుమకొండ ఆర్డీవోను ఆదేశించినప్పటికీ సర్వే పనులు పూర్తికాలేదని అన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ప్రావీణ్య, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే స్పందించి సర్వే పనులు పూర్తి చేయించి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించి మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు.



సమావేశంలో బహిరంగ లేఖ ప్రతులను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు

ఈసందర్భంగా ప్రజాతంత్ర ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన బహిరంగ లేఖ ప్రతులను ఆవిష్కరించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడికి, వరంగల్ ఎంపీ కడియం కావ్యకు, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజుకు బహిరంగ లేఖలను పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మర్రి ప్రభాకర్, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, మీసాల రమేష్, పింగిళి అశోక్‌రెడ్డి, బుర్ర విజయపాల్, జనప సారంగపాణి, గూడెం రమేష్, తంగళ్లపల్లి శంకరాచారి, రాంపల్లి రాజప్రభు తదితరులు పాల్గొన్నారు.

సర్వే షురూ..

(5వ పేజీ తరువాయి)

ఉంటే అలాంటివారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. గ్రామసభల్లో జాబితా ప్రదర్శించి ఆ సభ సిఫార్సు మేరకు ఎంపీడీవోలు, కమిషనరు తమ లాగిన్‌లలో అప్‌లోడ్ చేస్తారు. తుది జాబితాను కలెక్టర్ ధృవీకరిస్తారు. అయితే కులగణన సర్వేను బట్టే రేషన్‌కార్డుల జారీ ఉంటుంది. ఇటీవల జరిగిన కులగణన సర్వేలో రేషన్‌కార్డులు లేని కుటుంబాల జాబితాను తయారు చేశారు. ఆ జాబితా ఆధారంగా మండల స్థాయిలో, మున్సిపల్ పరిధిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. గ్రామ సభల్లో లబ్ధిదారుల పేర్లను వినిపించి తుదిజాబితాకు ఆమోదముద్ర వేస్తారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

బీఆర్ఎస్ హయాంలో నిర్మించి పంపిణీ చేయకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్‌లకు మోక్షం లభించనున్నది. వీటిని పంపిణీ చేయడానికి రంగం సిద్ధమైంది. ప్రజాపాలన దరఖాస్తులను పరిగణలోకి తీసుకొని ఇళ్లస్థలాలు లేకుండా ఉన్నవారికి డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తారు. ఈ నెల 26 లోగా గ్రామ, వార్డు సభల్లో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

తొలి రోజు 138 గ్రామాల్లో సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాల అమలుకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు గురువారం నుంచి మొదలైన సర్వే తొలిరోజు హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని 25 మండలాల్లోని 138 గ్రామాల్లో జరిగింది. హనుమకొండ జిల్లాలో 14 మండలాల్లోని 68 గ్రామాల్లో, వరంగల్ జిల్లాలోని 11 మండలాల్లోని 70 గ్రామాల్లో సర్వేను నిర్వహించారు. తొలి రోజు ఆలస్యంగా సర్వే ప్రారంభమైంది. ఉదయం సర్వేకు సంబంధించి అధికారులకు అవగాహన కల్పించారు. అనుసరించాల్సిన మార్గదర్శకాలను మరోసారి వివరించారు. అవసరమైన సరంజామాతో అధికారులు గ్రామాలకు బయలు దేరారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సర్వే మొదలు పెట్టారు. శుక్రవారం నుంచి ఉదయం 8 గంటలకే అధికారులు గ్రామాలకు చేరుకొని సర్వేను చేపడతారు. రైతు భరోసా, ఇందిరమ్మ రైతు కూలీ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల గుర్తింపునకు ఈ సర్వేను చేపట్టారు.

రెండో రోజూ కొనసాగిన రైల్వే క్రికెట్ పోటీలు

కాజీపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేడియంలో జరుగుతున్న క్రికెట్ పోటీలు రెండో రోజు గురువారం సైతం కొనసాగాయి. ఈ పోటీలను రైల్వే ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షుడు బీ.వీరన్న, ఓబీసీ డివిజన్ అధ్యక్షుడు రేండ్ల రమేశ్ హాజరై పోటీలను ప్రారంభించారు. ఉదయం బెల్లంపల్లి లోకోపైలెట్, ఆపరేటింగ్ జట్లమధ్య జరిగిన పోటీలలో బెల్లంపల్లి లోకోపైలెట్ జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం సీఅండ్‌డబ్ల్యూ సికింద్రాబాద్ వారియర్స్, ఎమినిటీస్ వరంగల్ జట్ల మధ్య జరిగిన పోటీలలో సీఅండ్‌డబ్ల్యూ సికింద్రాబాద్ వారియర్స్ జట్టువిజయం సాధించారు. విజేతలకు జనవరి 26న బహుమతులు అందజేస్తామని రైల్వే ఇనిస్టిట్యూట్ జనరల్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, కోశాధికారి జి. రాజేశ్వర్ రావు తోపాటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



టాస్‌వేసి ఆటను ప్రారంభిస్తున్న రైల్వే కార్మిక నాయకులు

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాజీపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పెండ్యాల - కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య గురువారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెండ్యాల - కాజీపేట రైల్వే స్టేషన్‌ల మధ్య ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతని వయస్సు 65 - 70 సంవత్సరాల మధ్య ఉండి ఛామనఛాయ రంగులో, ఎత్తు 5.6 అంగుళాలు కలిగి ఉండి తెలుపు రంగు అంగి, ధోతి ధరించి ఉన్నాడు. బనియన్‌పై ఎమ్మెల్సీ దిలీప్‌కుమార్ ఫోటోతో ఉంది. షర్ట్‌పై యాకుబ్ టైలర్స్ డీఎస్ఆర్ అనే లేబుల్ ఉందని, మృతుని మెహం నుజ్జునుజ్జయి గుర్తించడానికి వీలులేకుండా ఉందని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచామని ఆచూకీ తెలిసిన వారు 87126 58609, 87125 68496 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

హసన్‌పర్తి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : హసన్‌పర్తి పోలీసు స్టేషన్ పరిధి పద్మశాలి కాలనీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన పల్లపు రాజు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో పేద ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే గురువారం 70 ప్లాస్టిక్ బస్తాలలో సేకరించిన సుమారు రూ.75వేల విలువ చేసే 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఒక వాహనంలో హసన్‌పర్తి పద్మశాలి కాలనీ మీదుగా డంపుకు తరలిస్తున్నాడు. ఈ క్రమంలోనే అక్కడే పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు విద్యాసాగర్, నాగరాజులు వాహనాన్ని తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఏఎస్సై నందమచారి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసి రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

కేయూ న్యాయశాస్త్రం బీవోఎస్‌గా సుదర్శన్

కేయూ క్యాంపస్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ న్యాయశాస్త్ర విభాగం నూతన బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేయగా వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి నియామక ఉత్తర్వులను అందచేశారు. కేయూ పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సుదర్శన్‌కు ఉత్తర్వులను అందచేసి అభినందనలు తెలిపారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై కేసు

మడికొండ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడికి పాల్పడిన వ్యక్తిపై మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కడిపికొండకు చెందిన సాధినేని సుజాత చిన్న కుమారుడు చంద్రశేఖర్ కొంత కాలం కిందట అదే గ్రామానికి చెందిన తడుమేకల చంద్రమౌళి ఇంటి పక్కన పాత ఇల్లును కొనుగోలు చేశాడు. ఆ ఇంటి ప్రహరీ విషయంలో చంద్రశేఖర్, చంద్రమౌళి మధ్య గొడవ జరిగి పెద్ద మనుషుల వద్ద పంచాయితీ జరిగింది. ఆ సమయంలో సుజాతను, ఆమె కుమారుడు చంద్రశేఖర్‌ని ఎప్పటికైనా చంపుతానని చంద్రమౌళి బెదిరించాడు. ఆ పంచాయితీని మనసులో పెట్టుకొని గురువారం మధ్యాహ్నం సుజాత ఇంటి వద్ద పని చేసుకుంటూ ఉండగా చంద్రమౌళి దుర్భాషలాడుతూ ఇటుకతో తలపై దాడి చేసి గాయపర్చాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు చంద్రమౌళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రుద్రేశ్వరుడి ఆశీస్సులతో దండోరా ఉద్యమం

- ప్రముఖ కవి మిట్టపెల్లి సురేందర్

హనుమకొండ కల్చరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రకటించిన ఎస్సీ వర్గీకరణ అమలుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా గ్రామ గ్రామాన తమ ప్రజలను కళారూపాలతో చైతన్యవంతం చేస్తున్నామని, ఇందులో భాగంగా రుద్రేశ్వరుడి సన్నిధిలో పూజలు చేసి ఆయన ఆశీస్సుల కోసం ఆలయానికి వచ్చామని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్ అన్నారు. గురువారం రుద్రేశ్వరాలయాన్ని ఆయన మంద కుమార్ మాదిగ, నరేశ్ మాదిగ, భిక్షపతి మాదిగ తదితర నాయకులతో కలిసి రుద్రేశ్వరుడికి పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు.

ఈ సందర్భంగా మిట్టపెల్లి సురేందర్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి 7న లక్ష గొంతుకలు, వేయి డప్పులు పేరిట తెలంగాణ వ్యాప్తంగా పెద్ద ఎత్తున కళాకారులతో ఉద్యమిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 30 ఏళ్ల కిందట అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మాతృమూర్తి అమ్మనమ్మ ఆశీస్సులు తీసుకొని పాదయాత్రల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ దండోరా ఉద్యమాన్ని ప్రారంభించినట్లు ఆయన గుర్తుచేశారు. అప్పటి నుంచి మూడు దశాబ్దాల కాలంలో ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొన్నామన్నారు. సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చే వరకు ఉద్యమం కొనసాగిందన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దానిని అమలు చేసేందుకు ఒక వైపు ఉద్యమంతో పాటు పరమేశ్వరుడి ఆశీస్సులు కూడా మెండుగా ఉండాలని ఈ ఆలయానికి చేరుకున్నామన్నారు. ఈ సందర్భంగా పాపికొండల్లోనా కొలువైన శివుడా.. అనే పాటను సురేందర్ శ్రావ్యంగా ఆలపించి ఆలయానికి తరలివచ్చిన భక్తుల మద్దతు అందుకున్నారు.



రుద్రేశ్వరాలయంలో మిట్టపెల్లి సురేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు



త్రివేణీ సంగమ స్థలి ప్రయాగ (అలహాబాద్)లో 45 రోజుల కుంభమేళా వైభవంగా ప్రారంభమయింది. కోట్లాది ప్రజలు పవిత్ర స్నానాలకోసం తరలివచ్చే ఈ మహోన్నతమైన కార్యక్రమం ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుక. మరి కుంభమేళా సందర్భంగా... ప్రయాగలో దర్శించుకోవాల్సిన ప్రధాన ఆలయాలేమిటో తెలుసుకుందామా?

కుంభమేళా

పవిత్ర స్నానం

పరిపూర్ణం కావాలంటే...

మాధవం దృష్ట్వా...

'కాశీక్షేత్ర నివాసం చ కాలభైరవ దర్శనమ్
ప్రయాగే మాధవం దృష్ట్వా ఏకబిల్వం శివార్పణం' అంటోంది బిల్వాష్టకం. కాశీలో కొన్నాళ్ళు నివసించి, ఆయనను బిల్వపత్రాలతో అర్చించి, కాలభైరవుడి దర్శనం చేసుకున్నవారు ప్రయాగలో మాధవస్వామిని దర్శనం చేసుకున్న తరువాతే ఆ యాత్ర పరిపూర్ణం అవుతుందన్నారు పూర్వులు. ప్రయాగ క్షేత్రానికి అధిదేవత శ్రీ వేణీ మాధవుడు. ఈ స్వామిని 'ప్రయాగకు మహారాజు'గా 'రామచరితమానస్'లో తులసీదాసు



ప్రస్తుతించాడు. అత్యంత పురాతనమైన వేణీమాధవ ఆలయాన్ని 'ప్రాచీన శ్రీ వేణీ మాధవ్ మందిర్'గా వ్యవహరిస్తారు.

స్థలపురాణం ప్రకారం... త్రేతాయుగంలో గజకర్ణుడు అనే రాక్షసుడు ముల్లోకాలను పీడిస్తూ ఉండేవాడు. అతని హింసను భరించలేక దేవతలు మహా విష్ణువును శరణు వేడారు. అప్పుడు నారద మహర్షిని గజకర్ణుడి దగ్గరకు మహా విష్ణువు పంపాడు. గజకర్ణుడికి కొన్ని వ్యాధులు ఉండేవి. వాటి నివారణ మార్గాన్ని చెప్పాలని నారదుణ్ణి గజకర్ణుడు కోరాడు. త్రివేణీ సంగమంలో స్నానం చేస్తే ఫలితం ఉంటుందని నారదుడు చెప్పాడు. ఆ ప్రకారం స్నానం చేసిన గజకర్ణుడి వ్యాధులు నయమయ్యాయి. ఇంత పవిత్రమైన జలాలు తనకే సొంతం కావాలనే దురాశతో... అక్కడ సంగమించే గంగ, యమున, సరస్వతి నదులను గజకర్ణుడు తాగేశాడు. ఆ పరీవాహక ప్రాంతాల్లో తీవ్రమైన కరువు వచ్చింది. ప్రజల పరిస్థితి దుర్భరంగా మారింది. వారి ప్రార్థనను ఆలకించిన మహా విష్ణువు ప్రయాగ ప్రాంతానికి వచ్చి, మూడు రోజులు యుద్ధం చేసి, గజకర్ణుణ్ణి వధించాడు. అప్పుడు ఆ నదులు మళ్ళీ వాటి స్థానాల్లో తిరిగి ప్రవహించడం ప్రారంభించాయి. త్రివేణీ సంగమాన్ని కాపాడవలసిన అవసరాన్ని గుర్తించిన మహా విష్ణువు... పవిత్ర సంగమానికి నిరంతర రక్షకుడిగా... వేణీ మాధవుడి రూపంలో... శ్రీ మహాలక్ష్మీ సమేతంగా కొలువయ్యాడు. అందుకే ఈ ఆలయాన్ని లక్ష్మీ నారాయణ మందిరంగా కూడా పిలుస్తారు. పద్మ, వరాహ, మత్స్య, స్కాంద పురాణాల్లో, రామాయణ, మహా భారతాల్లో ఈ స్వామి ప్రస్తావన ఉంది. జనన మరణ చక్రం నుంచి మానవులకు విముక్తి కలిగించే దైవంగా వేణీ మాధవుణ్ణి పురాణాలు వర్ణించాయి.

ప్రయాగే మాధవేశ్వరి...

పరమ శివుడికి జరిగిన అవమానాన్ని తట్టుకోలేని సతీదేవి... దక్ష యజ్ఞంలో ఆత్మాహుతి చేసుకుంది. శివుడు తన భుజాన సతీదేవి దేహాన్ని వేసుకొని, చీకటిలోకి వెళ్తూ ఉండగా... లోక క్షేమం కోసం ఆ దేహాన్ని తన సుదర్శన చక్రంతో మహా విష్ణువు ఛేదించాడు. ఆ శరీర ఖండాలు భూమిపై పలు ప్రదేశాల్లో





పడ్డాయి. ఇవి అష్టాదశ శక్తి పీఠాలుగా ప్రసిద్ధి చెందాయి. వాటిలో ప్రయాగ ఒకటి. ఇది సతీదేవి కుడి చేతి వేళ్ళు పడిన ప్రదేశంగా పురాణాలు పేర్కొంటున్నాయి. ఇక్కడ మాధవేశ్వరిగా అమ్మవారు ఆరాధనలు అందుకుంటోంది. ఆమెను స్థానికులు 'అలోపీదేవి' అని పిలుస్తారు. ఈ ఆలయంలో యంత్రమే కాని విగ్రహం లేదు. యంత్రంపై ఉన్న ఊయలకు (డోలీకి) భక్తులు పూజలు చేస్తారు. కుంభమేళాలో స్నానం చేసి, ఆ తీరంలో కొలువైన వేణీ మాధవస్వామిని, మాధవేశ్వరీ దేవిని దర్శనం చేసుకున్నవారు సంపూర్ణ యాత్రా ఫలాన్ని పొందుతారనే విశ్వాసం ఉంది.

సహజయోగ

సర్వమత సారమే విశ్వ నిర్మల ధర్మం

'ధర్మమే సర్వ జగత్తుకు ఆధారం' అని 'నారాయణ ఉపనిషత్తు' చెబుతోంది. 'ధైర్యం, క్షమ, సంయమనం, అస్తేయం (దొంగతనం చెయ్యకపోవడం), శౌచం, ఇంద్రియ నిగ్రహం, విద్య, సత్యం, క్రోధరాహిత్యం, సంశయం లేకుండా ఉండడం... ఈ పది జీవితంలో పాటించడమే ధర్మం' అని 'మనుస్మృతి' చెబుతోంది. మాతాజీ నిర్మలాదేవి ప్రవేశపెట్టిన 'విశ్వ నిర్మల ధర్మా'నికి ఈ సూత్రమే పునాది. 'విశ్వ' అంటే విశ్వజనీనమైనది. ఈ ఆధ్యాత్మిక మార్గాన్ని కుల, మత, వర్గ, ప్రాంత, లింగ, వయో భేదాలు లేకుండా ఆచరించవచ్చు. 'నిర్మల' అంటే 'ఎలాంటి మలినం లేనిది, పరిపూర్ణమైన స్వచ్ఛత కలిగినది' అని అర్థం. మనిషి ధర్మబద్ధమైన జీవితంతో మనసును శుద్ధి చేసుకోవాలని ప్రాచీన కాలం నుంచి అన్ని మతాలు చెబుతున్నాయి. సాధకుడి ఆధ్యాత్మిక ఉత్థానానికి మార్గాన్ని సుగమం చేసి, జీవితంలో అన్ని విధాలా సమతుల్యతను నెలకొల్పడమే ప్రతి మతం తాలూకు లక్ష్యం. అన్ని మతాల మధ్యా సామరస్యాన్ని తీసుకువచ్చి, వాటి నిజమైన అర్థాన్ని బోధించి, అవన్నీ ఒకే వృక్షానికి పూసిన పూవులని నిరూపించేవారు ఒకరు ఉండాలి. ఆ పని కోసమే భగవంతుడు పంపినట్టు మాతాజీ నిర్మలాదేవి జన్మించారు.



అప్పుడే మనది వసుధైక కుటుంబం

సహజయోగం ఏ మతానికో చెందినది కాదు. ఇది సర్వ మత సమ్మేళనం, సర్వ మతాల సారం. అవతార పురుషులు, సద్గురువులు, మత ప్రవక్తల ప్రబోధాల సారాంశాన్ని సమ్మిళితం చేసి ఆచరిస్తున్న ధార్మిక సంగమం. అన్ని మతాలు వాటిని ప్రారంభించిన అవతారమూర్తుల పేరుతో ప్రసిద్ధి చెందాయి. అదే విధంగా ఈ ఆధ్యాత్మిక మార్గం కూడా శ్రీమాతాజీ నిర్మలాదేవి పేరిట 'విశ్వ నిర్మల ధర్మం'గా ఏర్పడింది. సహజ యోగులు దీన్ని ఆచరిస్తారు. ఇది అన్ని మతాల సారాంశం. ఇందులో అన్ని మతాల నిజమైన అర్థాన్ని, వాటి మధ్య సంబంధాన్ని తెలుసుకుంటాం. 'విశ్వ నిర్మల ధర్మం' అనే మాట వినగానే 'కొత్త మతం తీసుకోవాలేమో? సహజయోగ సాధన చేయాలంటే మతానికి సంబంధించిన ఆచార వ్యవహారాలు, నియమ నిష్ఠలు అనుసరించాలేమో?' అనే అపోహ మొదట్లో కొందరికి కలుగుతుంది. కానీ ఇందులో ప్రత్యేకంగా పాటించే నియమం ఏదీ లేదు. ఇది ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఉపయోగపడే మార్గం మాత్రమే. మన అందరిదీ ఒకే మతం, ఒకే రంగు, ఒకే జాతి కాకపోవచ్చు... కానీ అందరినీ సృష్టించిన ఆది దంపతులు ఒక్కరే. ఇది అంగీకరిస్తే అందరిదీ ఒకే మతం. ఒకే అభిమతం, ఒకే కుటుంబం. అదే విశ్వ నిర్మల ధర్మం చెబుతోంది. దీన్ని అర్థం చేసుకోవడానికి, ఆచరించి చూపడానికి సహజయోగ సాధనే సాధనం. దీన్ని అనుసరించినప్పుడు మన ప్రపంచం భూతల స్వర్గం, వసుధైక కుటుంబం అవుతుంది.

మానవ జన్మకు పరమార్థం

సహజ యోగ సాధకులు... హిందూ దేవతలను, అల్లాహ్‌ను, క్రీస్తును, బుద్ధుణ్ణి, మహావీరుణ్ణి, గురునానక్‌ను ఆయా పర్వదినాలలో ఆరాధిస్తారు. అందరూ ఒక్కటే అనే భావనతో మెలుగుతారు. '.నిన్ను నీవు తెలుసుకో... అనేది అన్ని మతాల సారాంశం. అదే సత్యం. భగవంతుడు ఎక్కడో లేడు. నీ ఆత్మలో ఉన్నాడు. కాబట్టి నువ్వు ఆత్మ స్వరూపుడిగా పరిణామం చెందాలి. ఎన్నో ఏళ్ళ, జన్మల ఈ సత్యాన్వేషణ... సహజ యోగంలో ఆత్మ సాక్షాత్కారంతో ముగుస్తుంది అదే మానవ జన్మకు పరమార్థం" అంటారు శ్రీమాతాజీ నిర్మలాదేవి. ఆమె కేవలం ఒక ఆధ్యాత్మిక గురువు మాత్రమే కాదు. సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, సర్వమత, సర్వ ధర్మ సంస్థాపనను కేవలం ప్రచారానికో, ప్రవచనాలకో పరిమితం కాకుండా మనసా, వాచా, కర్మణా ఆచరించి చూపించారు. అలా చేయగలిగే అవకాశం సహజయోగంలోనే ఉందని చాటిచెప్పారు. అదే విశ్వ నిర్మల ధర్మం.

(ప్రపంచవ్యాప్తంగా ఉన్న సహజయోగులు ప్రతి ఏటా జనవరి 19వ తేదీని 'విశ్వ నిర్మల ధర్మ సంస్థాపన దినోత్సవం'గా జరుపుకొంటారు)

డాక్టర్ పి. రాకేష్ 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ




ఇస్రో.. డాకింగ్

రోదసిలో కరచాలనం

స్పేడెక్స్ చేజర్, టార్గెట్ ఉపగ్రహాల అనుసంధాన ప్రక్రియ సక్సెస్

- ఇప్పటికే ఆ ఘనత సాధించిన మూడు దేశాల సరసన భారత్
- సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటు దిశగా మరో కీలక అడుగు
- 7, 9 తేదీల్లో డాకింగ్‌కు యత్నం.. పలు కారణాలతో వాయిదా
- జనవరి 12వ తేదీ నాటికి 15 మీటర్ల దూరానికి ఉపగ్రహాలు
- గురువారం ఉదయం 9 గంటల సమయంలో డాకింగ్ పూర్తి
- రెండు ఉపగ్రహాలూ నియంత్రణలోనే ఉన్నాయని ఇస్రో వెల్లడి
- శాస్త్రజ్ఞులను అభినందించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

'ఉపగ్రహాల స్పేస్ డాకింగ్‌ను విజయవంతంగా పూర్తిచేసిన ఇస్రో శాస్త్రవేత్తలకు, అంతరిక్ష రంగానికి అభినందనలు. రాబోయే రోజుల్లో భారత్ చేపట్టబోయే ముఖ్యమైన అంతరిక్ష యాత్రలకు ఇదొక ముఖ్యమైన మైలురాయి'
-ప్రధాని నరేంద్ర మోదీ



'గుడ్ మార్నింగ్ ఇండియా. అంతరిక్ష చరిత్రలో భారత్ తన పేరును చిరస్థాయిగా డాక్ చేసింది. ఇస్రో స్పేడెక్స్ మిషన్ చరిత్రాత్మక విజయాన్ని అందుకుంది. ఈ క్షణాన్ని చూస్తున్నందుకు గర్వంగా ఉంది'
- ఇస్రో

సూళ్లూరుపేట, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): పదిహేడు రోజుల ఉత్కంఠభరిత నిరీక్షణకు తెరపడింది! భారతీయులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది! స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్)లో భాగంగా గత నెల 30న భారత అంతరిక్ష పరిశోధనల సంస్థ (ఇస్రో) రోదసిలోకి ప్రవేశపెట్టిన ఎస్‌డీఎక్స్-01 (చేజర్), ఎస్‌డీఎక్స్-02 (టార్గెట్) ఉపగ్రహాలను..

బెంగళూరులోని ఇస్ట్రాక్ ట్రాకింగ్ సెంటర్ శాస్త్రవేత్తలు గురువారం ఉదయం 9 గంటల సమయంలో విజయవంతంగా అనుసంధానించారు. డిసెంబరు 30న శ్రీహరికోటలోని షార్ మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా జంట ఉపగ్రహాలను రోదసిలోకి పంపిన సంగతి తెలిసిందే. ఈ ఉపగ్రహాలు అప్పటి నుంచీ కక్ష్యలో తిరుగుతూ ఉన్నాయి. ఒక్కొక్కటీ 220 కేజీల బరువుండే ఈ రెండు శాటిలైట్ల మధ్య దూరం 20 కిలోమీటర్లు ఉండేలా లాంచింగ్ సమయంలోనే జాగ్రత్తలు తీసుకున్నారు. తర్వాత క్రమంగా వీటి మధ్య దూరాన్ని తగ్గించుకుంటూ వచ్చి 7వ తేదీన ఉదయం 9.30 గంటల సమయంలో అనుసంధానం చేయాలని భావించారు. ఈ మేరకు ఇస్రో చైర్మన్ ఒక ప్రకటన కూడా చేశారు. అయితే చేజర్ ఉపగ్రహంలోని అనుసంధాన లింకు తెరుచుకోకపోవడంతో ఆ ప్రక్రియను జనవరి 9కి వాయిదా వేశారు. ఆ సమయంలో ఆ రెండు ఉపగ్రహాలు 1.5 కి.మీ దూరంలో ప్రయాణిస్తున్నాయి. వాటిని ఆ రోజు 1.3 కి.మీ దగ్గరికి తీసుకొచ్చారు. రెండింటిమధ్య దూరాన్ని 225 మీటర్లకు తగ్గించేందుకు ప్రయత్నించి.. వాటి వేగం అదుపులోకి రాకపోవడంతో అనుసంధాన ప్రక్రియను జనవరి 11కి వాయిదా వేశారు. ఆ రోజున రెండు ఉపగ్రహాలనూ 230 మీటర్ల దగ్గరకు తీసుకొచ్చారు. జనవరి 12న ఉపగ్రహాల మధ్య దూరాన్ని 15 మీటర్లకు తీసుకొచ్చారు. కొంత సమయం తర్వాత ఉపగ్రహాల వేగాన్ని నియంత్రించుకుంటూ రెండింటినీ 10 అడుగుల (3 మీటర్లు) దగ్గరకు చేర్చారు. ఎట్టకేలకు గురువారం ఉదయం 9 గంటలకు నెమ్మదిగా రెండింటినీ అనుసంధానించారు. అవి నియంత్రణలోనే ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత.. డాకింగ్ విజయవంతమైనట్టు ఇస్రో వెల్లడించింది. దీన్నో చరిత్రాత్మక విజయంగా అభివర్ణించింది. ఏకమైన రెండు ఉపగ్రహాలూ నియంత్రణలోనే ఉన్నాయని.. ఇకపై అన్‌డాకింగ్, విద్యుత్తు బదిలీ తదితర ప్రక్రియలు చేపడతామని పేర్కొంది. డాకింగ్ ప్రక్రియ విజయవంతంగా పూర్తయినట్టు తెలియగానే.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే.. ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత అంతరిక్ష కార్యక్రమం చరిత్రాత్మక మైలురాయిని అధిగమించిందని కొనియాడారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ కూడా ఇస్రోను అభినందించారు. 'నమ్మశక్యం కాని విజయం ఇది. స్పేడెక్స్... డాకింగ్ పూర్తయింది. ఇది ఇప్పుడు స్వదేశీ భారతీయ డాకింగ్ వ్యవస్థ' అన్నారు. ఈ విజయం.. భవిష్యత్తులో చేపట్టబోయే భారతీయ అంతరిక్ష కేంద్రం, చంద్రయాన్ 4, గగన్‌యాన్ ప్రయోగాలను ఎలాంటి ఇబ్బందులూ లేకుండా నిర్వహించేందుకు బాటలు వేసిందని కొనియాడారు. ఇస్రో చైర్మన్ వి నారాయణన్ కూడా.. మిషన్‌ను విజయవంతం చేసిన బృందాన్ని అభినందించారు. ఈ ప్రయోగంలో కీలక భాగస్వామి అయిన అనంత్ టెక్నాలజీస్ కూడా ఇస్రో శాస్త్రజ్ఞులకు హృదయపూర్వక అభినందనలు తెలిపింది. భారత అంతరిక్ష ప్రయోగాల ప్రస్థానంలో అత్యంత కీలకమైన ప్రాజెక్టులో ప్రధాన భూమిక పోషించడం తమకు గర్వకారణమని ఆ సంస్థ సీఎండీ డాక్టర్ పావులూరి సుబ్బారావు పేర్కొన్నారు.



ఎన్నో ఉపయోగాలు..

ఉపగ్రహాల డాకింగ్ ప్రక్రియ విజయవంతం కావడంతో.. భారత్ సొంత అంతరిక్ష కేంద్ర ఏర్పాటుకు మార్గం సుగమమైందని చెప్పవచ్చు. అలాగే.. భారత్ చేపట్టబోయే గగన్‌యాన్‌కు కూడా డాకింగ్ పరిజ్ఞానం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక, చంద్రయాన్-4లో భాగంగా.. చంద్రుడి నమూనాలను తేవడమే లక్ష్యంగా పెట్టుకొన్న ఇస్రో అందుకోసం రెండు రాకెట్ల ద్వారా విభిన్న మాడ్యూళ్లను రోదసిలోకి పంపనుంది. ఈ అనుభవంతో.. చంద్రుడి కక్ష్యలో ఆ మాడ్యూళ్లను అనుసంధానం చేయడం ఇస్రోకు సులభం అవుతుంది. అందుకే ఇస్రో ఈ ప్రయోగాన్ని ఇంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ విజయంతో.. ఆ ప్రయోగాలు మరింత వేగవంతమవుతాయి.

డాకింగ్ విజయ సారథులు వీరే

డాకింగ్ ప్రక్రియలో బెంగళూరు యూఆర్‌రావు ఉపగ్రహ తయారీ కేంద్రం శాస్త్రవేత్తల పాత్ర కీలకమైనది. స్పేడెక్స్ ఉపగ్రహాల రూపకల్పన నుంచీ.. వీరు ఈ ప్రాజెక్టును నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. శాటిలైట్ డైరెక్టర్ ఎం.శంకరన్, మరో డైరెక్టర్ ఎన్.సురేంద్రన్, మిషన్ డైరెక్టర్ జయకుమార్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం మూడేళ్ల కృషికి ఫలితం ఈ విజయం. అలాగే.. బెంగళూరుకు చెందిన అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ సహకారం కూడా ఈ విజయానికి ఎంతో ఉపకరించింది.

డాకింగ్ వీరుడు శంకరన్

డాకింగ్ సాంకేతికత సాధించడంలో ప్రధాన భూమిక పోషించిన వారిలో బెంగళూరులోని యూఆర్‌రావు శాటిలైట్ సెంటర్ డైరెక్టర్ ఎం.శంకరన్ ఒకరు. గతంలో ఇస్రో చేపట్టిన పలు భారీ ప్రయోగాల్లో శంకరన్ కీలక పాత్ర పోషించారు. చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై సాఫ్ట్‌గా ల్యాండింగ్ కావడంలో ఈయన పాత్ర ఎంతో ఉంది. తమిళనాడులోని తిరువాయూరుకు చెందిన శంకరన్.. నావిగేషన్, కమ్యూనికేషన్, రిమోట్ సెన్సింగ్, వాతావరణ పరిశోధనల ఉపగ్రహ ప్రయోగాల్లో కీలకంగా వ్యవహరించారు.

చరిత్రలో తొలి డాకింగ్.. 1966లో!

రోదసిలో డాకింగ్ చేసిన నాలుగో దేశంగా భారత దేశం గురువారం చరిత్ర సృష్టించింది సరే.. మరి ఆ ఘనత సాధించిన మొదటి దేశమేది? అంటే.. అమెరికా. 1966 మార్చి 16న.. అమెరికాకు చెందిన ఇద్దరు వ్యోమగాములు నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, డేవిడ్ స్కాట్ నడుపుతున్న జెమిని 8 క్యాప్సూల్.. ఏజెనా టార్గెట్ వెహికల్ అనే చోదక రహిత వ్యోమనౌకతో డాక్ అయ్యింది. అదే మానవాళి చరిత్రలో తొలి డాకింగ్. రోదసిలో రెండు వ్యోమనౌకలూ విజయవంతంగా డాక్ అయ్యాయి. కానీ.. క్షణాల వ్యవధిలోనే జెమినీ 8 అదుపులో లేకుండా పోయింది. అప్రమత్తమైన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ జెమిని 8ను అన్‌డాక్ చేసినా.. అది అదుపులోకి రాలేదు. దీంతో.. నాసా శాస్త్రజ్ఞులు ఆ వ్యోమనౌకను షెడ్యూలుకు భిన్నంగా పశ్చిమ పసిఫిక్ మహాసముద్రంలో పడిపోయేలా చేసి, వ్యోమగాములను కాపాడుకున్నారు.

ఇక అంతరిక్ష కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)



పరిభ్రమిస్తూ ఉండే ఈ అంతరిక్ష కేంద్రంలో పలు పరిశోధనలు చేపట్టే యోచన ఉంది. బీఏఎస్‌లోకి వెళ్లే భారతీయ వ్యోమగాములు.. అక్కడే 3 నుంచి 6 నెలలపాటు పరిశోధనలు నిర్వహించేలా అందులో ఏర్పాట్లు చేయనున్నారు. 2028 డిసెంబరు నాటికి ఎల్‌వీఎం3 లాంచ్ వెహికల్ ద్వారా.. 10 టన్నుల బరువుండే మొదటి మాడ్యూల్‌ను లాంచ్ చేసే అవకాశం ఉన్నట్టు సమాచారం. మిగతా మాడ్యూళ్లను.. తదుపరి తరం లాంచ్ వెహికల్ సూర్య ద్వారా రోదసిలోకి పంపి, ఒకదానికొకటి అనుసంధానం చేసి 2035 నాటికి పూర్తి చేయాలని ఇస్రో శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. భారతీయ అంతరిక్ష కేంద్రం తాలూకా డిజైన్లను పరిశీలిస్తున్నట్టు.. 2024లో జరిగిన 'ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్'లో ఇస్రో అప్పటి చీఫ్ ఎస్.సోమనాథ్ వెల్లడించారు. ఈ స్పేస్‌స్టేషన్‌కు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలను బెంగళూరులోని యూఆర్ రావ్ ఉపగ్రహ కేంద్రం, హార్డ్‌వేర్‌ను విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ అందించనున్నట్టు తెలిపారు.

ఏం చేస్తారంటే..

ఇస్రో ప్రతిపాదనల ప్రకారం.. భారతీయ అంతరిక్ష కేంద్రం కొలతలు 27 మీటర్ల పొడుగు, 20 మీటర్ల వెడల్పు మేర ఉండనున్నాయి. అందులో గరిష్ఠంగా ఆరుగురు వ్యోమగాములు ఉండొచ్చు. సాధారణంగా ఇద్దరు నుంచి నలుగురు వ్యోమగాములు ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నారు. భూమికి 400 నుంచి 450 కిలోమీటర్ల ఎత్తున తిరిగే బీఏఎస్.. అమెరికన్, రష్యన్, జపనీస్, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ స్పేస్‌పోర్టులకు అందుబాటులో ఉంటుంది. ఈ అంతరిక్ష కేంద్రంలో మన వ్యోమగాములు మైక్రోగ్రావిటీకి సంబంధించిన శాస్త్రీయ పరిశోధనలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంతో కూడా డాక్ అయ్యేలా.. దీంట్లో ఒక యూనిక్ డాకింగ్ పోర్టును ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర సమయాల్లో వ్యోమగాముల ప్రాణాలను రక్షించుకునేందుకు.. శాశ్వతంగా డాక్ చేసిన 'సేఫ్టీ క్రూ మాడ్యూల్' కూడా ఇందులో ఉండనుంది. 2028లో లాంచ్ చేయనున్న మొదటి మాడ్యూల్‌లో సిబ్బంది ఉండడానికి అవసరమైన క్వార్టర్లు, ప్రాణాధార వ్యవస్థల వంటివి ఉండనున్నట్టు తెలుస్తోంది. ఆ తర్వాత వరుసగా.. బీఏఎస్-2 (కోర్-డాకింగ్ మాడ్యూల్), బీఏఎస్-03 (సైన్స్ రిసెర్చ్ మాడ్యూల్), బీఏఎస్-04 (లాబొరేటరీ మాడ్యూల్), బీఏఎస్-05 (కామన్ వర్కింగ్ మాడ్యూల్)లను దానికి అనుసంధానం చేస్తారు. అలాగే.. కొత్తగా వచ్చే మాడ్యూళ్ల బెర్తింగ్ కోసం రోబోటిక్ 'ఆర్మ్'ను కూడా ఏర్పాటు చేయనున్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాలకు పైబడి సేవలందిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని కూడా ఇలాగే దశలవారీగా నిర్మించారు. అదే మన సొంత అంతరిక్ష కేంద్రానికి స్ఫూర్తి.

అంచెలంచెలుగా..

మానవుడు ఇప్పటిదాకా రోదసిలో నిర్మించిన అతి పెద్ద, అత్యంత బరువైన బాహుబలి కట్టడం.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్). భూమికి దాదాపు 400 కిలోమీటర్ల ఎత్తున.. భూదిగువ కక్ష్యలో తిరుగుతూ ప్రతి 90 నిమిషాలకొకసారి భూమిచుట్టూ ప్రదక్షిణ చేసే కృత్రిమ ఉపగ్రహం ఈ ఐఎస్ఎస్! స్పేస్ రేసులో నువ్వా నేనా అంటూ పోటీపడిన అమెరికా, రష్యా.. భవిష్యత్తులో ఇతర గ్రహాల మీదకు వెళ్లడానికి, చంద్రుడి మీదకు చేపట్టబోయే యాత్రలకు ఒక బేస్ స్టేషన్‌లా ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో వేర్వేరు స్పేస్ స్టేషన్ల నిర్మాణానికి నడుం బిగించాయి. కానీ పదేళ్లయినా అవి కార్యరూపం దాల్చకపోవడంతో అమెరికా తొలుత యూరప్ దేశాలతోపాటు, కెనడా, జపాన్ సహకారం తీసుకుంది. తర్వాత వాటితో రష్యా కూడా జత కలిసింది. అలా ఐఎస్ఎస్ నిర్మాణం 1998లో మొదలైంది. ఇటుకా ఇటుకా పేర్చి ఇల్లు కట్టినట్టు.. 18 మాడ్యూళ్ల సహా 43 ఎలిమెంట్లతో ఐఎస్ఎస్‌ను నిర్మించారు. దాని బరువు దాదాపు 4.2 లక్షల కిలోలు. అది ఆరు పడగ్గదుల ఇల్లంత విశాలంగా ఉంటుంది. అందులో ఆరు స్లీపింగ్ క్వార్టర్లు, రెండు బాత్‌రూమ్‌లు, ఒక జిమ్ ఉంటాయి. రోదసిలో సెకనుకు ఐదు మైళ్ల వేగంతో ప్రయాణిస్తుంది. రోజులో దాదాపు 16సార్లు భూమిని చుట్టేస్తుంది. అయితే, అంతరిక్ష కేంద్రాల నిర్మాణానికి సంబంధించి చాలా దేశాలకు సొంత ప్రణాళికలు ఉన్నాయి. ఈ క్రమంలోనే.. 2030లో ఐఎస్ఎస్‌ను విచ్ఛిన్నం చేసేందుకు అమెరికా స్పేస్‌ఎక్స్ సంస్థతో రూ.7 వేల కోట్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది.

శ్రీహరికోటలో మూడో లాంచ్ ప్యాడ్

» నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, సూళ్లూరుపేట, జనవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లో మూడో లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. ఈ లాంచ్ ప్యాడ్ నిర్మాణానికి రూ. 3,985 కోట్లు వ్యయం అవుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ఇస్రో 'నెక్స్ట్ జెనరేషన్ లాంచ్ వెహికల్స్ (ఎన్‌జీఎల్వీ)'తో పాటు ఎల్‌వీఎం3 అంతరిక్ష వాహనాల ప్రయోగాలకు అనుగుణంగా ఈ కొత్త లాంచ్ ప్యాడ్ నిర్మాణం ఉంటుందని ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. అలాగే రెండో లాంచ్ ప్యాడ్‌కు స్టాండ్‌బై కూడా ఇది ఉంటుందని, భవిష్యత్‌లో మానవ సహిత అంతరిక్ష యాత్రకు సంబంధించిన రాకెట్ల ప్రయోగ సామర్థ్యం కూడా దీనితో పెరుగుతుందని తెలిపింది. నాలుగేళ్లలో దీని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆ ప్రకటనలో ప్రభుత్వం వెల్లడించింది.

ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
వరంగల్ ● శుక్రవారం 17 జనవరి 2025

సినిమాలో నా లుక్ తృప్తినిచ్చింది

- జగపతిబాబు




రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌సీ16' (వర్కింగ్ టైటిల్). నవీన్ యెర్నేని, వై.రవి శంకర్ నిర్మిస్తున్నారు. జగపతిబాబు ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా, ఈ సినిమాలో తన లుక్ గురించి ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే సినిమా కోసం సన్నద్ధమవుతున్న వీడియోను ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. "చాలా కాలం తర్వాత దర్శకుడు బుచ్చిబాబు సానా 'ఆర్‌సీ 16' కోసం మంచి పాత్రను ఇచ్చాడు. గెటప్ చూసిన తర్వాత నాకు చాలా తృప్తిగా ఉంది" అని పేర్కొన్నారు. కాగా, ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతోంది. కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: రత్నవేలు, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్.




షాక్‌కు గురయ్యాం

సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడిపై టాలీవుడ్ హీరోలు చిరంజీవి, జూనియర్ ఎన్టీఆర్ విచారం వ్యక్తం చేశారు. విషయం తెలిసి షాక్‌కు గురయ్యామన్నారు. 'సైఫ్ అలీఖాన్‌పై జరిగిన దాడి నన్నెంతగానో కలచి వేసింది. ఆయన త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా' అంటూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'సైఫ్ సర్‌పై జరిగిన దాడి గురించి విని షాక్‌కు గురయ్యాను. ఆయన త్వరగా కోలుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నా' అంటూ జూనియర్ ఎన్టీఆర్ ట్వీట్ చేశారు. కాగా, ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్రంలో విలన్ పాత్ర పోషించారు సైఫ్ అలీఖాన్. గతేడాది విడుదలైన ఈ మూవీకి సీక్వెల్‌గా 'దేవర-2' ప్రారంభం కావాల్సి ఉంది. సైఫ్ దాడికి గురికావడంతో ఇది మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి.

అందుకే సినిమాలు తగ్గించా



బ్రహ్మానందం

'సినిమాలు ఎందుకు తగ్గించేశానని చాలా మంది అడుగుతున్నారు. నాకు మంచి ఇమేజ్ ఉంది. దాన్ని కాపాడుకోవాలి. బ్రహ్మానందం బాగానే చేస్తున్నాడు కానీ.. ఒకప్పటిలా బాగా నవ్వించలేకపోతున్నాడు. ఆయన ఒకప్పుడు నటిస్తే వచ్చినంత నవ్వు ఇప్పుడు రావట్లేదు' అని కొందరు కమెడియన్లు మాట్లాడుకుంటుంటే విన్నాను. ఎంత జాగ్రత్తగా చేసినా ఇలా దొరికిపోతుంటాం. ఇలాంటివి అనిపించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే సినిమాలు సెలక్టివ్‌గా చేస్తున్నాను. దర్శకులు కూడా నేను ఇదివరకు చేసిన పాత్రలతోనే నన్ను అప్రోచ్ అవుతున్నారు. నన్ను ప్రేక్షకులు ఎక్కువ కాలం గుర్తుపెట్టుకోవాలంటే రిపీట్ పాత్రలు చేయకూడదు. మరో కారణం, పెరుగుతున్న నా వయసు. ఒకప్పుడు చేసినంత ఉత్సాహంగా చేయలేకపోతున్నాను. అందుకే సినిమాలు తగ్గించేయాలని నిర్ణయం తీసుకున్నాను. నాకు సినిమాల్లో అవకాశాలు రాకా కాదు. దర్శకులు నాకు పాత్రలు ఇవ్వకా కాదు. నేను యాక్టింగ్ చేయలేకా కాదు" అని 'బ్రహ్మ ఆనందం' టీజర్ లాంచ్ కార్యక్రమంలో బ్రహ్మానందం చెప్పారు. తన తనయుడు రాజా గౌతమ్‌తో కలసి ఆయన నటించిన చిత్రమిది. ఆర్.వి.ఎస్.నిఖిల్ దర్శకత్వంలో రాహుల్‌యాదవ్ నక్కిన నిర్మించారు. వచ్చే నెల 14న సినిమా విడుదలవుతోంది. గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు.

సంక్రాంతి సినిమా ఫిబ్రవరిలో వస్తోంది



తమిళ అగ్ర నటుడు అజిత్ కుమార్ నటించిన 62వ చిత్రం 'విడాముయర్చి' వచ్చే నెల 6వ తేదీన విడుదల చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించిన మేకర్స్ గురువారం సాయంత్రం ఈ మూవీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. తెలుగులో 'పట్టుదల' పేరుతో రిలీజ్ చేయనున్నారు. మగిళ్ తిరుమేని దర్శకుడు. త్రిష హీరోయిన్. సీనియర్ నటుడు అర్జున్ ప్రతినాయకుడి పాత్రను పోషించగా, రెజీనా కెసాండ్రా మరో ముఖ్య పాత్రలో నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీత స్వరాలు సమకూర్చిన ఈ మూవీని లైకా ప్రొడక్షన్ పతాకంపై ప్రముఖ నిర్మాత సుభాస్కరన్ భారీ బడ్జెట్‌తో నిర్మించారు. ఇక ఈ ట్రైలర్‌లో 'అజిత్, త్రిష ప్రేమని చూపించి, ఆ తర్వాత వీళ్ళకు ఒక సమస్య ఉత్పన్నం కాగా దానిపై హీరో ఎలా పోరాడాడు అన్నది 2 నిమిషాల 22 సెకన్లతో ఈ ట్రైలర్‌ను కట్ చేశారు. హాలీవుడ్ మూవీ 'బ్రేక్‌డౌన్'కు ఇది రీమేక్‌గా చెబుతున్నారు. నిజానికి సంక్రాంతి పండుగకు రిలీజ్ కావాల్సి ఉండగా, హాలీవుడ్ రీమేక్ హక్కులు పొందడంలో తలెత్తిన సమస్యల కారణంగా వాయిదా వేశారన్నది కోలీవుడ్ వర్గాల సమాచారం.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

నిజ జీవిత ఘటనల ఆధారంగా...



అక్షయ్ హీరోగా దినేశ్ బాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'డియర్ కృష్ణ'. మమిత బైజు, ఐశ్వర్య కీలకపాత్రల్లో నటించారు. పి.ఎన్.బలరామ్ నిర్మాత. జనవరి 24న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్, హీరో శ్రీకాంత్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ 'ట్రైలర్‌లోని ప్రతీ షాట్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది' అని అన్నారు. హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ 'ట్రైలర్ చాలా బాగుంది. నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించడం మెచ్చుకోదగ్గ విషయం' అని అన్నారు. కాగా, మొదటి 100 టికెట్ల బుకింగ్‌లో ఒక టికెట్‌ని ఎంపిక చేసి రూ.10,000 క్యాష్ బాక్ బహుమతిగా అందించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.



మా కుటుంబంలో గొడవలు దురదృష్టకరం



తమ కుటుంబంలో గొడవలు జరగడం దురదృష్టకరమని మంచు మనోజ్ అన్నారు. గురువారం చంద్రగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి తన భార్య భూమా మౌనికతో కలసి మనోజ్ వచ్చారు. బుధవారం ఎంబీయూ విద్యాసంస్థల వద్ద జరిగిన ఘటనపై ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సినిమాలకు 8 సంవత్సరాలు దూరంగా ఉన్నానని, ఇప్పటికీ తనకు అభిమానులు ఉండటం దేవుడు ఇచ్చిన వరమన్నారు. తనపై అభిమానంతో ఉన్న వారిని బెదిరించడం దారుణమన్నారు. ఏదైనా ఉంటే తనను పిలిపించి మాట్లాడుకోవాలే గానీ, తన అభిమానులు కట్టిన ఫ్లెక్సీలను తొలగించడం పద్ధతి కాదన్నారు. తన అభిమాని పళణి, వినాయకన్‌ను పిలిచి, తనతో తిరగకూడదని బెదిరించారని, పిలిచి పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకొంటే గొడవలు సద్దుమణుగుతాయన్నారు. ఎంబీయూలో జరిగే క్యాంపస్ గురించి చర్చించుకొంటే సరిపోతుందన్నారు. మంచు విష్ణు అనుచరులైన హేమాద్రి, కిరణ్‌పై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- చంద్రగిరి (ఆంధ్రజ్యోతి)


దబిడి దిబిడి.. కళలో ఓ భాగమే


- ఊర్వశీ రౌతేలా



'బాలకృష్ణ గారు ఓ లెజెండ్. ఆయనతో కలసి పనిచేసే అవకాశం రావడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. ఇదంతా కళలో భాగం. బాలకృష్ణతో డ్యాన్స్ చేయడం కేవలం పెర్ఫామెన్స్ కాదు.. కళపై నాకున్న గౌరవానికి చేసుకున్న వేడుకగా భావిస్తా' అని అన్నారు నటి ఊర్వశీ రౌతేలా. నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో ప్రదర్శితమవుతోంది. ఈ చిత్రంలో బాలకృష్ణ - ఊర్వశీ రౌతేలా 'దబిడి దిబిడి' పాట బాగా పాపులర్ అయ్యింది. అయితే ఇందులో ఓ స్టెప్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. తాజాగా దీనిపై ఊర్వశీ రౌతేలా ఆంగ్ల మీడియాతో మాట్లాడుతూ 'బాలకృష్ణ గారితో పని చేయడం నా కల. ఈ సినిమాతో అది నెరవేరింది. ఆయన ఆర్టిస్టులకు ఎంతో గౌరవం ఇస్తారు. ఒక సినిమా విజయం సాధించినప్పుడు దానిపై భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమవుతాయి. నేను ఈ విషయాన్ని అర్థం చేసుకోగలను' అని అన్నారు. కాగా, ఈ పాట విడుదలైనప్పుడు వచ్చిన ట్రోల్స్‌పై కూడా ఊర్వశీ స్పందించారు. 'జీవితంలో ఏం సాధించలేని కొందరు కష్టపడేవారిని విమర్శించే అర్హత ఉందనుకుంటారు. రియల్ పవర్ అంటే ఇతరులను విమర్శించడం కాదు. వారి గొప్పదనాన్ని ఆదర్శంగా తీసుకోవడం' అని ఓ నెటిజన్‌కు ఘాటుగా బదులిచ్చారు.







రిలయన్స్ లాభం ₹18,540 కోట్లు

రూ.2.43 లక్షల కోట్లకు ఆదాయం

కలిసివచ్చిన జియో టారిఫ్ పెంపు

మళ్లీ పుంజుకున్న ఓ2సీ వ్యాపారం

'రిటైల్' విభాగమూ వృద్ధి పథంలోనే..

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించాయి.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) గాను రిలయన్స్ రూ.18,540 కోట్ల (ఒక్కో షేరుకు రూ.13.70) ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నమోదు చేసిన రూ.17,265 కోట్ల (ఒక్కో షేరుకు రూ. 12.76) లాభంతో పోలిస్తే 7.4% వృద్ధి కనబరిచింది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో ఆర్జించిన రూ.16,563 కోట్ల లాభంతో పోల్చినా గణనీయంగా పెరిగింది. సమీక్షా కాలానికి కంపెనీ నిర్వహణ లాభం వార్షిక ప్రాతిపదికన 8% వృద్ధితో రూ.48,003 కోట్లుగా నమోదైంది. జియో టెలికాం సేవల టారిఫ్‌ల పెంపుతో పాటు చమురు శుద్ధి వ్యాపార మార్జిన్లు పుంజుకోవడం, రిటైల్ వ్యాపారమూ ఆశాజనక వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు దోహదపడింది. కాగా, ఈ క్యూ3లో రిలయన్స్ ఆదాయం రూ.2.43 లక్షల కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే సమయానికి రెవెన్యూ రూ.2.27 లక్షల కోట్లుగా ఉంది. ఈ డిసెంబరు చివరినాటికి కంపెనీ మొత్తం రుణ భారం రూ. 3,50,453 కోట్లుగా నమోదైంది. ఆ సమయానికి కంపెనీ రూ.2,34,988 కోట్ల నగదు, నగదుకు సమానమైన నిల్వలను కలిగి ఉంది. దాంతో కంపెనీ నికర రుణ భారం రూ.1,15,465 కోట్లకు తగ్గింది.

ఓ2సీ

రిలయన్స్‌కు చెందిన ఆయిల్ టు కెమికల్స్ (ఓ2సీ) వ్యాపార విభాగ ఆదాయం ఈ క్యూ3లో 6 శాతం వృద్ధితో రూ.1,49,595 కోట్లకు చేరుకుంది. నిర్వహణ లాభం 2.4 శాతం పెరిగి రూ.14,402 కోట్లుగా నమోదైంది. నిర్వహణ లాభాల మార్జిన్ 9 శాతంగా నమోదైంది. దేశీయంగా బలమైన గిరాకీతో పాటు ఉత్పత్తి పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా దోహదపడింది.

ఆయిల్ అండ్ గ్యాస్

కంపెనీకి చెందిన ముడిచమురు, సహజ వాయువు అన్వేషణ, ఉత్పత్తి విభాగ ఆదాయం ఈ క్యూ3లో 5.2 శాతం తగ్గి రూ.6,370 కోట్లకు జారుకోగా.. నిర్వహణ లాభం 4.1 శాతం తగ్గుదలతో రూ.5,565 కోట్లకు పరిమితమైంది. ఏపీలోని కేజీ బేసిన్ నుంచి గ్యాస్ ఉత్పత్తి తగ్గడం ఇందుకు కారణమైంది.

జియో ప్లాట్‌ఫామ్స్

టెలికాం సంస్థ రిలయన్స్ జియో సహా డిజిటల్ సేవలన్నింటినీ ఒకే గొడుగు కిందికి చేర్చడం ద్వారా ఏర్పాటు చేసిన జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం ఈ క్యూ3లో 26 శాతం వృద్ధి చెంది రూ.6,861 కోట్లకు పెరిగింది. ఆదాయం 19.2 శాతం పెరిగి రూ.38,750 కోట్లకు చేరుకుంది. రిలయన్ జియో టారిఫ్ పెంపు ఇందుకు ప్రధానంగా దోహదపడింది. క్యూ3లో జియోకు ఒక్కో వినియోగదారు నుంచి లభించిన నగటు ఆదాయం (ఆర్పూ) రూ.203.3కు చేరింది. కంపెనీ ఆర్పూ రూ.200 స్థాయిని దాటడం ఇదే తొలి సారి. కాగా, డిసెంబరు చివరినాటికి జియో కస్టమర్ల సంఖ్య 48.2 కోట్లకు పెరిగింది.

రిలయన్స్ రిటైల్

గడిచిన 3 నెలలకు రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10 శాతం వృద్ధితో రూ.3,458 కోట్లకు చేరుకోగా.. స్థూల ఆదాయం 8.7 శాతం పెరిగి రూ.90,333 కోట్లకు ఎగబాకింది. గత త్రైమాసికంలో కొత్తగా 779 స్టోర్లను ప్రారంభించినట్లు, దాంతో మొత్తం విక్రయ కేంద్రాల సంఖ్య 19,102కు చేరుకుందని సంస్థ తెలిపింది.



2025-26లో 20,000 నియామకాలు

ఇన్ఫోసిస్ క్యాంపస్ హైరింగ్ ప్రణాళిక ఇది..

ఈ క్యూ3లో రూ.6,806 కోట్లకు కంపెనీ లాభం

ఆదాయ వృద్ధి అంచనా 4.5-5 శాతానికి పెంపు

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 20,000 మందికి పైగా ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు దేశీయ ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ వెల్లడించింది. కంపెనీ నియామకాల ప్రక్రియ ప్రణాళికకు అనుగుణంగా కొనసాగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో 15,000కు పైగా నియామకాలు చేపట్టనున్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఫ్రెషర్ల హైరింగ్ 20,000కు మించవచ్చ"ని త్రైమాసిక ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ సంఘ్రాజ్కా తెలిపారు. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 5,591 పెరుగుదలతో మొత్తం 3,23,379కి చేరుకుంది. సంస్థలో ఉద్యోగుల సంఖ్య పెరగడం వరుసగా ఇది రెండోసారి. కాగా, క్యూ3లో ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13.7 శాతానికి పెరిగింది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో అట్రిషన్ రేటు 12.9 శాతంగా నమోదైంది.

నికర లాభంలో 11.5 శాతం వృద్ధి

ఈ క్యూ3లో ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 11.46 శాతం వృద్ధి చెంది రూ.6,806 కోట్లకు చేరుకుంది. ఆదాయం 7.58 శాతం పెరిగి రూ.41,764 కోట్లుగా నమోదైంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను కంపెనీ స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను క్యూ2 త్రైమాసిక ఫలితాల సందర్భంగా ప్రకటించిన 3.75-4.5 శాతం నుంచి తాజాగా 4.5-5 శాతానికి పెంచింది. వరుసగా మూడు త్రైమాసికాలగా కంపెనీ ఆదాయ వృద్ధి అంచనాను పెంచుకుంటూ వస్తోంది. నిర్వహణ లాభాల మార్జిన్‌ను మాత్రం గతంలో అంచనా వేసిన 20-22 శాతంగానే కొనసాగించింది. క్యూ3 ఆదాయంలో ఆర్థిక సేవల రంగం నుంచి సమకూరిన వాటా 27.8 శాతంగా ఉండగా.. మాన్యుఫాక్చరింగ్ రంగ వాటా 15.5 శాతంగా నమోదైంది. రిటైల్, ఎనర్జీ రంగాలు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ప్రాంతాలవారీగా చూస్తే.. భారత్, ఐరోపా మార్కెట్ల నుంచి సమకూరిన ఆదాయంలో రెండంకెల వృద్ధి నమోదైంది. కంపెనీకి కీలక మార్కెట్ అయిన ఉత్తర అమెరికా నుంచి ఆదాయం కేవలం 5 శాతం పెరిగింది.

హెచ్1బీ వీసాలపై ఆధారం తగ్గింది..

అమెరికా కొత్త అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక హెచ్1బీ వీసా నిబంధనలను కఠినతరం చేయవచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. అయినప్పటికీ, తమపై పెద్దగా ప్రభావం ఉండబోదని దేశీయ ఐటీ కంపెనీలంటున్నాయి. గడిచిన కొన్నేళ్లలో హెచ్1బీ వీసాలపై ఆధారపడటం గణనీయంగా తగ్గిందని ఇన్ఫోసిస్ సీఎఫ్ఓ జయేశ్ అన్నారు. అన్నిటికంటే ముందుగా, ఆన్‌సైట్‌లో కంపెనీ హెచ్1బీ వీసాపై పనిచేసే వారి నిష్పత్తి గతంలో 30 శాతంగా ఉండగా.. ఇప్పుడది 24 శాతానికి తగ్గిందన్నారు. ప్రస్తుతం అమెరికా ఆన్‌సైట్ ప్రాజెక్టుల్లో హెచ్1బీ ఇండిపెండెంట్ ఉద్యోగుల వాటా 60 శాతానికి మించిందన్నారు.

ఆటో ఎక్స్‌పోలో 100 కొత్త కార్లు విడుదల

నేడే ప్రధాని చేతుల మీదుగా ప్రారంభం

న్యూఢిల్లీ: భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో రెండో ఎడిషన్‌ను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రారంభించనున్నారు. వచ్చే బుధవారం (22వ తేదీ) వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో వివిధ కంపెనీలు 100 కొత్త కార్లను విడుదల చేయవచ్చని అంచనా. ఆటోమొబైల్ తయారీదారుల నుంచి ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, టైర్లు, ఇంధన స్టోరేజీ వ్యవస్థల తయారీదారులు, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, మెటీరియల్ రీసైక్లింగ్ చేసే సంస్థల వరకు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. న్యూఢిల్లీలోని భారత మండపం, ద్వారకలోని యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఢిల్లీ అండ్ ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్‌ల్లో సమాంతరంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. 5,100 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటాయని భావిస్తున్న ఈ ప్రదర్శనను భారత్ సహా ప్రపంచ దేశాలకు చెందిన 5 లక్షల మంది సందర్శించే అవకాశం ఉంది. అలాగే జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, తైవాన్, యూకే పెవిలియన్లుంటాయి.

ప్రపంచ మార్కెట్లోకి సుజుకీ ఈ-విటారా

జపాన్‌కు చెందిన సుజుకీ మోటార్ కార్పొరేషన్ చిన్న విద్యుత్ కార్ల విభాగంలోకి ప్రవేశించనున్నట్లు తెలిపింది. కంపెనీకి చెందిన తొలి విద్యుత్ కారు ఎస్‌యూవీ ఈ-విటారాను ఈ ప్రదర్శన ద్వారా ప్రపంచ మార్కెట్లోకి విడుదల చేయనుంది. ఈ కారు ఉత్పత్తితో సాధించిన అనుభవాన్ని ఆసరా చేసుకుని భారత్‌ను తమ విద్యుత్ కార్ల తయారీ కేంద్రంగా చేయాలనుకుంటున్నట్లు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు. ద్విచక్ర వాహనాల నుంచి కార్ల యజమానులు కావాలనుకుంటున్న వంద కోట్ల మంది జనాభాకు అందుబాటు ధరల్లో చిన్న కార్లు అవసరమన్నారు. అందుకే చిన్న కార్ల విభాగంలో కూడా ఈవీలు తయారుచేయాలన్నది తమ లక్ష్యమని చెప్పారు.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	117	విజయవాడ	131
వరంగల్	117	గుంటూరు	130
కరీంనగర్	117	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	102
కర్నూలు	117	నెల్లూరు	107
విశాఖపట్నం	127	అనంతపురం	107
గోదావరి	131		

మళ్లీ 77,000 పైకి సెన్సెక్స్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ మార్కెట్ వరుసగా మూడో రోజూ లాభపడింది. గురువారం సెన్సెక్స్ 318.74 పాయింట్ల లాభంతో మరోసారి 77,000 పాయింట్ల కన్నా పైన 77,042.82 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.60 పాయింట్ల లాభంతో 23,311.80 వద్ద క్లోజైంది.

21 పైసలు నష్టపోయిన రూపాయి: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మరోసారి క్షీణతను నమోదు చేసింది. డాలర్ మారకంలో 21 పైసలు నష్టపోయి 86.61 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 86.37 డాలర్ల గరిష్ఠ స్థాయిని తాకింది.

భారత్‌పై చైనా 'వాణిజ్య' యుద్ధం

న్యూఢిల్లీ: చైనా.. మన దేశంపై వాణిజ్య యుద్ధం ప్రారంభించింది. మన దేశ ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు (ఈవీ), సౌర విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగించే సోలార్ మాడ్యూల్స్ తయారీకి అవసరమైన కీలక ముడి పదార్థాలు, యంత్రపరికరాల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. దీంతో ఈ రంగాలకు చెందిన కంపెనీలు ముడి పదార్థాలు, యంత్ర పరికరాలు లభించక ప్రత్యామ్నాయాల కోసం చూస్తున్నాయి. తన పెట్టుబడులపై భారత్ విధించిన ఆంక్షలకు ప్రతిగా చైనా ఈ చర్య తీసుకుందని భావిస్తున్నారు. ఈ చర్యలకు బెదిరిపోకుండా జపాన్, దక్షిణ కొరియా దేశాల నుంచి భారత్ ఈ ముడి పదార్థాలు, యంత్రాలు దిగుమతి చేసుకునేందుకు ప్రయత్నించాలని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ సూచించారు.

క్విక్ కామర్స్‌లోకి స్పెన్సర్స్

కోల్‌కతా: ఆర్‌పీ సంజీవ్ గోయెంకా గ్రూప్‌నకు చెందిన స్పెన్సర్స్ రిటైల్ సైతం క్విక్ మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. వ్యాపార వృద్ధితో పాటు మళ్లీ లాభాల బాట పట్టేందుకు జిఫ్పీ పేరుతో క్విక్ కామర్స్ సేవలను తొలుత పశ్చిమ బెంగాల్‌లో ప్రారంభించినట్లు స్పెన్సర్స్ తెలిపింది. కస్టమర్లకు స్పెన్సర్స్ స్టోర్ల నుంచి 20-30 నిమిషాల్లో సరుకులను డెలివరీ చేయనున్నట్లు వెల్లడించింది.

రూపాయల్లో విదేశీ చెల్లింపులకు లైన్ క్లియర్

ముంబై: విదేశీ చెల్లింపుల లావాదేవీలను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరింత సులభతరం చేసింది. ఇందుకోసం 1999 నాటి విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనలను సవరించింది. దీంతో కొన్ని అంతర్జాతీయ చెల్లింపులు మన రూపాయలు లేదా ఆయా దేశాల కరెన్సీల్లో చెల్లించేందుకు అవకాశం ఏర్పడింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు నేలచూపులు చూస్తున్న సమయంలోనే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం. స్థానిక కరెన్సీల్లో చెల్లింపులను అనుమతించేందుకు ఆర్‌బీఐ ఇప్పటికే యూఏఈ, ఇండోనేషియా, మాల్దీవులతో ఒప్పందాలు కుదుర్చుకుంది. వాణిజ్య లావాదేవీల్లో రూపాయి చెల్లింపులను ప్రోత్సహించేందుకు ఆర్‌బీఐ 2022 జూలైలోనే స్పెషల్ రూపీ వోస్ట్రో అకౌంట్ (ఎస్ఆర్‌వీఏ) పేరుతో ప్రత్యేక ఖాతా తీసుకొచ్చింది. దాంతో అనేక విదేశీ బ్యాంకులు భారత్‌లోని బ్యాంకుల్లో ఈ ఖాతాలు తెరిచాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)			
17వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	500
వరంగల్	472	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		దజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	80,620 ▲	73,900 ▲	1,03,000 ▲
విజయవాడ	81,420 ▲	77,000 ▲	93,000 ▲
విశాఖపట్నం	79,220 ▲	72,620 ▲	93,150 ▲
రాజమండ్రి	80,620 ▲	73,900 ▲	91,600 ▲
ప్రొద్దుటూరు	80,000 ▲	74,170 ▲	93,800 ▲
ముంబై	79,184 ▲	72,533 ▲	91,784 ▲

స్పోర్ట్స్

మెద్వెదెవ్ అవుట్

ఆస్ట్రేలియన్ ఓపెన్



అమెరికా టీనేజర్ లెర్నర్ టీన్ సంచలన విజయం

మూడోరౌండ్లో స్వియటెక్‌తో రదుకాను ఢీ ▸ సిన్నర్, టేలర్ ముందంజ



ఎమ్మా రదుకాను



లెర్నర్

మెల్‌బోర్న్: సాఫీగా సాగుతున్న ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌కు పెద్ద ఝలక్. స్టార్లంతా జోరు ప్రదర్శిస్తున్న వేళ ఐదోసీడ్ డానిల్ మెద్వెదెవ్‌కు షాక్ తగిలింది. అమెరికన్ టీనేజర్, 19 ఏళ్ల లెర్నర్ టీన్ రెండోరౌండ్‌లో నిరుటి రన్నరప్ డానిల్‌ను కంగుతినిపించాడు. ఇక మహిళల 2వ సీడ్ ఇగా స్వియటెక్, 4వ సీడ్ పోలిని, 6వ సీడ్ రిబకినా, 2021 యూఎస్ ఓపెన్ విజేత ఎమ్మా రదుకాను మూడో రౌండ్‌లో ప్రవేశించారు.

డానిల్ ఐదు సెట్లు పోరాడినా..: గత ఏడాదేకాదు.. 2021, 2022లోనూ మెల్‌బోర్న్ పార్క్‌లో ఫైనల్లో భంగపడిన మెద్వెదెవ్(రష్యా) ఈసారి ఎలాగైనా టైటిల్ దక్కించుకోవాలన్న పట్టుదలతో బరిలో దిగాడు. కానీ గురువారం జరిగిన దాదాపు ఐదు గంటల పోరులో క్వాలిఫయర్ లెర్నర్ 6-3, 7-6 (4), 6-7 (10), 1-6, 7-6 (7)తో 28 ఏళ్ల మెద్వెదెవ్‌కు షాకిచ్చాడు. ఈ క్రమంలో 1990లో సంప్రాస్ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో పిన్న వయస్సులో మూడోరౌండ్ చేరిన అమెరికన్‌గా లెర్నర్ రికార్డు సృష్టించాడు. టాప్‌సీడ్ సిన్నర్ 4-6, 6-4, 6-1, 6-3తో ట్రిస్టాన్‌ను, ఫ్రిట్జ్ 6-2, 6-1, 6-0తో క్రిస్టియన్‌ను, డిమినార్ 6-2, 6-4, 6-3తో బోయర్‌ను, 13వ సీడ్ హోల్గర్ రూన్ 7-6, (3), 2-6, 6-3, 7-6 (6)తో బెరెటినిని ఓడించి మూడో రౌండ్‌లో అడుగుపెట్టారు.

ఎమ్మాతో ఇగా పోరు: మహిళల ఫేవరెట్ ఇగా స్వియటెక్ 6-0, 6-2తో రెబెకా స్రంకోవాపై గెలిచింది. తదుపరి రౌండ్‌లో ఎమ్మా రదుకానుతో స్వియటెక్ తలపడుతుంది. 22 ఏళ్ల బ్రిటన్ ప్లేయర్ రదుకాను 6-3, 7-5తో అమందాపై గెలిచింది. 4వ సీడ్ పోలిని 6-2, 6-3తో రెనటాపై, 6వ సీడ్ రిబకినా 6-0, 6-3తో జోవిక్‌పై, 8వ సీడ్ ఎమ్మా నవారో 6-3, 3-6, 6-4తో వాంగ్ షియుపై, 9వ సీడ్ కసట్కినా 6-2, 6-0తో యఫాన్‌పై, కొలిన్స్ 7-6 (4), 4-6, 6-2తో అయావాపై నెగ్గారు.

బాలాజీ జోడీ శుభారంభం: పురుషుల డబుల్స్‌లో భారత్‌కు చెందిన శ్రీరామ్ బాలాజీ జోడీ/మిగ్వెల్ ఆంజెల్ (మెక్సికో) ద్వయం 6-4, 6-3తో డచ్, కజక్ జంట రాబిన్/అలెగ్జాండర్‌పై గెలుపొందింది.

క్వార్టర్స్‌కు కిరణ్, సింధు





▸ డబుల్స్‌లో సాత్విక్ జోడీ

▸ ఇండియా ఓపెన్

న్యూఢిల్లీ: స్టార్ షట్లర్ పీవీ సింధు, యువ ఆటగాడు కిరణ్ జార్జ్ సొంతగడ్డపై జరుగుతున్న ఇండియా ఓపెన్‌లో అదరగొడుతున్నారు. సింగిల్స్‌లో వీరు క్వార్టర్‌ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. ఇక, పురుషుల డబుల్స్‌లో భారత ఏస్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ షెట్టి కూడా ప్రీక్వార్టర్స్‌ను అధిగమించారు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సింధు 21-15, 21-13తో మనామి సుయిజు (జపాన్)ను చిత్తుచేయగా.. కిరణ్ 22-20, 21-13తో అలెక్స్ లేనియర్ (ఫ్రాన్స్)పై గెలిచాడు. హోరాహోరీగా సాగిన పురుషుల డబుల్స్ పోరులో 2022 విజేత సాత్విక్/చిరాగ్ ద్వయం 20-22, 21-14, 21-16తో జపాన్ జంట మిత్సుహషి/ఒకమురను ఓడించింది. మహిళల డబుల్స్‌లో భారత జోడీ అశ్విని పొన్నప్ప/తనీషా 9-21, 21-23తో జపాన్ ద్వయం మత్సుమొటొ/ఫకషిమ చేతిలో, అశ్విని భట్/శిఖా గౌతమ్ జంట 7-21, 10-21తో చైనా జోడీ యాన్ లి/గ్జు లూవో చేతిలో ఓడారు. క్వార్టర్స్‌లో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియాతో సింధు, హాంగ్ యాంగ్ (చైనా)తో కిరణ్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

బరిలో గుకేష్, అర్జున్, హరికృష్ణ

నేటినుంచి టాటా చెస్

విక్‌ఆన్ జీ (నెదర్లాండ్స్): భారత గ్రాండ్‌మాస్టర్ గుకేష్ ప్రపంచ చాంపియన్‌షిప్ దక్కించుకున్నాక తొలి టోర్నమెంట్‌కు సిద్ధమయ్యాడు. శుక్రవారం నుంచి ఇక్కడ జరిగే ప్రతిష్ఠాత్మక టాటా స్టీల్ చెస్ టోర్నీ బరిలో దిగుతున్నాడు. గత డిసెంబరులో సింగపూర్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఫైనల్లో డింగ్ లిరెన్‌ను ఓడించి గుకేష్ విశ్వవిజేతగా నిలిచాడు. తదనంతరం న్యూయార్క్‌లో జరిగిన వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌కు అతడు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. ఇక, టాటా స్టీల్ చెస్‌లో గుకేష్‌తో పాటు మాస్టర్స్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్లు అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద, హరికృష్ణ తలపడుతున్నారు. చాలెంజర్స్ విభాగంలో గ్రాండ్‌మాస్టర్లు విభాగంలో వైశాలీ, దివ్యా దేశ్‌ముఖ్ పోటీలో ఉన్నారు.

వచ్చేనెల 14 నుంచి డబ్ల్యూపీఎల్

న్యూఢిల్లీ: మూడో అంచె మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) షెడ్యూల్‌ను బీసీసీఐ గురువారం ప్రకటించింది. వచ్చేనెల 14న లీగ్ మొదలవనుంది. బరోడా, బెంగళూరు, ముంబై, లఖ్‌నవూ స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. బరోడాలో జరిగే ఆరంభ పోరులో డిఫెండింగ్ చాంప్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ తలపడనుంది. మార్చి 15న ఫైనల్ జరగనుంది. లీగ్‌లో చివరి 2 మ్యాచ్‌లతో పాటు ఎలిమినేటర్ (మార్చి 13న), ఫైనల్ పోరుకు ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియం ఆతిథ్యమివ్వనుంది. గుజరాత్, బెంగళూరుతో పాటు ముంబై ఇండియన్స్, యూపీ వారియర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ టోర్నీలో పోటీపడుతున్న జట్లు.

'హజారే' టైటిల్‌పోరుకు విదర్భ

వడోదర: విజయ్ హజారే ట్రోఫీలో విదర్భ జట్టు ఫైనల్ చేరింది. గురువారం ఇక్కడ జరిగిన రెండో సెమీఫైనల్లో విదర్భ 69 పరుగుల తేడాతో మహారాష్ట్రను ఓడించింది. శనివారం జరిగే టైటిల్ పోరులో కర్ణాటకతో విదర్భ తలపడనుంది. ఇక, మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ.. ఓపెనర్లు ధ్రువ్ షోరే (114), యష్ రాథోడ్ (116) సూపర్ సెంచరీలకు తోడు టాపార్డర్ బ్యాటర్లు కరుణ్ నాయర్ (88 నాటౌట్), జితేష్ శర్మ (51) మెరుపు ఇన్నింగ్స్‌తో సత్తా చాటడంతో 50 ఓవర్లలో 3 వికెట్లకు 380 పరుగుల భారీస్కోరు చేసింది. ఛేదనలో మహారాష్ట్ర.. ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (90), మిడిలార్డర్‌లో అంకిత్ బావ్నే (50) అర్ధసెంచరీలతో పోరాడినా 50 ఓవర్లలో 311/7 స్కోరుకే పరిమితమై ఓటమిపాలైంది. విదర్భ బౌలర్లలో దర్శన్, నచికేత్ చెరో మూడు వికెట్లు తీశారు.

ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ భారత్ కెప్టెన్ సచిన్

ముంబై: మాజీ స్టార్లు పోటీపడుతున్న ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో భారత జట్టుకు క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సారథ్యం వహించనున్నాడు. సునీల్ గవాస్కర్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న ఈ టోర్నీ వచ్చేనెల 22 నుంచి మార్చి 16 వరకు భారత్ వేదికగా జరగనుంది.

తిరుగులేని భారత్

విజయాలతో గ్రూప్ దశ ముగింపు ▸ నేడు క్వార్టర్ ఫైనల్స్

పురుషులు శ్రీలంకతో, మహిళలు బంగ్లాదేశ్‌తో ఢీ



ఖోఖో వరల్డ్ కప్

న్యూఢిల్లీ: ఆతిథ్య భారత్ ఖోఖో ప్రపంచ కప్‌లో అప్రతిహత విజయాలతో అదరగొడుతోంది. పురుషులు, మహిళల జట్లు ఇప్పటికే క్వార్టర్‌ఫైనల్లో చోటు దక్కించుకోగా..విజయాలతో గ్రూపు మ్యాచ్‌లను ముగించాయి. గ్రూప్-ఎలో తలపడుతున్న మహిళల జట్టు గురువారం జరిగిన ఆఖరి పోరులో 100-20 పాయింట్ల తేడాతో మలేసియాను చిత్తు చేసింది. ఇరాన్, మలేసియా, దక్షిణ కొరియాతో కూడిన గ్రూప్-ఎలో మన మహిళలు అగ్రస్థానంలో నిలిచారు. శుక్రవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో బంగ్లాదేశ్ అమ్మాయిలతో మనోళ్లు తలపడతారు. ఇక.పురుషుల విభాగంలోనూ భారత జట్టు తిరుగులేని ప్రదర్శన చేసింది. గ్రూప్-ఎ చివరి మ్యాచ్‌లో 71-34 పాయింట్ల తేడాతో భూటాన్‌పై గెలుపొందింది. బ్రెజిల్, పెరూ, నేపాల్, భూటాన్‌తో కూడిన గ్రూప్‌లో భారత్ టాప్‌లో నిలిచింది. క్వార్టర్‌ఫైనల్లో శ్రీలంక జట్టును భారత పురుషులు ఎదుర్కొంటారు.

బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు బ్యాటింగ్ కోచ్‌గా సితాన్షు కోటక్‌ను నియమించారు. ఇంగ్లండ్‌తో జరుగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం ఈ ఎంపిక జరిగింది. 2019 నుంచి తను జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లో సేవలందిస్తున్నాడు. అలాగే అనేకసార్లు భారత్ 'ఎ' జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు. ఈనెల 22 నుంచి జరిగే ఐదు టీ20ల సిరీస్ కోసం కోటక్ 18న భారత శిబిరంలో చేరనున్నాడు. ప్రస్తుతం ప్రధాన కోచ్‌గా ఉన్న గంభీర్‌కు కోటక్ ఐదో సహాయక కోచ్ కానున్నాడు. ఇప్పటికే అభిషేక్ నాయర్, డస్కటే అసిస్టెంట్ కోచ్‌లుగా ఉండగా, మోర్కెల్ బౌలింగ్ కోచ్, దిలీప్ ఫీల్డింగ్ కోచ్‌లుగా ఉన్నారు. ఆసీస్ టూర్‌లో భారత టెస్టు జట్టు వైఫల్యంపై గత వారం సమీక్ష జరిగింది. ఇందులో గంభీర్ తమకు స్పెషలిస్ట్ బ్యాటింగ్ కోచ్ అవసరం ఉందని బోర్డుకు తెలిపినట్టు సమాచారం.

బీసీసీఐ అంబుడ్స్‌మన్‌గా జస్టిస్ అరుణ్ మిశ్రా: సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణ్ మిశ్రాను బీసీసీఐ అంబుడ్స్‌మన్‌గా నియమించారు. అలాగే ఆయన బోర్డు ఎథిక్స్ అధికారిగా కూడా వ్యవహరించనున్నారు. ఆరేళ్లపాటు అత్యున్నత కోర్టు జడ్జిగా కొనసాగిన మిశ్రా.. ఆ తర్వాత మూడేళ్లు జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా ఉన్నారు.

ఇంగ్లండ్ టూర్‌లో మూడు ప్రాక్టీస్ మ్యాచ్‌లు

వరుసగా న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల చేతిలో భారత జట్టు టెస్టు సిరీస్‌లను కోల్పోయి విమర్శలపాలైంది. ఇక ఐపీఎల్ ముగిశాక 5 టెస్టుల సిరీస్ కోసం టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. జూన్ 20న మొదలయ్యే ఈ సుదీర్ఘ సిరీస్‌కు పక్కా వ్యూహంతో బరిలోకి దిగాలని బీసీసీఐ భావిస్తోంది. ఈనేపథ్యంలో ఇంగ్లండ్ లయన్స్‌తో 3 ప్రాక్టీస్ మ్యాచ్‌లను ఆడించాలనుకుంటోంది. నాలుగేసి రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌ల ద్వారా భారత ఆటగాళ్లకు అక్కడి వాతావరణం, పిచ్‌లపై చక్కటి అవగాహన ఏర్పడగలదని బోర్డు భావిస్తోంది. మే 25 తర్వాతే ఆటగాళ్లు ఇంగ్లండ్ వెళతారు. అయితే వామప్ మ్యాచ్‌ల షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది.

ఫ్యామిలీని పక్కనబెట్టండి

క్రికెటర్లపై బీసీసీఐ ఆంక్షలు?



న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో భారత క్రికెట్ జట్టును వరుస ఓటములు వెంటాడుతున్నాయి. స్వదేశంలో కివీస్‌పై వైట్‌వాష్‌తో పాటు ఆసీస్ పర్యటనలో సిరీస్ ఓటమితో అంతటా తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. దీంతో జట్టును గాడిన పెట్టేందుకు బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. దీంట్లో భాగంగా విదేశీ పర్యటనలో క్రికెటర్లు తమ కుటుంబ సభ్యులను వెంట తీసుకురావడంపై ఆంక్షలు విధించనుంది. కోచ్ గంభీర్ ఈ మార్పుల కోసం గట్టిగా పట్టుబట్టినట్టు తెలుస్తోంది. అందుకే కొవిడ్ ముందున్న నిబంధనలను అమల్లోకి తేవాలనుకుంటోంది. ఇప్పటివరకు క్రికెటర్లు సిరీస్ ఆరంభం నుంచి ముగింపు వరకు భార్యా పిల్లలతో గడిపేవారు. కానీ ఇకపై 45 రోజుల పర్యటన ఉంటే కుటుంబ సభ్యులతో రెండు వారాల కంటే ఎక్కువ సమయం గడిపేందుకు ఆటగాళ్లకు అనుమతి ఇవ్వరని సమాచారం. అలాగే టోర్నీ అంతకన్నా తక్కువ రోజుల్లో ముగిస్తే వారం మాత్రమే పర్మిషన్ ఇస్తారు. అంతేకాకుండా జట్టు ఆటగాళ్ల ప్రయాణాలపైనా ఆంక్షలు ఉండబోతున్నాయి. ఆటగాళ్లంతా ఎవరికి వారు కాకుండా టీమ్ బస్‌లోనే వెళ్లాల్సి ఉంటుంది. ప్రత్యేక వంటవారు, హెయిర్‌డ్రెస్సర్లకు అనుమతి ఉండదు. మరోవైపు దేశవాళీ టోర్నీల్లో ఆడని టీమిండియా ఆటగాళ్ల వేతనాల్లో కూడా కోత విధించాలని ఓ సీనియర్ ప్లేయర్ బోర్డుకు సూచించాడని సమాచారం.

ఢిల్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అబద్ధపు హామీలు

» కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ మోసపూరిత హామీలు గుప్పిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఇక్కడ 6 గ్యారెంటీల అమలు లాగే ఢిల్లీ ఎన్నికల హామీలను సీఎం రేవంత్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రూ.15 వేల రైతు భరోసా, మహిళలకు రూ.2,500, వృద్ధులకు రూ.4వేల పింఛన్ వంటి హామీలు ఏమయ్యాయని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. మోసపూరిత హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌ను మహారాష్ట్ర, హరియాణాల్లో అక్కడి ప్రజలు ఓడించారని గుర్తుచేస్తూ, ఢిల్లీలో కూడా అదే జరగబోతోందని జోస్యం చెప్పారు.

23, 24 తేదీల్లో జానపద ఉత్సవం

హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని భాషా సాంస్కృతిక విభాగంతో కలిసి తెలంగాణ ప్రభుత్వం జానపద ఉత్సవం (ఫోక్ ఫెస్టివల్) నిర్వహించనుంది. ఈ నెల 23, 24 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాలను వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ వై.సుధాకర్ రెడ్డి ప్రారంభించనున్నారు. తొలిరోజున నేతాజీ సుభాష్ ఓపెన్ యూనివర్సిటీ ఆచార్యుడు ఎండీ ఇంతియాజ్ అలీ రచించిన జానపద సాహిత్యంపై ప్రదర్శన ఉంటుందని, క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన పాతచిత్ర వర్క్‌షాప్‌ను ప్రముఖ కళాకారుడు రంజిత్ చిత్రకర్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్నాటక ఆచార్యుల పేపర్ ప్రజెంటేషన్లు, మధురై కళాకారుల టప్పటం, కరగతం.. అస్సోం కళాకారులచే బిహూ నృత్యం.. తదితర ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు.

దక్షిణ మధ్య రైల్వే పీసీసీఎంగా ఎన్.రమేశ్



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్(పీసీసీఎం)గా ఎన్. రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రైల్ నిలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ రైల్వేస్ ట్రాఫిక్ సర్వీస్(ఐఆర్‌టీఎస్) 1992 బ్యాచ్‌కి చెందిన రమేశ్ ఇంతకుముందు నైరుతి రైల్వే లో విధులను నిర్వర్తించారు. సైన్స్, లా కోర్సుల్లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన ఆయన.. భారతీయ రైల్వేలో గత 30 ఏళ్లుగా వివిధ హోదాల్లో పని చేశారు. బెంగళూరు డివిజన్‌లో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, రైల్వే మంత్రి (2014-2019) వద్ద సమన్వయ అధికారిగా వ్యవహరించారు.

దోపిడీ వర్గం ఏకమవుతోంది: నారాయణ

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాదం అటకెక్కితే... ప్రపంచ దోపిడీ వర్గం ఒకటవుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ అన్నారు. అమెరికాలో ఎలాన్ మస్క్ వంటి దిగ్గజాలు ట్రంప్‌కు అనుకూలంగా వ్యవహరించడం, తాజాగా హిండెన్‌బర్గ్ పరిశోధన సంస్థను మూసివేస్తున్నట్లు ఆ సంస్థ ప్రకటన చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. ఈ పరిస్థితులన్నీ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక ఆ దేశ మితవాద ఆర్థిక సంస్థలు, భారతదేశంలో ఉన్న అదానీ లాంటి ఆర్థిక సంస్థలు ఒకటవుతాయనే దానికి సంకేతాలని ఆరోపించారు. ఇలాంటి శక్తులకు రాజకీయ బలంగా అమెరికాలో ట్రంప్, భారత్‌లో మోదీలాంటి నేతలుంటారని పేర్కొన్నారు. ఇక అదానీ లంచం కథ కంచికేనని విమర్శించారు.

'శంషాబాద్'లో సులభంగా ఇమిగ్రేషన్

» ఎఫ్‌టీఐ-టీటీపీని వర్చువల్‌గా ప్రారంభించిన అమిత్‌షా

శంషాబాద్ రూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఫాస్ట్‌ట్రాక్ ఇమిగ్రేషన్-ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీఐ-టీటీపీ) అందుబాటులోకి వచ్చింది. దీనిని గురువారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ.. ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఫాస్ట్‌ట్రాక్ ఇమిగ్రేషన్ విధానాన్ని కేంద్రం ప్రారంభించిందన్నారు. దేశంలోని 7 విమానాశ్రయాల్లో ఈ సదుపాయం అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. దేశ పాస్‌పోర్టు కలిగిన వారు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డుదారుల కోసం ఈ సదుపాయాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ఎఫ్‌టీఐ-టీటీపీ కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియకు నెల పట్టవచ్చని, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రయాణికుల కోసం మొత్తం 8 ఎలక్ట్రానిక్ గేట్లను ఏర్పాటు చేశామన్నారు.

బీసీ స్టడీ సర్కిల్‌లో 'ఆర్ఆర్‌బీ' ఉచిత శిక్షణ

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని బీసీ స్టడీ సర్కిళ్లలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, బ్యాకింగ్ నియామకాల కోసం అర్హత గల అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు గురువారం బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 9 వరకు ఆన్‌లైన్‌లో (www.tgbcstudycircle.cag.gov.in) దరఖాస్తులు పంపుకోవాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఫిబ్రవరి 15 నుంచి వంద రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో పొందిన మార్కుల ఆధారంగా, రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం ఎంపిక చేయనున్నట్లు వివరించారు.

పేదల భూములపై మంత్రుల కన్ను: రఘునందన్

చట్టంలోని లొసుగులను అడ్డు పెట్టుకుని కొంతమంది అమాత్యులు హైదరాబాద్, రింగ్‌రోడ్డు చుట్టూ ఎక్కడ ఖాళీ జాగా ఉంటే అక్కడ పాగా వేస్తున్నారని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. పేదలను బెదిరించి వారి భూములు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రింగురోడ్డు, ట్రిపుల్ ఆర్ పుణ్యమా అని భూముల ధరలకు రెక్కలు రావడంతో కొందరు మంత్రులు పోలీసులను అడ్డుపెట్టుకుని పేదల భూములు లాక్కుంటున్నారని దుయ్యబట్టారు. భూములను కాపాడేందుకు చట్టం తెచ్చామంటూ చెప్పుకొనే మంత్రులే కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అడ్డువచ్చిన న్యాయవాదులు, గిరిజనులపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు.

మూసివేతకు చేరువలో

మంచిర్యాల సిమెంట్ కంపెనీ

» పేరుకుపోతున్న నష్టాలు, అప్పులు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రాష్ట్రంలో మరో సిమెంట్ ఫ్యాక్టరీ మూసివేతకు సిద్ధమవుతోంది. మంచిర్యాల పట్టణ సమీపంలోని మంచిర్యాల సిమెంట్ కంపెనీ (ఎంసీసీ) పీకల్లోతు నష్టాలు, అప్పులతో సతమతమవుతోంది. దీంతో ఫ్యాక్టరీకి అప్పులిచ్చిన ఒక బ్యాంకు తనకు రావాల్సిన రూ.100 కోట్లు రాబట్టుకునేందుకు ఇప్పటికే అనేక సార్లు వేలం పెట్టింది. అయితే ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎలాగోలా నెట్టుకొస్తోంది. హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారి మీద మంచిర్యాల పట్టణానికి చేరువలో 350 ఎకరాల్లో 1958లో రోజుకు 1,000 టన్నుల సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యంతో అసోసియేటెడ్ సిమెంట్ కంపెనీస్ (ఏసీసీ) ఈ ప్లాంటును ఏర్పాటు చేసింది. ఒకప్పుడు దాదాపు 1,000 మంది కార్మికులతో కళకళలాడేది. నాణ్యత బాగుండడంతో ఈ ప్లాంటులో ఉత్పత్తి అయిన సిమెంట్ ఉమ్మడి రాష్ట్రంలో నాగార్జున సాగర్, శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టుల నిర్మాణంలోనూ వినియోగించారు. దేశంలోని వివిధ సముద్రజలాల్లో చమురు, సహజవాయువుల ఉత్పత్తి కోసం తవ్విన బావుల సిమెంటింగ్ కోసం ఈ ప్లాంటు సిమెంట్‌ను ఉపయోగించేవారు. 2000 నుంచి ఎంసీసీ నష్టాల్లో కూరుకుపోయింది. దాంతో 2006లో ఏసీసీ నుంచి కొంతమంది స్థానిక వ్యాపారులు ఈ ప్లాంటును కొన్నారు. వీరి కుమ్ములాటలతో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దిగజారింది.

ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థకు ఏసీబీ నోటీసులు

» ఫార్ములా ఈ కేసులో

రేపు విచారణకు రావాలని పిలుపు

హైదరాబాద్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేస్ ప్రమోటర్‌గా వ్యవహరించిన ఏస్ నెక్స్ట్‌జెన్ సంస్థకు ఏసీబీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 18న విచారణకు హాజరుకావాలని ఏస్ నెక్స్ట్‌జెన్ ప్రతినిధులను కోరింది. ఇప్పటికే మాజీ మంత్రి కేటీఆర్, సీనియర్ ఐఏఎస్ అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ అప్పటి చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ విచారించింది. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, ఫిర్యాదుదారు దాన కిశోర్ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. ఆ అంశాల ఆధారంగా తుది విచారణ ప్రారంభించింది. 2022 అక్టోబరు 25న జరిగిన తొలి త్రైపాక్షిక ఒప్పందంలో ప్రమోటర్‌గా ఉన్న ఏస్ నెక్స్ట్‌జెన్.. ఫార్ములా ఈ సీజన్ 9, 10, 11, 12లకు సంబంధించిన ఖర్చులను భరించాలి. హైదరాబాద్‌లో 2023 ఫిబ్రవరిలో జరిగిన సీజన్9 వ్యయాన్ని భరించింది. 10వ సీజన్ ప్రారంభానికి ముందే రూ.90 కోట్లను మూడు విడతల్లో ఏస్ నెక్స్ట్‌జెన్ చెల్లించాలి. ఆ ఏడాది మే నెలలో 50 శాతం అడ్వాన్స్ మొత్తం ఏస్ నెక్స్ట్‌జెన్ నుంచి ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు వెళ్లాల్సి ఉంది. కానీ, ఒప్పందం నుంచి నెక్స్ట్‌జెన్ తప్పుకొంది. దీంతో పురపాలక శాఖ, ఎఫ్ఈవో మధ్య 2023లో మరో ఒప్పందం జరగ్గా.. తొలి విడతగా సుమారు రూ. 45.71 కోట్లను రెండు విడతలుగా విదేశీ కంపెనీకి హెచ్‌ఎండీఏ నుంచి చెల్లించారు. అయితే, ఏస్ నెక్స్ట్‌జెన్ ఒప్పందం నుంచి ఎందుకు బయటకొచ్చింది? అలా తప్పుకొంటున్నట్లు పురపాలక శాఖకు లిఖితపూర్వకంగా సమాచారం ఇచ్చిందా? మధ్యలో తప్పుకొంటే ప్రమోటర్ కంపెనీ ఎఫ్ఈవోకు చెల్లించాల్సిన పరిహారం సంగతేమిటి? స్పోర్టింగ్‌లో అనుభవం లేని గ్రీన్ కో డైరెక్టర్లు.. ఏస్ నెక్స్ట్‌జెన్ పేరిట హడావుడిగా మూడు కంపెనీలను ఎందుకు రిజిస్ట్రేషన్ చేయించారనే అంశాలపై ఏసీబీ విచారణలో ప్రశ్నలడిగే అవకాశం ఉంది. గ్రీన్ కో డైరెక్టర్లయిన చలమలశెట్టి అనిల్, హరీశ్ కొల్లి ఏసీబీ విచారణకు హాజరవుతున్నారు. కాగా, మాజీ మంత్రి కేటీఆర్‌కు చలమలశెట్టి అనిల్‌కు స్నేహ సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది.

విదేశీ కరెన్సీలో

ఎందుకు చెల్లించారు?

(మొదటిపేజీ తరువాయి)

చెబితేనే హెచ్‌ఎండీఏ నుంచి ఎఫ్ఈఓకు డబ్బు విడుదల చేశామని అధికారులంటున్నారు. మరీ మీరు ఆ విధమైన ఆదేశాలు ఎందుకు ఇచ్చారు? అని ప్రశ్నించారు. ఫార్ములా-ఈ రేసు కేసుకు సంబంధించి కేటీఆర్‌ను ఈడీ అధికారులు గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఆరున్నర వరకు.. దాదాపు ఏడున్నర గంటలు విచారించారు. మధ్యలో కొద్దిసేపు విరామం ఇచ్చారు. ఈడీలోని జాయింట్ డైరెక్టర్ పర్యవేక్షణలో విచారణ కొనసాగింది. ఎక్కువగా హిందీ, ఇంగ్లీష్ భాషల్లో కేటీఆర్‌ను ప్రశ్నించారని, దాదాపు 40 ప్రశ్నలను సంధించినట్లు తెలుస్తోంది.



విచారణ అనంతరం ఈడీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న కేటీఆర్

కొత్త ఆదేశాలు ఎందుకు ఇచ్చారు?

2022 అక్టోబరు 25న జరిగిన త్రైపాక్షిక ఒప్పందం ప్రకారం ప్రమోటర్ కంపెనీ అయిన ఏస్ నెక్స్ట్‌జెన్.. అన్ని సీజన్లకు ఫీజు చెల్లించాల్సి ఉండగా, మీరెందుకు 2023లో కొత్త ఆదేశాలు ఇచ్చారు? హెచ్‌ఎండీఏ జనరల్ నిధుల నుంచి రెండు ఇన్వాయిస్‌లకు సంబంధించిన మొత్తాన్ని క్లియర్ చేస్తూ ప్రొసీడింగ్ ఇచ్చిన నాటి చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి.. మీ ఆదేశాలనే అమలు చేశానని చెప్పారు కదా?' అని ఈడీ అధికారులు ప్రశ్నించగా.. అదంతా అధికారులే చూసుకున్నారని కేటీఆర్ చెప్పినట్లు సమాచారం. నాటి లావాదేవీలకు సంబంధించిన సొమ్ము ఎక్కడికీ పోలేదని, ఎఫ్ఈఓ వద్ద భద్రంగా ఉందని.. ప్రభుత్వం ఆ సొమ్ము తీసుకోకుండా, కక్షసాధింపు కోసమే కేసు పెట్టిందని కేటీఆర్ పేర్కొన్నట్లు తెలిసింది. ఇది తప్పుడు కేసు, ఇందులో పైసా అవినీతి జరగలేదని కేటీఆర్ పలుమార్లు అన్నప్పుడు.. అడిగిన ప్రశ్నకు మాత్రమే జవాబు ఇవ్వండని ఓ దశలో ఈడీ అధికారులు అన్నట్టు సమాచారం. పురపాలక శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా కేటీఆర్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. నిధుల బదిలీకి సంబంధించి మంత్రి హోదాలో కేటీఆర్ ఇచ్చిన ఉత్తర్వులను చూపించి మరీ ప్రశ్నించినట్లు తెలిసింది.

ఈడీకి డాక్యుమెంట్లు ఇచ్చిన కేటీఆర్

ఈడీ విచారణకు హాజరైన కేటీఆర్ అక్కడి అధికారులకు రెండు డాక్యుమెంట్లను ఇచ్చి రసీదు తీసుకున్నట్లు సమాచారం. ఫార్ములా-ఈ కారు రేసుకు సంబంధించి నీల్సన్ సంస్థ రూపొందించిన నివేదికతో పాటు తెలంగాణ ఈవీ పాలసీ-2020కి సంబంధించిన డాక్యుమెంట్లను ఈడీ అధికారులకు కేటీఆర్ అందజేసినట్లు తెలిసింది. కాగా, వ్యక్తిగత బ్యాంకు ఖాతా, ఆస్తుల వివరాలను ఈడీ అధికారులు అడగ్గా, త్వరలోనే వాటిని ఇస్తానని కేటీఆర్ చెప్పారని సమాచారం.

లై డిటెక్టర్ పరీక్షకు రెడీ: కేటీఆర్

రాజ్యాంగాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు సహకరిస్తానని, ఎన్నిసార్లు పిలిచినా వస్తానని.. లై డిటెక్టర్ పరీక్షకు కూడా సిద్ధమని కేటీఆర్ స్పష్టం చేశారు. విచారణ అనంతరం ఈడీ కార్యాలయం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో పైసా అవినీతి జరగలేదని ముందు నుంచి తాను చెబుతున్నానని, అయినా విచారణ పేరిట రూ.కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెడుతున్నారని విమర్శించారు. న్యాయమూర్తుల సమక్షంలో కానీ, రేవంత్ ప్యాలస్‌లో కానీ, మీడియా ముందు అయినా బహిరంగచర్చకు తాను సిద్ధమని, లై డిటెక్టర్ పరీక్షకూ సిద్ధపడతానని తెలిపారు. అలాగే రేవంత్‌రెడ్డి లై డిటెక్టర్ పరీక్షకు రాగలరా ? అని ప్రశ్నించారు. అప్పుడు దొంగ ఎవరో ప్రజలకు తెలుస్తుందన్నారు. రూ.50లక్షలతో దొరికిన రేవంత్ రెడ్డిపై అప్పట్లో ఏసీబీ, ఈడీ కేసులు నమోదయ్యాయని, అవి ఇంకా విచారణలో ఉన్నాయని, తన మీద కేసులున్నాయి కాబట్టే.. నాపైనా ఏసీబీ, ఈడీ కేసులు రేవంత్ రెడ్డి పెట్టించాడని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏసీబీ, ఈడీ.. ఒకే విధమైన ప్రశ్నలను తిప్పి తిప్పి అడిగాయని, పైసా అవినీతి లేనపుడు కేసు ఎక్కడని ప్రశ్నించారు. ఏసీబీ వాళ్లు 80 ప్రశ్నలు అడిగారు, ఈడీ వాళ్లు 40 ప్రశ్నలు అడిగారు. వాటికి సమాధానం ఇచ్చానని తెలిపారు. అంతిమంగా న్యాయం, ధర్మం, నిజాయితీ గెలుస్తాయని కేటీఆర్ చెప్పారు. సీఎం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి తమ నేతల మీద అక్రమ కేసు పెట్టి దృష్టి మళ్లించే రాజకీయాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ నేత ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియాతో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి పగలంతా కాంగ్రెస్‌లో ఉండి రాత్రయితే బీజేపీ పెద్దలతో కలిసిపోతున్నారని ఎద్దేవా చేశారు.



ఈడీ విచారణకు వెళుతున్న కేటీఆర్

ఇదీ అసలు కేసు..

కేటీఆర్ తదితరులపై ఏసీబీ గత నెలలో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన నేపథ్యంలో, ఆ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు (ఈసీఐఆర్) నమోదు చేశారు. కేటీఆర్ తదితరులపై మనీలాండరింగ్ నిరోధక చట్టం, విదేశీ మారకద్రవ్యం నిర్వహణ చట్టం (ఫెమా) కింద ఈడీ అధికారులు దర్యాప్తు జరుపుతున్నారు. హెచ్‌ఎండీఏ జనరల్ ఖాతా నుంచి విదేశీ కంపెనీ ఎఫ్ఈఓకు రెండు విడతలుగా రూ.45.71 కోట్ల మొత్తాన్ని విదేశీ కరెన్సీ (బ్రిటన్ పౌండ్ల) రూపంలో చెల్లించారు. విదేశీ కరెన్సీలో చెల్లింపులు చేయడం వల్ల ఆదాయపు పన్నుకు అదనంగా రూ.8.1 కోట్లు హెచ్‌ఎండీఏ చెల్లించాల్సి వచ్చింది. ఇతరత్రా వ్యయాలను కూడా పరిగణిస్తే.. మొత్తంగా, కేటీఆర్ తదితరులు తీసుకున్న నిర్ణయం వల్ల హెచ్‌ఎండీఏ నుంచి రూ.56 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని కేసు నమోదైంది.

ఈడీ ఆఫీసుకు బీఆర్ఎస్ శ్రేణులు

ఈడీ విచారణకు కేటీఆర్ హాజరైన నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఈడీ కార్యాలయం వద్దకు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వారిలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, దాసోజు శ్రవణ్, క్రిశాంక్ తదితరులున్నారు. శ్రవణ్, క్రిశాంక్ మీడియాతో మాట్లాడున్న సమయంలో.. పోలీసులు క్రిశాంక్‌ను అరెస్టు చేసారు. బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు చెదరగొట్టారు. సాయంత్రం నుంచి బీఆర్ఎస్ శ్రేణుల్లో కొంత ఆందోళన కనిపించింది. కేటీఆర్‌ను అరెస్టు చేసే అవకాశముందనే పుకార్లు వ్యాపించడంతో ఏం జరుగుతుందోనన్న టెన్షన్‌లో కనిపించారు. సాయంత్రం ఆరున్నర సమయంలో కేటీఆర్ బయటకు రావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈడీ కార్యాలయం గేటు లోపలికి మీడియాను కూడా అనుమతించకుండా పోలీసులు గేట్లు మూసివేశారు.

కేటీఆర్.. జైలుకు ఇవి తీసుకెళ్లండి

» 4 జతల దుస్తులు, దుప్పటి పట్టుకెళ్లండి

» క్లీన్ ఇమేజ్ కొనసాగించడానికి సబ్బు అవసరం

» మాజీ మంత్రిని ఉద్దేశించి ఎమ్మెల్యే రాజాసింగ్ ట్వీట్



హైదరాబాద్ సిటీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): "కర్మ ఎవరినీ వదిలిపెట్టదు. ఎవరినీ మర్చిపోదు. సరైన సమయం కోసం వేచిచూస్తుంది" అని ఎమ్మెల్యే రాజాసింగ్ మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి ట్వీట్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు తనపై తప్పుడు కేసులు పెట్టి గతంలో జైలుకు పంపాయని పేర్కొన్నారు. ఇతరులే లక్ష్యంగా అధికారాన్ని దుర్వినియోగం చేసేవారు చివరకు అనుభవించక తప్పదన్నారు. "కేటీఆర్ జీ.. జైలుకెళ్లే ముందు సర్దుకోవాల్సిన వస్తువులతో చిన్న చెక్ లిస్ట్ పెడుతున్నా. కటకటాల వెనుక ఆధునికంగా ఉండాలి కదా? అందుకు 4 జతల దుస్తులు తీసుకెళ్లండి. జైల్లో హాయిగా ఉండదు కాబట్టి దుప్పటి, పరిశుభ్రత ముఖ్యం కనుక టవల్ పట్టుకెళ్లండి. నన్ను నమ్మండి.. భావోద్వేగాలు ఉప్పొంగుతాయి. దానికోసం రుమాలు ఉంచుకోండి. క్లీన్ ఇమేజ్ కొనసాగించడానికి సబ్బు అవసరం. జైలు భోజనం ఫైవ్‌స్టార్ కాదు. అందుకని ప్యాకెట్ ఊరగాయ, చలికాలంలో వెచ్చదనం కోసం స్వెటర్ మర్చిపోవద్దు" అంటూ రాజాసింగ్ పోస్ట్ చేశారు.



తాత కేసీఆర్‌తో కలిసి.. హిమాన్షు పొలం పనులు

సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలోమాజీ సీఎం కేసీఆర్‌తో కలిసి ఆయన మనవడు హిమాన్షురావు పొలం పనులు చేశారు. తాత కేసీఆర్ సూచనలతో తానే మట్టి తీసి.. ఓ మొక్కను నాటారు. ఆ వీడియోను తన ఎక్స్ ఖాతాలో హిమాన్షు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా 'ఉత్తముల నుంచి నేర్చుకోవడం' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడానికి అడవుల పెంపకం చాలా అవసరం అని, సహజ వనరులను రక్షించడం, సంరక్షించడం మన బాధ్యత అని హిమాన్షు పేర్కొన్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్/మర్కుక్

కేటీఆర్.. మహా డ్రామారావు!

» ప్రజాధనంతో దోస్తులను కాపాడుకున్నారు: చామల

» కౌశిక్‌రెడ్డీ.. బట్టలూడదీసి కొడ్తాం జాగ్రత్త: మెట్టు సాయి

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రజాధనంతో దోస్తులను కాపాడుకున్న ఘనత మాజీ మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. కేటీ రామారావు కాదు.. ఆయన మహాడ్రామారావు అంటూ మండిపడ్డారు. ఒక యువరాజులాగా వ్యవహరిస్తూ ప్రజాధనాన్ని దోస్తులకు దోచిపెట్టడం కోసమే ఫార్ములా ఈ-రేస్ నిర్వహించినట్టుగా ప్రజలందరికీ తెలుసని ఓ ప్రకటన చేశారు. ఏస్ నెక్స్ట్ జనరేషన్స్ గ్రీన్‌కో కేటీఆర్‌కు అత్యంత దగ్గర మిత్రులదేనన్నారు. గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్ మాట్లాడుతూ.. కేటీఆర్ ఇప్పటికైనా తనపై వస్తున్న ఆరోపణలను వాస్తవం కాదని నిరూపించుకోవాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మత్స్య కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ హెచ్చరించారు. అవాకులు చెవాకులు పేలుతున్న కౌశిక్‌రెడ్డిని బట్టలూడదీసి కొడతామన్నారు. గల్లీలో టిక్ టాక్ చేసేవాళ్లు చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని, యువత సాగుపై దృష్టి సారించాలని రైతు కమిషన్ సభ్యురాలు భవానీరెడ్డి సూచించారు. కాగా, సభ్యత్వ నమోదులో తెలంగాణ మహిళా కాంగ్రెస్ రికార్డు సాధించిందని.. అన్ని రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని ఆ శాఖ అధ్యక్షురాలు సునీతారావు తెలిపారు. పార్టీ పట్ల అంకిత భావం, కష్టించి పని చేసేవారికే పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవుల్లోనూ నియమించాలని సీఎం రేవంత్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌లకు వినతిపత్రం సమర్పించనున్నట్టు చెప్పారు. మహిళా నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో సముచిత స్థానం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు.

సాగు చేయని భూములపై సర్వే షురూ!

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న అధికారులు

» సర్వే నంబర్ల వారీగా వివరాల నమోదు

» ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల స్వీకరణ

» పలు జిల్లాల్లో వ్యవసాయేతర స్థలాల గుర్తింపు

హైదరాబాద్, నెట్‌వర్క్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగు చేయని భూములను గుర్తించేందుకు గురువారం సర్వే మొదలైంది. గ్రామ స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు భూములను పరిశీలిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. రైతులు, సర్వే నంబర్లు, బై నంబర్ల వివరాల ఆధారంగా సర్వే నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న స్థలాల్లో.. పంటలు సాగుచేస్తున్నారా..? లేదా..? ఇతర వ్యాపార సముదాయాలు నిర్మించారా..? ఇళ్లు ఉన్నాయా..? కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలు ఉన్నాయా..? స్థిరాస్తి వెంచర్లు చేశారా..? అనే వివరాలను పరిశీలిస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ లే-ఔట్లకు సంబంధించిన భూములను పరిశీలించారు. సాగు చేయని భూములపై అధికారులకు ఫిర్యాదులు వస్తే స్వీకరించారు. గద్వాల జిల్లాలోని 13 మండలాల్లో 52 బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. ఈ జిల్లాలో ఇది వరకు 4,51,746 ఎకరాలకు రైతుబంధు పంపిణీ చేశారు. కానీ పంటల సాగు విస్తీర్ణం 4 లక్షల 7 వేల ఎకరాలు మాత్రమే ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. వనపర్తి జిల్లాలో ధరణి రికార్డుల్లో పలుమార్లు భూములు మార్పిడి కావటంతో.. వ్యవసాయేతర భూములను గుర్తించటం ఇబ్బందికరంగా మారిందని అధికారులు చెబుతున్నారు. స్థిరాస్తి వెంచర్లు, రైస్‌మిల్లులు, ప్రభుత్వం సేకరించిన భూములు కూడా వ్యవసాయ భూముల జాబితాలో ఉన్నట్లు గుర్తించారు. నారాయణపేట జిల్లాలో 51 బృందాలు సర్వే చేస్తున్నాయి. ఇటుక బట్టీలు పెట్టిన సాగు భూములు, గోదాంలు నిర్మించిన భూముల వివరాలను అధికారులు సేకరించారు. మెదక్ జిల్లాలో నీటిపారుదల శాఖ కాలువల నిర్మాణానికి సేకరించిన భూములను కొన్నిచోట్ల గుర్తించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో అధికారుల బృందాలు సర్వే చేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హన్మకొండ జిల్లాలో 67 క్లస్టర్లు, వరంగల్ జిల్లాలో 70 క్లస్టర్లు, ములుగులో 52 క్లస్టర్లు, భూపాలపల్లిలో 65 క్లస్టర్లు, మహబూబాబాద్‌లో 82 క్లస్టర్లు, జనగామలో 69 క్లస్టర్లను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయి సర్వే చేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో 30 వేల నుంచి 40 వేల ఎకరాల్లో సాగు చేయని భూములు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. 41 వేల మంది రైతుల పేర్లపై ఉన్న భూముల వివరాలపై సర్వే చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో 440 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. 102 క్లస్టర్లుగా విభజించి సర్వే చేస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో 104 క్లస్టర్లను ఏర్పాటుచేసి సర్వే చేస్తున్నారు. 5.22 లక్షల ఎకరాల భూమి సాగు రికార్డుల్లో ఉండగా.. పంటలు వేయని భూముల వివరాలు సేకరిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 102 క్లస్టర్లలో సర్వే మొదలైంది. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు ఆర్వోఆర్ పట్టాలు ఇచ్చినందున వాటి వివరాలు కూడా సేకరిస్తున్నారు. నిర్మల్ జిల్లాలో 79 క్లస్టర్లుగా విభజించి సర్వే చేస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,168 రెవెన్యూ గ్రామాలుండగా.. 394 క్లస్టర్లుగా విభజించి సర్వే మొదలుపెట్టారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో 1,077 బృందాలు సర్వేలో పాల్గొన్నాయి. అశ్వారావుపేట మండలం ఆసుపాకలో 21 మందికి సంబంధించిన 20 ఎకరాల్లో పంటలు సాగుచేయటం లేదని గుర్తించారు. కొత్తగూడెం జిల్లాలో తొలి రోజు 98 గ్రామాల్లో సర్వే పూర్తి చేశారు. ఖమ్మం జిల్లాలో కూసుమంచి, సత్తుపల్లి, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, చింతకాని, కొణిజర్ల, మండలాల్లో స్థిరాస్తి వెంచర్లుగా మారిన కొన్ని భూములను గుర్తించారు.

ఫిరాయింపులపై సుప్రీంకు బీఆర్ఎస్

» పార్టీ మారిన పది మందిపై 4 వారాల్లో నిర్ణయం తీసుకునేలా స్పీకర్‌ను ఆదేశించాలని పిటిషన్లు

» కడియం, దానం, తెల్లంలపై ఎస్ఎల్‌పీ దాఖలు

» మిగిలిన ఏడుగురికి వ్యతిరేకంగా రిట్ పిటిషన్

న్యూఢిల్లీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో తమ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకునేలా అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలివ్వాలని కోరుతూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ పార్టీ తరఫున న్యాయవాది మోహిత్‌రావు ఈ మేరకు పిటిషన్లను దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్‌లపై రిట్ పిటిషన్, కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావ్‌లపై స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్పీ)ను వేసింది. ఎస్ఎల్పీలో హైకోర్టు ఆదేశాలు, ఫిరాయింపులపై స్పీకర్‌కు చేసిన ఫిర్యాదులు, ఇతర అంశాలను జత చేశారు. రిట్ పిటిషన్‌లో.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసి 9 నెలలైనా ఏ చర్యలూ తీసుకోలేదని ప్రస్తావించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు వచ్చి 6 నెలలు గడుస్తున్నా స్పీకర్ ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదని.. కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. ఫిరాయింపులకు సంబంధించి గతంలో కేశం మేఘాచంద్ర కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని బీఆర్ఎస్ కోరింది. పార్టీ మారిన 10 మందిపై 4 వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకునేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అనర్హతపై స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శికి సూచించాలని కోరింది. కాగా, ఎమ్మెల్యేల ఫిరాయింపులపై సుప్రీంకోర్టులో పిటిషన్ల దాఖలుకు మాజీ మంత్రి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారమే ఢిల్లీ వచ్చారు. పిటిషన్లపై న్యాయవాదులతో చర్చించారు.

హైదరాబాద్‌లో మెగా వ్యవసాయ మార్కెట్

» 2వేల కోట్లతో నిర్మాణం.. త్వరలో శంకుస్థాపన: తుమ్మల



ఖమ్మం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): హైదరాబాద్ సమీపంలోని కొహెడలో రూ.2వేల కోట్లతో 400 ఎకరాల్లో ప్రపంచ స్థాయి మెగా వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈ మార్కెట్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఖమ్మంలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదానికి గురైన పత్తి మార్కెట్‌ను గురువారం మంత్రి తుమ్మల సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్ నిజామాబాద్‌తో పాటు ఇతర వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, రాష్ట్రానికి పసుపుబోర్డు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపితే ఎంపీ అరవింద్‌కు అభ్యంతరం ఏవిటో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

23న కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు స్థల పరిశీలన

కొత్తగూడెం: కొత్తగూడెంలో విమానాశ్రయ స్థల పరిశీలన కోసం ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం (ఏఏఐ) ఈ నెల 23న రానుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మంత్రి తుమ్మల ఫోన్‌లో మాట్లాడుతూ.. కేంద్ర బృందం పర్యటన కోసం చర్యలు తీసుకోవాలని కోరగా ఈ నెల 23న జిల్లాకు బృందాన్ని పంపించేలా చర్యలు తీసుకుంటానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

గురుకులాల భోజనం అమ్మ వంటను గుర్తుచేయాలి

» విద్యకు తొలి ప్రాధాన్యం: మంత్రి సీతక్క

దిల్‌సుఖ్‌నగర్, జనవరి16(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి సీతక్క చెప్పారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని తెలంగాణ సంక్షేమ రెసిడెన్సియల్ గురుకుల విద్యాలయంలో గురువారం నిర్వహించిన సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. గురుకులాల్లో పదేళ్లుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కొందరి రాజకీయ స్వార్థానికి ఉపాధ్యాయులు సమిధలుగా మారవద్దని సూచించారు. గురుకులాల వసతి గృహాల్లో అందిస్తున్న భోజనం అమ్మ చేతి వంటను గుర్తుకు చేసేలా ఉండాలన్నారు. కలుషిత ఆహార ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

కొడంగల్, షాద్‌నగర్‌లో 2.31కోట్లతో పనులు

హైదరాబాద్ సిటీ, జనవరి16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్, కోస్గి మునిసిపాలిటీలతో పాటు షాద్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని జంక్షన్లను అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కొడంగల్, కోస్గి మునిసిపాలిటీల పరిధిలో జంక్షన్లను రూ.1.07కోట్లతో అభివృద్ధి చేయడానికి హెచ్ఎండీఏ టెండర్లను ఆహ్వానించింది. ఇందులో గ్రీనరీ పనులతో పాటు హైమాస్ట్ విద్యుత్ లైట్ల పనులు సైతం చేపట్టనున్నారు. అదేవిధంగా పరిగి జంక్షన్ నుంచి షాద్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని అన్నారం వై జంక్షన్ వరకు రూ.1.24కోట్లతో 40 కిలోమీటర్ల మేరవిద్యుద్దీపాలు అమర్చనున్నారు.

ఏపీ, తెలంగాణ ఇంజనీర్ల 'పరస్పర' బదిలీలు

అమరావతి, జనవరి 16(ఆంధ్రజ్యోతి) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన జల వనరుల శాఖ ఏఈఈ, డీఈఈలు పదేసి మంది చొప్పున పరస్పర అంగీకారంతో బదిలీలకు రాష్ట్ర జల వనరుల శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర జల వనరుల శాఖకు చెందిన పది మంది ఇంజనీరింగ్ అధికారులను తెలంగాణకు రిలీవ్ చేస్తూ .. తెలంగాణ నుంచి పది మంది ఇంజనీర్లు ఏపీలోకి తీసుకునేందుకు ఆమోదం తెలుపుతూ రాష్ట్ర జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఉత్తర్వు జారీ చేశారు.



తుపాకీ గురిపెడుతున్న దుండగులు

దోపిడీ దొంగల బీభత్సం

ఏటీఎంలో పెట్టాల్సిన రూ.93 లక్షలతో పరార్

» బీదర్, హైదరాబాద్‌లో కాల్పులు.. ఇద్దరి మృతి

» నిందితుల కోసం ప్రత్యేక బృందాల గాలింపు

బెంగళూరు, ఆబిడ్స్/మంగళ్‌హాట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దోపిడీ దొంగలు కర్ణాటక రాష్ట్రంలోని బీదర్, హైదరాబాద్‌లోని ఆబిడ్స్‌లో కాల్పులతో బీభత్సం సృష్టించారు. బీదర్‌లో ఓ ఏటీఎంలో జమచేయాల్సిన రూ.93 లక్షలను కొల్లగొట్టగా.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు పరారయ్యే క్రమంలో.. హైదరాబాద్‌లో కాల్పులు జరిపారు. బీదర్‌లో జరిపిన కాల్పుల్లో ఓ సెక్యూరిటీ గార్డు మృతిచెందగా.. మరొక గార్డు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్‌లో ఓ ట్రావెల్స్ ఉద్యోగికి తూటా గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. బీదర్‌లోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయానికి సమీపంలోని ఏటీఎంలో నగదును నింపేందుకు సెక్యూరిటీ ఏజెన్సీ సిబ్బంది తమ వాహనంలో గురువారం ఉదయం 10.55 సమయంలో చేరుకున్నారు. వారు ఏటీఎం వద్ద వాహనాన్ని నిలిపి.. రూ.93 లక్షలున్న ట్రంకు పెట్టెను కిందకు దింపగానే.. ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు దుండగులు సిబ్బంది కళ్లలో కారం చల్లి.. పిస్టల్‌తో ఎనిమిది రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ ఘటనలో గిరి వెంకటేశ్(40) అనే సెక్యూరిటీ గార్డు అక్కడికక్కడే మరణించగా.. మరో గార్డు శివకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆ వెంటనే దుండగులు ట్రంకుపెట్టెతో ద్విచక్రవాహనంపై పారిపోయారు. ఈ క్రమంలో కొందరు స్థానికులు వారిపై రాళ్లతో దాడి చేశారు. అయితే.. దుండగుల చేతిలో తుపాకీ ఉండడంతో వెంబడించలేకపోయారు.

హైదరాబాద్‌కు దుండగులు

ఈ ఘటన జరిగిన వెంటనే బీదర్ పోలీసులు జిల్లా వ్యాప్తంగా అప్రమత్తమై.. చెక్‌పోస్టుల వద్ద హైఅలెర్ట్ ప్రకటించారు. అయితే.. దుండగులు ట్రంకు పెట్టెలోని నగదును బ్యాగుల్లోకి మార్చుకుని, హైదరాబాద్ చేరుకున్నారు. మధ్యాహ్నం 3.30 సమయంలో ఆబిడ్స్ సమీపంలోని రోషన్ ట్రావెల్స్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యపట్టణం రాయ్‌పూర్ వెళ్లేందుకు రూ.4,400 చెల్లించి, రెండు బస్ టికెట్లు తీసుకున్నారు. సాయంత్రం 6.30 సమయంలో బస్సు రాగా.. ట్రావెల్స్ సిబ్బంది ప్రయాణికుల వివరాలను నమోదు చేసుకుని, వారి లగేజీని తనిఖీ చేసి, లోనికి అనుమతించారు. కాకతాళీయంగా కర్ణాటక పోలీసులు ఇద్దరు ఇదే బస్సులో ఉండగా.. తాము పోలీసులమని చెబుతున్నా.. ట్రావెల్స్ ఉద్యోగి జహంగీర్ వారి లగేజీని తనిఖీ చేశారు. ఏటీఎం దుండగులను కూడా బ్యాగులు చూపించాలని సిబ్బంది కోరగా.. రూ.50 వేలు ఇవ్వజూపారు. దాన్ని సున్నితంగా తిరస్కరించిన జహంగీర్.. బ్యాగులను తెరిచి, చూశారు. అందులో డబ్బుల కట్టలుండడంతో.. వారిని కిందకు దింపి, పోలీసులకు సమాచారం ఇస్తామని బెదిరించారు. దాంతో దుండగులు అతనిపై కాల్పులు జరిపి, పరారయ్యారు. జహంగీర్ కడుపు, తొడ భాగాల్లో తూటా గాయాలయ్యాయి. దాంతో.. ట్రావెల్స్ యజమాని అతణ్ని చికిత్స నిమిత్తం ఆస్రా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసుకుని, డీసీపీ బాలస్వామి నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నగరంలోని సీసీకెమెరాల ఫుటేజీ ఆధారంగా దుండగుల అరెస్టుకు ప్రయత్నాలు చేస్తున్నారు.


సింగపూర్, దావో‌స్‌కు రేవంత్

6 రోజుల విదేశీ పర్యటనకు సీఎం బృందం.. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పరిశీలన

హైదరాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు భారీగా పెట్టుబడులను సమీకరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్, దావోస్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఆరు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా గురువారం రాత్రి ఆయన ఢిల్లీ నుంచి సింగపూర్ వెళ్లారు. అక్కడ మూడు రోజుల పర్యటన అనంతరం దావోస్ వెళ్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటనలో సీఎం రేవంత్ వెంట ఉంటారు. శుక్ర, శని, ఆదివారాల్లో సీఎం, మంత్రి, అధికారులు సింగపూర్‌లో పర్యటిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతారు. ఈ సందర్భంగా ప్రపంచంలో పేరొందిన సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను సందర్శిస్తారు. నైపుణ్యాభివృద్ధికి ఆ యూనివర్సిటీ ఎంచుకున్న కోర్సులు, అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకారం అందించేందుకు సింగపూర్ ఐటీఈతో ఒప్పందం చేసుకుంటారు. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ప్రపంచ స్థాయిలో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నందున అక్కడి రివర్ ఫ్రంట్ ఏరియాను అభివృద్ధి చేసిన తీరును పరిశీలిస్తారు. సింగపూర్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి, బృంద సభ్యులు ఈ నెల 20న ఉదయం దావోస్ చేరుకుంటారు. 20 నుంచి 22 వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు-2025లో పాల్గొంటారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి.

రాష్ట్ర అభివృద్ధికి సహకరించండి

వివిధ ప్రాజెక్టులకు అటవీశాఖ అనుమతులివ్వండి.. కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి వినతి



ఢిల్లీలోని ఇందిరా పర్యావరణ్ భవన్‌లో కేంద్రమంత్రి భూపేందర్ యాదవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం, పొంగులేటి

న్యూఢిల్లీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల్లో మోదీ ప్రభుత్వం నుంచి సహకారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను మంజూరు చేయాలని కేంద్రంలో ఆ శాఖ మంత్రి అయిన భూపేందర్ యాదవ్‌కు రేవంత్ విజ్ఞప్తి చేశారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో రాష్ట్రంలో 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని వివరించారు. 38 ప్రాజెక్టులకు వన్యప్రాణి సంరక్షణ చట్టం అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుల్లో ఎక్కువగా మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఇందిరా పర్యావరణ్ భవన్‌లో భూపేందర్‌తో సీఎం భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నారు. భేటీ సందర్భంగా సీఎం పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎస్‌వై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని సీఎం తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన పనులకు అనుమతులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వినతులకు భూపేందర్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో తిరిగే వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి రేవంత్ విజ్ఞప్తి చేశారు. కుమారస్వామి కార్యాలయానికి వెళ్లి ఆయనతో సీఎం భేటీ అయ్యారు. పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో బస్సులు కేటాయించాలని ఇప్పటికే తమ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రిట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. హైదరాబాద్‌కు కేంద్రం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రిట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కార్యాలయానికి వెళ్లిన సీఎం, ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం, పొంగులేటి, ఎంపీలు బలరాంనాయక్, రఘువీర్‌రెడ్డి, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్సీ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

లిక్కర్ స్కాంలో భాగస్వాములను ఓడించాం


(మొదటిపేజీ తరువాయి)

ఢిల్లీకి మూడు సార్లు సీఎం అయినా చేసిందేమీ లేదని విమర్శించారు. పేర్లు వేరయినా వారి చేతలు ఒక్కటేనని అన్నారు. ఢిల్లీలోని కాంగ్రెస్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఢిల్లీ శాసనసభ ఎన్నికలకు సంబంధించిన కాంగ్రెస్ రెండు గ్యారెంటీలను సీఎం రేవంత్ ప్రకటించారు. రూ.500కు గ్యాస్ సిలిండర్, వంట సామగ్రి కిట్ (2 కిలోల పంచదార, లీటర్ వంట నూనె, 6 కిలోల పప్పులు, 250 గ్రాముల టీ పొడి), 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ హామీలను ప్రకటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్నామని, అందుకే ఇక్కడ వాగ్దానాలు చేస్తున్నామని సీఎం అన్నారు. తెలంగాణలో 25.50 లక్షల మంది రైతులకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశామని తెలిపారు. స్వతంత్ర భారత చరిత్రలో యూపీ, గుజరాత్ వంటి రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఇంత పెద్ద మొత్తంలో రుణమాఫీ చేయలేదని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పిన మోదీ.. 10 ఏళ్లలో 7 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని.. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 120 కోట్ల మంది మహిళలు తెలంగాణలో ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని, అందుకు రూ.4 వేల కోట్లు ఆర్టీసీకి తమ ప్రభుత్వం చెల్లించిందని తెలిపారు. 50 లక్షల మంది రూ.500 సిలిండర్ పథకం, ఉచిత విద్యుత్ కింద లబ్ధి పొందుతున్నారని చెప్పారు. తాము ఎన్నికల కోసం రాజకీయం చేయబోమని, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని అన్నారు. షీలా దీక్షిత్ మూడు సార్లు ఢిల్లీ సీఎంగా పని చేసి మెట్రోతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టారని అన్నారు. ప్రధాని మోదీ, సీఎం కేజ్రీవాల్, షీలా దీక్షిత్ చేపట్టిన అభివృద్ధి పనులను పోల్చి చూడాలని ఢిల్లీ ప్రజలను కోరారు. తమ పార్టీ ఇచ్చిన హామీలతో ఢిల్లీలో పేద ప్రజల స్థితిగతులు మెరుగవుతాయని, ఢిల్లీలో అధికారంలోకి వచ్చాక హామీలను అమలు చేసే బాధ్యత తనదని అన్నారు. అవినీతిని నిర్మూలిస్తే హామీలను నెరవేర్చవచ్చని, తెలంగాణలో తాము కేసీఆర్ అవినీతిని నిర్మూలించి హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. తమ పార్టీకి లోక్‌సభలో 100 మంది ఎంపీలు ఉన్నారని, ఢిల్లీ సమస్యలపై పార్లమెంటులో ఒత్తిడి తేగలమని, కేజ్రీవాల్ ఏం చేస్తారని రేవంత్ ప్రశ్నించారు.

ఏడు నెలల్లో 4 లక్షల కోట్ల పెట్టుబడులు

మళ్లీ పట్టాలెక్కిన అమరావతి, పోలవరం

కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే ఇకపై ఎన్నికల్లో పోటీకి అవకాశం: ఏపీ సీఎం చంద్రబాబు



అమరావతి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'ఏడు నెలల్లో రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడులు సాధించాను. రూ.లక్షా 85 వేల కోట్ల వ్యయంతో గ్రీన్ హైడ్రోజన్ హబ్ నిర్మాణానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. రూ.లక్ష కోట్లతో బీపీసీఎల్ ఆయిల్ రిఫైనరీ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఆర్సెలార్ నిప్పన్ కంపెనీ అనకాపల్లి జిల్లాలో రూ.లక్షా 40 వేల కోట్లతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఆసక్తి చూపుతోంది. పూర్తిగా నిలిచిపోయిన అమరావతి, పోలవరం ప్రాజెక్టులు మళ్లీ పట్టాలెక్కించాం. పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కూడా చేపట్టి పూర్తి చేస్తాం" అని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో విశాఖలో తలసరి ఆదాయం పెరుగుతుందని.. చుట్టూ పారిశ్రామికీకరణ జరుగుతుండడం వల్ల తిరుపతి అతి పెద్ద నగరంగా మారుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికీ ఒక ఇల్లు, మరుగు దొడ్డి, విద్యుత్, నీటి కనెక్షన్లు, పైపు ద్వారా గ్యాస్ సరఫరా, ఇంటిపైన సౌర విద్యుత్ తయారీకి పలకలు, ప్రతి వీధిలో వీధిదీపాలు, ప్రతి ఊరిలో ప్రకృతి వ్యవసాయం ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కనీసం ఇద్దరు పిల్లలు ఉంటేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అవకాశం కల్పించాలని యోచిస్తున్నామని, చట్టం చేసిన తర్వాత పిల్లలు కనేవారికే ఇది వర్తిస్తుందని పేర్కొన్నారు.

తొలుత రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపై విచారణ

సెక్షన్-3 కింద వాదనలు వింటాం.. ఆ తర్వాతే పునర్విభజన చట్టంలోని సెక్షన్-89 కింద విచారణ చేపడతాం

» కృష్ణా ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు

» తెలంగాణ వాదనపై సానుకూల నిర్ణయం

హైదరాబాద్/న్యూఢిల్లీ, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం జారీ చేసిన విచారణ విధి విధానాల ప్రకారం రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపైనే తొలుత వాదనలు వింటామని కృష్ణా ట్రిబ్యునల్-2(జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్) స్పష్టం చేసింది. ఆ తర్వాతే రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్- 89 కింద విచారణ నిర్వహిస్తామని పేర్కొంది. తెలంగాణ దాఖలు చేసిన ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్(ఐఏ)పై గురువారం ఢిల్లీలో విచారణ చేపట్టిన ట్రిబ్యునల్.. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సెక్షన్-3 కిందే తొలుత విచారణ జరపాలని కొన్నేళ్లుగా తెలంగాణ పట్టుబడుతుండగా, తాజా నిర్ణయంతో రాష్ట్ర వాదన నెరవేరినట్టు అయింది. ఈ అంశంపై ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ దాకా వాదనలు ట్రిబ్యునల్ ముందు జరగనున్నాయి. గురువారం కృష్ణా ట్రిబ్యునల్ విచారణకు మంత్రి ఉత్తమ్ హాజరయ్యారు. గత 11 ఏళ్లలో తెలంగాణ తరపున నీటిపారుదల శాఖ మంత్రి హాజరు కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

సెక్షన్-3, సెక్షన్-89 చెబుతున్నదేంటి?

తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్-89కింద ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాల కేటాయింపులపై విచారణ జరపాలని జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ కోరుతూ కేంద్రం విధివిధానాలు జారీ చేసింది. గతంలో రాష్ట్రాల్లోని 'ప్రాజెక్టుల వారీ'గా నిర్దిష్ట కేటాయింపులు జరిగి ఉండకపోతే, ఇప్పుడు జరపాలని సూచించింది. నీటి లభ్యత లేని సమయాల్లో ప్రాజెక్టుల వారీగా నీటి విడుదల విషయంలో అమలు చేయాల్సిన ఆపరేషన్స్ ప్రొటోకాల్స్‌ను సిద్ధం చేయాలని పేర్కొంది. అయితే, ఈ పరిధిలోకి ఏయే ప్రాజెక్టులొస్తాయన్న అంశంపై స్పష్టత ఇవ్వలేదు. దీనిపై తెలంగాణ పలు మార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956లోని సెక్షన్-3 కింద రాష్ట్రాలవారీగా కృష్ణా జలాలు కేటాయించిన తర్వాతే, ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాలని పట్టుబట్టింది. ఎట్టకేలకు దీనిపై స్పందించిన కేంద్రం కృష్ణా ట్రిబ్యునల్-2కు అదనపు రెఫరెన్స్(మరిన్ని విధివిధానాలను)జారీ చేస్తూ 2023 అక్టోబరు 6న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సెక్షన్ 89(ఏ), 89(బీ)లోని 'ప్రాజెక్టుల వారీగా' అనే పదానికి విస్తృత అర్థాన్ని ఇచ్చింది. ఈ మేరకు తాజాగా కృష్ణా ట్రిబ్యునల్-2 దీనిపై నిర్ణయం తీసుకుంది. తొలి, తదుపరి విధివిధానాల్లో చాలా అంశాలు ఒకేరకంగా ఉన్నాయని, రెండింటినీ కలిపి విచారిస్తే సుప్రీంలో ఏపీ వాదన నెగ్గితే సమస్య తలెత్తుతుందని ట్రిబ్యునల్ అభిప్రాయపడింది. అందువల్ల నదీజలాల పంపిణీకి సంబంధించిన ప్రశ్నను పరిశీలించే తదుపరి విధి విధానాలను విచారించడమే సవ్యంగా ఉంటుందని చైర్మన్ బ్రిజేశ్ కుమార్, సభ్యులు జస్టిస్ తలపాత్ర, జస్టిస్ రామ్మోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.



ట్రిబ్యునల్ విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్

తెలంగాణ వాదనలవైపే బ్రిజేశ్ ట్రిబ్యునల్ మొగ్గ

అత్యంత సానుకూల పరిణామం: ఉత్తమ్

తెలంగాణ ఫిర్యాదుల ఆధారంగా కేంద్రం నివేదించిన తదుపరి విధి విధానాల విచారణను ముందుగా విచారించాలని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయించిందని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు సంబంధించి ఇది అత్యంత సానుకూల పరిణామంగా ఆయన అభివర్ణించారు. ఫిబ్రవరి 19 నుంచి 21 వరకు బ్రజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తుది విచారణలో భాగంగా వాదనలను వినడం ప్రారంభిస్తుందని, తొలుత తెలంగాణయే తన వాదనలను వినిపిస్తుందని ఆయన చెప్పారు. ఈ ట్రిబ్యునల్‌కు సెక్షన్-3 ఆధారంగా తదుపరి విధి విధానాలను నివేదించడంతో విచారణ చేపట్టిందని, సెక్షన్-3 నివేదిక చెల్లుబాటు కాదని సుప్రీంలో ఏపీ రిట్ పిటిషన్ వేసినప్పటికీ సుప్రీం ఎలాంటి స్టే ఇవ్వలేదని, తదనుగుణంగా ట్రిబ్యునల్ తన విచారణ కొనసాగించాలని సూచించిందని తెలంగాణ నీటిపారుదల మంత్రిత్వ శాఖ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు తుది విచారణ ప్రారంభం కానున్న సమయంలో తెలంగాణ వాదనలను వినడం సానుకూల పరిణామంగా తెలంగాణ ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

తెలంగాణ సాధనలో జైపాల్‌రెడ్డిది కీలక పాత్ర

జీవితాంతం ఆయన విలువలకు కట్టుబడ్డారు: సీఎం రేవంత్

» గొప్ప రాజనీతిజ్ఞుడు: వెంకయ్య నాయుడు

» జైపాల్ జయంతి సందర్భంగా నివాళులు

న్యూఢిల్లీ/హైదరాబాద్/ఖైరతాబాద్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ కల సాకారంలో కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి పాత్ర చిరస్మరణీయమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. జైపాల్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని గురువారం ఢిల్లీలో ఆయన చిత్రపటానికి సీఎం పూలమాల వేసి నివాళులర్పించారు. తెలంగాణలోని మారుమూల పల్లె నుంచి ఢిల్లీ దాకా సాగిన ప్రస్థానంలో జైపాల్‌రెడ్డి జీవితాంతం నైతిక విలువలకు కట్టుబడ్డారని చెప్పారు. ఉమ్మడి ఏపీ అసెంబ్లీ, పార్లమెంట్ ఉభయ సభల్లో గళం వినిపించారన్నారు. మంత్రి పొంగులేటి, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, రామ్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ పాల్గొన్నారు.

స్ఫూర్తి స్థల్‌లో నివాళులు

రాజకీయాల్లో విలువలు, నిజాయతీగల గొప్ప రాజకీయ నాయకుడు జైపాల్‌రెడ్డి అని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ పీవీ నరసింహారావు మార్గంలోని స్ఫూర్తి స్థల్‌లో ప్రభుత్వం అధికారిక కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా నివాళులర్పించిన అనంతరం వెంకయ్య మాట్లాడారు. సమకాలీన భారత రాజకీయాల్లో మొదటి రాజనీతిజ్ఞుడు జైపాల్‌రెడ్డి అని కొనియాడారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో మచ్చలేని వ్యక్తుల జాబితాలో మొదటి వరుసలో జైపాల్‌రెడ్డి ఉంటారన్నారు. పాలమూరు జిల్లాకు ఆయన పేరును పెట్టాలని కోరారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డిని తెలంగాణ వాసులు ఎన్నటికీ మరచిపోరని, ఆయన చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని అన్నారు. స్ఫూర్తి స్థల్‌లో నివాళులర్పించిన వారిలో సీఎం సతీమణి గీతారెడ్డి, ఇతర కుటుంబసభ్యులు, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, సుదర్శన్‌రెడ్డి, పద్మావతీరెడ్డి, యశస్విని రెడ్డి, జైవీర్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, ఉండవల్లి అరుణ్‌కుమార్, కేవీపీ రామచంద్రరావు ఉన్నారు. గాంధీభవన్‌లోనూ పలువురు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు.



స్ఫూర్తి స్థల్ వద్ద నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు, చిత్రంలో సీఎం రేవంత్ సతీమణి గీతారెడ్డి

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.